మనోరంజని (?) ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital

మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
KAPIL GROUP కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
23-12-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 322 పేజీలు: 10+4 వెల: 6.50



## 'శాంతి' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

### అణు విద్యుదుత్పత్తిలో ప్రైవేటు భాగస్వామ్యానికి అవకాశం

**న్యూఢిల్లీ, డిసెంబరు 22:** అణు రంగంలో ప్రైవేట్ భాగస్వామాన్ని అనుమతించే సస్టెయిన బుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. శాంతి బిల్లుకు ఇటీవల రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారని కేంద్రం తాజాగా ఓ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ బిల్లు పౌరఅణురంగాన్నినియంత్రించే ప్రస్తుత చట్టాలన్నింటినీ విలీనం చేయడం సహా >>2

## రాష్ట్రపతి ముర్ము శీతాకాల విడిది పూర్తి ఢిల్లీకి పయనం 2లో

## భారత్, న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు 7లో



## నేషనల్ హెరాల్డ్ కేసు: సోనియా, రాహుల్‌కు నోటీసులు

**న్యూఢిల్లీ, డిసెంబరు 22:** కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నేషనల్ హెరాల్డ్ కేసులో ఇడి దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని ఆ నోటీసులలో వారిని కోరింది. ఈ కేసుకు సంబంధించి గతంలో మనీలాండరింగ్ ఆరోపణలతో ఇడి ట్రయల్ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే ఆ ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి ట్రయల్ కోర్టు నిరాకరించింది. దాంతో ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని ఇడి >>2

## సైబర్ ఉచ్చులో మాజీ ఐజీ

### రూ. 8.10 కోట్లు పోగొట్టుకొని ఆత్మహత్య

**అమృత్‌సర్, డిసెంబరు 22:** పంజాబ్ రాష్ట్రానికి చెందిన రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీ) అమర్ సింగ్ చాహల్ కన్నుమూశారు. భారీ సైబర్ మోసంలో రూ.8.10 కోట్లు నష్టపోయిన ఆయన, తీవ్రమనస్తాపంతో సోమవారం తన నివాసంలో తుపాకీతో కాల్చుకున్నారు. సిబ్బంది పోలీసులు ఆయన్ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా సుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మరణించారు. ఈ ఘటన పోలీసు వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. పాటియాలాలోని తన నివాసంలో సెక్యూరిటీ గార్డుకు చెందిన రివాల్వర్‌తో ఆయన కాల్చుకున్నట్లు పోలీసులు తెలిపారు. >>2

# మీది హైప్.. మాది హోప్

### రెండేళ్లలో రూ. 3.40 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం

### 1.40 లక్షల మందికి ఉద్యోగావకాశాలు

### కెసిఆర్ విమర్శలపై మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్

**ప్రభాతవార్త ప్రధానప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 22:** నిరుద్యోగులకు ఉద్యోగాలు రావొద్దని బిఆర్‌ఎస్ నాయకత్వం కోరుకుంటోందని ఐటి, పరిశ్రమల శాఖమంత్రి డి.శ్రీధర్‌బాబు ఆరోపించారు. 'మీది హైప్ క్రియేట్ చేసే వర్కింగ్ కల్చర్... మాది 'హోప్' క్రియేట్ చేసే వర్కింగ్ కల్చర్. మీహయాంలో చేసిందితక్కువ, చెప్పుకుంది ఎక్కువ. మా హయాంలో చేసేదే ఎక్కువ, చెప్పుకు నేదితక్కువ' అని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో తన ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. మీలాగా మాకు గాల్లో మేడలు కట్టడంరాదు. అరచేతిలో స్వర్గం చూపించడం అసలే రాదు అని పేర్కొన్నారు.రాష్ట్రానికి పరిశ్రమలు రావొద్దు...పెట్టుబడులు రావొద్దు. యువతకు ఉద్యోగాలురావొద్దు. ఇదే బిఆర్‌ఎస్



పాలసీ. అందుకే... రాష్ట్రంలో పెట్టబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూలు చేసుకున్న దిగ్గజ కంపెనీలను కించపర్చడం మంచిది కాదు. ఒక సీనియర్ నాయకుడిగా మీకిది >>2

# 29 నుంచి అసెంబ్లీ

### గోదావరి, కృష్ణా నదీ జలాలే ప్రధాన అజెండా

### పరిషత్, మునిసిపల్ ఎన్నికల్లో 42% రిజర్వేషన్లపై చర్చ

### ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికల్లో మంత్రులు మరింత బలంగా పనిచేయాలి: సిఎం రేవంత్ రెడ్డి



సోమవారం హైదరాబాద్‌లో పంచాయతీ ప్రజాప్రతినిధుల కరదీపిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, అజారుద్దీన్, కొండా సురేఖ, జూపల్లి, సీతక్క, పొంగులేటి తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 22:** తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈనెల 29నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు మొదట డిసెంబరు 28వ తేదీ, ఒకసారి, జనవరి 2వ తేదీ మరోసారి ముహూర్తం సర్కార్ అనుకున్నా తాజాగా నిర్ణయాన్ని మార్చుకుంది. గోదావరి, కృష్ణా నదీజలాల అంశాలే ప్రధాన అజెండాగా ఈ అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఎపి,టిజి నీటి వాటాలు, కేంద్రం వద్ద, పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చ జరుగనుంది. ఆంధ్రప్రదేశ్ అక్రమ నీటి వినియోగం, అనుమతి లేకుండా చేపడుతున్న ప్రాజెక్టులను అడ్డుకునేందుకు చేపట్టిన చర్యలపై ప్రభుత్వం చర్చించనుంది. నీటిపారుదల అంశాలపై గత ప్రభుత్వం అనుసరించిన విధానాలను అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎండగట్టాలని కమాండ్ కంట్రోల్‌లో జరిగిన మంత్రుల భేటీలో సిఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు సమాచారం. ఇదే సమయంలో జెడిపిటీసి,ఎంపిటిసీ స్థానిక సంస్థల ఎన్నికలపై అసెంబ్లీలో చర్చించనున్నారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం >>2

# చెక్‌డామ్‌ల కూల్చివేతపై విజిలెన్స్ విచారణ

### పెద్దపల్లి జిల్లాలో చెక్‌డామ్‌ల అధ్వాన్న స్థితిపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం

### విద్రోహులపై కఠిన చర్యలు తప్పవు

### మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్



**హైదరబాద్, డిసెంబరు 22,ప్రభాతవార్త:** పెద్దపల్లి జిల్లా గుంపుల, అడవి సోమనపల్లి గ్రామాల్లో చెక్ డ్యాంలు కూలిపోవడంపై నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా వరుసగా సంభవిస్తున్న కూల్చివేతలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించామని తెలిపారు. సోమవారం గుంపుల, అడవిసోమనిపల్లి గ్రామాల్లో కూలిపోయిన చెక్ డ్యాంలను ఆయన పరిశీలించారు. మానేరునదికి అడ్డంగా నిర్మించిన చెక్ డామ్‌లు నాసిరకంగా, నాణ్యతలేమితో ఉన్నాయా ఎవరైనా కావాలనే ధ్వంసం చేశారా అనే అంశం పరిశీలించడానికి విజిలెన్స్ విచారణకు ఆదేశించడం జరిగిందని వివరించారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేసినట్లు తేలినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలు, విద్రోహక చర్యలపై మా ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని తెలిపారు. విచారణను వేగవంతం చేసి బాధ్యులను గుర్తించాలని ఇప్పటికే విజిలెన్స్ డిపార్ట్ మెంట్‌ను ఆదేశించడం జరిగిందని చెప్పారు రాష్ట్రవ్యాప్తంగా ఎవరైనా కావాలని రైతన్నలకు మేలు చేసే చెక్ డ్యాంలను ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తే ఊపేక్షి ంచబోమని చెప్పారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సచివాలయంలో విలేకరులతో చిట్‌చాట్ చేస్తూ హరీష్‌రావు తన పేరు గోబెల్స్ రావు అని మార్చుకోవాలనిసూచించారు. కాళేశ్వరంలో మూడు బ్యారేజ్‌లు కూలిపోతే సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి ఎదురు దాడి చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం విషయంలో బిఆర్‌ఎస్ నాయకులు సిగ్గుతో తలవంచుకోవాలని అన్నారు. తెలంగాణ ప్రజల తలలను తాకట్టు పెట్టి కాళేశ్వరం కట్టారని ఐనా బరితెగింపు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు.రాష్ట్రంలో ఇప్పుడు సాగునీటిని అందించే ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్. కెసిఆర్ కట్టిన కాళేశ్వరం ఒకటి కూలిపోయిందని చెప్పారు. కాళేశ్వరం నుంచి ఐదేళ్లలో 80నుంచి 90 టిఎంసిలు ఎత్తిపోసి వివిధ ప్రాజెక్టులకు అందిచారని గుర్తుచేశారు. హరీష్ రావు అతి తెలివి తేటలు వాడటం ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. కృష్ణా జలాల విషయంలో 2014 నుంచి 2020 వరకు ఆపెక్స్ కౌన్సిల్ భేటీలో కెసిఆర్ ఆంధ్రకు 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలకు ఒప్పుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలోని పాలమూరు, కల్వ కుర్తి, నెట్టెంపాడు, డిండి, ప్రాజెక్టులను కెసిఆర్ ఎందుకు పూర్తి చెయ్యలేదని నిలదీశారు. కెసిఆర్, హరీష్‌రావు బరితెగించి మాట్లాడుడు మానుకోవాలని హితవు చెప్పారు. కెసిఆర్ అప్పులు తీర్చడానికి >>2

## విద్యుత్ ఉద్యోగులకు 17.65% డిఎ

### ప్రతిపాదనలకు డిప్యూటీ సిఎం భట్టి ఆమోదం

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులకు డిఎ పెంపుదలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి విద్యుత్ ఉద్యోగులకు 17.651 శాతం డిఎ ఖరారు చేసింది. ఈ మేరకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 71,387 మంది విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజెన్లు, పెన్షనర్లు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఆ మేరకు రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలపై సంవత్సరానికి 112.68 కోట్ల రూపాయల మేర అదనపు భారం పడుతుందని చెప్పారు.
బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న ధరల సూచి ఆధారంగా ప్రతి ఏటా జనవరి, జులై నెలలో డియర్ నెస్ అలవెన్స్ (డిఎ)/ డియర్ నెస్ రిలీఫ్ (డిఆర్)ను సమీక్షిస్తూ విడుదల చేస్తారని తెలిపారు. అందులో భాగంగా ఈ ఏడాది జూలై 1 నుండి అమలయ్యేలా ఉద్యోగులు,ఆర్టిజన్లు, పెన్షనర్లకు డిఎ/డిఆర్ ను 17.651 శాతంగా >>2

# చలికి గిలగిల



### మరో వారం రోజులు ఇంతే..

### ఆసిఫాబాద్‌లో 7°, ఆదిలాబాద్‌లో 8.3°

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చలి వణికిస్తోంది అత్యల్ప ఉష్ణోగ్రతలు కొనసాగుతూనే వున్నాయి. ఆదివారంతో పోలిస్తే సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు తొమ్మిది జిల్లాలకే పరిమితమవడం గమనార్హం. అత్యల్ప ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే ఆసిఫాబాద్‌లో ఏడు, సంగారెడ్డిలో 7.5, ఆదిలాబాద్‌లో 8.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా అత్యధికంగా సూర్యాపేట్‌లో 13.2 డిగ్రీలు వుంది. రాష్ట్ర వ్యాప్తంగా మరో వారం రోజుల పాటు చలి తీవ్రత వుంటుందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. చలి కారణంగా దాదాపు అన్ని జిల్లాలలో ఉదయం ఎనిమిది గంటల వరకు ప్రజలు బయటకు రావడం లేదు. సాయంత్రం ఆరుగంటలకే ఇళ్లకు వెళ్లి పోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం >>2



గెలుపుపత్రం చూపుతూ వాగ్వాదం చేస్తున్న బిఆర్‌ఎస్ అభ్యర్థి



సర్పంచ్‌గా సనప సుజాతతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న అధికారి

# ప్రమాణ స్వీకార 'పంచాయితీ'!

### గెలుపు పత్రాల గందరగోళంతో చివరిదాకా ఉత్కంఠ

### పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన 'దామరవంచ'

**గూడూరు, డిసెంబరు 22, ప్రభాతవార్త:** మండలంలోని దామరవంచ గ్రామంలో నూతన పంచాయతి పాలకవర్గ ప్రమాణస్వీకార పర్వం ఉత్కంఠ పరిస్థితుల మధ్య కొనసాగింది. ఇద్దరు సర్పంచ్ అభ్యర్థుల వద్ద గెలుపు ధృవీకరణ పత్రాలు ఉండడంతో గందరగోళ పరిస్థితికి దారితీసింది. తెల్లవారితే ప్రమాణ స్వీకార ప్రక్రియకు ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో ఆదివారం రాత్రి సర్పంచ్‌గా ఓడి పోయినట్లుగా అధికారులు ప్రకటించిన అభ్యర్థి తన వద్ద గెలుపు ధృవీకరణపత్రం ఉందని, తాను కూడా ప్రమాణ స్వీకారానికి హాజరవుతానని సోషల్‌మీడియా ద్వారా బహిర్గతం చేయడంతో ఈ వ్యవహారం ఒక్కసారిగా వైరల్‌గా మారింది. దీంతో సోమవారం జరగాల్సిన ప్రమాణస్వీకార ఘట్టంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసు >>2

# 'ఫోన్ ట్యాపింగ్' మళ్లీ మొదటికి!

### నాటి బాస్‌లకు పోలీసుల తాఖీదులు

### కొందరి వాంగ్మూలం నమోదు

### ప్రభాకర్ రావును ఏడు గంటలపాటు ప్రశ్నించిన అధికారులు

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు మళ్లీ మొదటికి వచ్చింది. ఈ కేసులో మొదటి ముద్దాయిగా వుండి, పోలీసు కస్టడీలో వున్న ఎస్‌ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావును విచారించిన క్రమంలో వెలుగు చూసిన విషయాల ఆధారంగా బిఆర్‌ఎస్ హయాంలో కీలక పోస్టుల్లో వున్న వారికి పోలీసులు తాఖీదులు జారీ చేశారు. ఇందులో కొందరు విశ్రాంత ఐఎఎస్‌లు, ఐపిఎస్ అధికారులను ఫోన్ ట్యాపింగ్ కేసును విచారిస్తున్న సిట్ బృందం విచారించగా మిగతా వారిని రెండు మూడు రోజుల్లో విచారించే వీలుంది. మరోవైపు ప్రభాకర్ రావు మూడవ రోజు విచారణ సోమవారం నాడు జరిగింది. ఈ విచారణకు రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, సిద్దిపేట్ పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ సహా మరో ముగ్గురు హాజరై ప్రభాకర్ రావును ఏడు గంటల పాటు భిన్న కోణాల్లో ప్రశ్నించారు.రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ సుధీర్ఘంగా సాగే అవకాశాలున్నాయి. 2023 మార్చిలో నమోదైన ఈ కేసు విచారణ 20 నెలలుగా సాగుతుండడం తెలిసిందే. ఈ కేసులో >>2



## బిజెపికే అత్యధిక విరాళాలు

## 27న సిడబ్ల్యుసి భేటీ

## భారత్ ముమ్మాటికీ హిందూ దేశమే -మోహన్ భగవత్ 5లో



సోమవారం న్యూఢిల్లీలో డిఆర్‌డిఒ మరియు ఆర్‌ఆర్‌యూ మధ్య రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో ఎంఒయు కుదిరిన దృశ్యం

# 'శాంతి' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

>> ప్రైవేట్ భాగస్వామ్యానికి మార్గం సుగమం చేయనుంది. దీంతో దేశంలో అణు అభివృద్ధికి అడ్డంకిగా ఉన్నాయని కేంద్రం భావిస్తోన్న 1962 నాటి అణుశక్తిచట్టం, 2010నాటి అణు బాధ్యత సంబంధిత చట్టాలు రద్దయాయి. కొత్త చట్టం ప్రకారం ప్రైవేట్ కంపెనీలు సహా జాయింట్ వెంచరు ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా నూతన అణు విద్యుత్ ప్లాంట్లను నిర్మించవచ్చు. అంతేకాకుండా వాటిని నిర్వహించుకునే వెసులుబాటు సహా సొంతం చేసుకునే లేదా తొలగించే అవకాశం కూడా ఉంటుంది. అయితే.. వ్యూహాత్మక, సున్నితమైన కార్యకలాపాలు మాత్రం రాష్ట్ర నియంత్రణలోనే ఉంటాయనే విషయాన్ని ఈ బిల్లు స్పష్టం చేస్తుంది. యురేనియం , థోరియం వంటి తవ్వకాలు, ఐసోటోపిక్ విభజన, పునరుత్పాదక ఇంధనాలు, అధిక స్థాయి రేడియోధార్మిక వ్యర్థాల నిర్వహణ, భారీ నీటి ఉత్పత్తిని కేంద్ర ప్రభుత్వం లేదా ప్రభుత్వ యాజమాన్య సంస్థలు నిర్వహిస్తాయి. ఈ శాంతి బిల్లు అమలు దేశ పౌర అణు వ్యవస్థలో కీలక భూమిక పోషించనుంది. ప్రభుత్వం అణు ఇంధనానికి సంబంధించిన కీలక అంశాలను నియంత్రిస్తూనే విద్యుత్ ఉత్పత్తికి ప్రైవేట్ భాగస్వామ్యం కల్పించేందుకు వీలుంటుంది. ఈ బిల్లు ద్వారా ప్రైవేట్ రంగాలు సహా యువతకు అనేక అవకాశాలు కల్పిస్తాయని ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ చెప్పిన విషయం తెలిసిందే. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు, నవకల్పనల మార్గంలో ముందడుగు వేసేందుకు, నిర్మాణాలు చేపట్టేందుకూ అత్యంత అనుకూలమని కూడా ఆయన అన్నారు.



సోమవారం హకీంపేట ఎయిర్‌పోర్టులో రాష్ట్రపతి ముర్ముకు వీడ్కోలు పలుకుతున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సిఎం రేవంత్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి సీతక్క తదితరులు

# మీది హైప్.. మాది హోప్

>> తగదు అని పేర్కొన్నారు. గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్స్ కు తెలంగాణ బై ఛాయిస్ కాదు... బై డెస్టినేషన్‌గా మారింది. అందుకే ఇవాళ పరిశ్రమలు తెలంగాణకు క్యూకడుతున్నాయి. ఎక్కడో ఉండి పాలన సాగించిన మీకు, జాతీయ, అంతర్జాతీయ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు చేసుకోవడం హైప్ లాగే కనిపిస్తుంది. ఇది హైప్ కాదు, ఈ రాష్ట్రం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం మా ప్రభుత్వం క్రియేట్ చేస్తున్న హోప్ అని పేర్కొన్నారు.తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో మేం చేసుకున్న రూ.5.75 లక్షల కోట్ల ఎంవోయూలు అబద్ధమైతే జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు, వ్యాపార దిగ్గజాలు కూడా గ్లోబల్ సమ్మిట్‌కు రావడం అబద్ధమా? అని ప్రశ్నించారు. మీ హయాంలోనూ అనేక ఎంవోయూలు జరిగాయి. కానీ... అన్ని కంపెనీలు పెట్టుబడులు పెట్టాయా? ఒక్కోఎంవోయూ గ్రౌండింగ్ అయ్యేందుకు చాలా సమయం పడుతుంది. అది తెలిసి కూడా రెండేళ్లలో రూ.3.40 లక్షల పెట్టుబడులు తీసుకొచ్చిన మాపై విమర్శలు చేయడం సరికాదు అని కెసిఆర్‌పై విమర్శలు చేశారు. కొత్త పెట్టుబడులతో 1.40లక్షల మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు రానున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఎంవోయూను గ్రౌండింగ్ చేసే మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా భారత్ ఫ్యూచర్ సిటీకి శ్రీకారం చుట్టాం అని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే వారికి అవసరాలకు అనుగుణంగా అన్ని ఒకే చోట ఉండాలనే గొప్ప సంకల్పంతో ఫ్యూచర్ సిటీ ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. మీ హయాంలో ఓ అధికారి మంచి పాలసీని రూపొందించారని చెప్పారు,బాగుంది. కానీ ఆ పాలసీలో ఉన్న నిబంధనలను మీరు అమలు చేశారా? ఉత్తమ ఆఫీసర్లను ఉత్సవ విగ్రహాలుగా మార్చి, సెక్రటేరియట్‌కే వెళ్లకుండా పాలన సాగించిన చరిత్ర మీది అని వ్యాఖ్యానించారు. ఇవాళ అధికారులకుస్వేచ్ఛనిచ్చి రాష్ట్రాభివృద్ధిలో వాళ్లను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ మీద పేటెంట్ మీదా? మరి మీ హయాంలో ఎందుకు పూర్తి చేయలేదు? ఒక ప్రణాళికా ప్రకారం మేం అసంపూర్తిగా మిగిలిపోయిన పార్క్‌ను పూర్తి చేశాం. అక్కడికి దిగ్గజ కంపెనీలను తీసుకొచ్చాం. దేశంలో ఇదే మొట్టమొదటి ఫంక్షనల్ పిఎం మిత్ర పార్క్. కేంద్రం నుంచి మా హయాంలోనే రూ.30 కోట్లు ఈ పార్కు అభివృద్ధికి తీసుకొచ్చాం అని వివరించారు. వాస్తవాలు మాట్లాడితే... ఐటి, ఏరోస్పేస్, డిఫెన్స్, లైఫ్ సైన్సెస్‌లో పేటెంట్ కాంగ్రెస్ పార్టీది. ఈ రంగాల్లో తెలంగాణ ఇప్పుడు టాప్ లో ఉందంటే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎకో సిస్టం అభివృద్ధికి వేసిన పునాదులే కారణమని చెప్పారు.మీరు తొమ్మిదేళ్లలో ఐటీ ఎగుమతులను రూ.54వేల కోట్ల నుంచి రూ.2.43 లక్షల కోట్లకు తీసుకెళ్లారు. మేం కేవలం ఏడాదిన్నర వ్యవధిలోనే రూ.2.43 లక్షల కోట్ల నుంచి రూ.3.23 లక్షల కోట్లకు తీసుకెళ్లామని వివరించారు. 2024-25లో తలసరి రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్ డిపి)... తలసరి ఆదాయం... దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని తాజాగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తేల్చిందని చెప్పారు. 1. తెలంగాణ-రూ.3.87 లక్షలు, 2. కర్ణాటక - రూ.3.8 లక్షలు,3. తమిళనాడు - రూ.3.61 లక్షలు,4. మహారాష్ట్ర - రూ.3.09 లక్షలు అని వివరించారు. విమర్శలు చేసే ముందు ఒకసారి గతం కూడా చూసుకోండి. ఇది సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం. ఇక్కడ పరదాలు లేవు, కేవలం ప్రగతి మాత్రమే ఉంది. మీరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, అబద్ధాలు ప్రచారం చేసినా తెలంగాణను ప్రపంచ పటంలో నంబర్ వన్ పారిశ్రామిక రాష్ట్రంగా నిలబెడతాం. ఇందులో రాజీ పడబోమని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ప్రపంచ అవసరాల్లో మూడొంతుల వాక్సిన్లు హైదరాబాద్ నుంచే ఎగుమతి అవుతున్నాయని శ్రీధర్‌బాబు అన్నారు.

# నోటీసులు

>> ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. ఈ క్రమంలో హైకోర్టు రాహుల్‌గాంధీ, సోనియా గాంధీతోపాటు ఈ కేసులోని ఇతరులకు నోటీసులు జారీచేసింది. నేషనల్ హెరాల్డ్ పత్రికను నడిపే ఎజెఎల్‌కు కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్ల రుణం అందించింది. అందుకు బదులుగా ఎజెఎల్ కంపెనీ ఆస్తులను తమ ఆధీనంలోకి తీసుకుంది. ఈ వ్యవహారంలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతోపాటు ఇతర కాంగ్రెస్ నేతలు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబే తదితరులు మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఏజేఎల్ కంపెనీ ఆస్తులను స్వాధీనం చేసుకున్న యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ ప్రధాన వాటాదారులుగా ఉన్నారు. ఈ సంస్థ కేవలం రూ.50 లక్షలు చెల్లించి ఎజెఎల్‌కు చెందిన సుమారు రూ.2 వేల కోట్ల విలువైన ఆస్తులు పొందిందని ఇడి తన ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నది.

# నవీన్ మిట్టల్, దాన కిషోర్‌కి స్పెషల్ చీఫ్ సెక్రటరీలుగా పదోన్నతి

## పదోన్నతి పొందినప్పటికీ ప్రస్తుత శాఖల్లోనే కొనసాగింపు

**హైదరాబాద్, ప్రభాతవార్త, డిసెంబరు 22:** తెలంగాణ రాష్ట్రంలోని ఇద్దరూ సీనియర్ ఐఎఎస్ అధికారులకు పదోన్నతులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1996 బ్యాచ్‌కి చెందిన నవీన్ మిత్తల్, దాన కిషోర్ లకు స్పెషల్ చీఫ్ సెక్రటరీలో పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామ కృష్ణారావు జీవో ఆర్‌టి నంబర్ 1772ను సోమవారంజారీచేశారు. ప్రస్తుతం ఎనర్జీ శాఖలో ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతున్న నవీన్ మిత్తల్ పదోన్నతి పొందిన తరువాత కూడా అదే శాఖలో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొన్నారు. అలాగే కార్మిక శాఖలో ముఖ్యకార్యదర్శిగా కొనసాగుతున్న దాన కిషోర్‌కి కూడా పదోన్నతికల్పించి అదేశాఖలో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కొనసాగుతారని సిఎస్ స్పష్టం చేశారు.

# రాష్ట్రపతి ముర్ము శీతాకాల విడిది పూర్తి

## ఢిల్లీకి పయనం, వీడ్కోలు పలికిన సిఎం, గవర్నర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 22:** హైదరాబాదులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల శీతాకాల విడిది సోమవారంతో ముగిసింది.సాయంత్రం హైదరాబాద్ పర్యటనను ముగించుకుని ఆమె ఢిల్లీకి వెళ్లారు. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మంత్రిసీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు తదితరులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డిజిపి బి.శివధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నత స్థాయి సివిల్, రక్షణ శాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రపతి ప్రయాణం సందర్భంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి హకీంపేట ఎయిర్‌బేస్ వరకు పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి, పలుచోట్ల ట్రాఫిక్‌ను మళ్లించారు. శీతాకాల విడిది కోసం డిసెంబరు 17న హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డిసెంబరు 19న రామోజీ ఫిల్మ్ సిటీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్‌పర్సన్‌ల జాతీయ సదస్సును ప్రారంభించారు. 20న బ్రహ్మకుమారీల శాంతి సరోవర్ 21వ వార్షికోత్సవ సభలో ప్రసంగించారు. 21న రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోమ్' విందును ఏర్పాటు చేశారు.

# ప్రమాణ స్వీకార 'పంచాయితీ'!

>> కుంటాయోనన్న ఉత్కంఠ కొనసాగగా అధికారులు పోలీసుల సహకారంతో ప్రమాణ స్వీకార తంతును ఎట్టకేలకు పూర్తి చేయడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. దామరవంచ గ్రామ సర్పంచ్ పదవి కోసం కాంగ్రెస్ పక్షాన సనప సుజాతసుదర్శన్, బిఆర్ఎస్ పక్షాన నూనావత్ స్వాతిరవినాయక్‌లు పోటీ పడగా ఈనెల 11న పోలింగ్ తర్వాత నిర్వహించిన కౌంటింగ్‌లో తొలుత బిఆర్ఎస్ అభ్యర్థి మూడు ఓట్ల మెజారిటీతో ఉన్నారని, కాంగ్రెస్ అభ్యర్థి అభ్యర్థన మేరకు రికౌంటింగ్ నిర్వహించగా కాంగ్రెస్ అభ్యర్థికి ఒక ఓటు మెజారిటీ రావడంతో ఆమె గెలుపొందినట్లు ప్రకటించిన ఎన్నికల అధికారులు గెలుపు ధృవీకరణపత్రం జారీ చేసారు. పంచాయతి పరిధిలోని పది వార్డులకుగాను కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు ఐదు వార్డుల చొప్పున గెలుచుకోగా ఉపసర్పంచ్ ఎన్నికకూడా ఇచ్చిన గడువులోగా జరగకపోవడంతో నాలుగు రోజుల తర్వాత ప్రత్యేకాధికారి ఉపసర్పంచ్ ఎన్నికను నిర్వహించారు. ఈలోగా ఈనెల 22న అన్ని పంచాయతీల్లో నూతన పాలకవర్గాల ప్రమాణ స్వీకారం నిర్వహించాలని ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు దామరవంచ గ్రామంలో కూడా ఈ తంతు నిర్వహణకు పాలకవర్గ సభ్యులకు పంచాయతి కార్యదర్శి ఎజెండా జారీ చేసారు. ఒకవైపు ప్రమాణ స్వీకార వేడుకకు ఏర్పాట్లు జరుగుతుండగానే బిఆర్ఎస్ అభ్యర్థి నూనావత్ స్వాతిరవినాయక్ తాను సర్పంచ్‌గా గెలిచినట్లు ఎన్నికల అధికారులు జారీ చేసిన గెలుపు ధృవీకరణ పత్రాన్ని బహిర్గతం చేసి ఉత్కంఠకు తెరలేపారు. దీంతో ఒకే గ్రామంలో ఇద్దరు అభ్యర్థులకు సర్పంచ్ గెలుపు ధృవపత్రాలు జారీ చేయడమేమిటన్న చర్చ సర్వత్రా కొనసాగింది. ఆ గ్రామంలో కూడా రాజకీయవేడి రగిలించింది. కాగా బిఆర్ఎస్ అభ్యర్థి చూపుతున్న ధృవపత్రం తాము జారీ చేసింది కాదని, నకిలీ ధృవపత్రం సృష్టించారని అదేరాత్రి రిటర్నింగ్ అధికారి గూడూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇక సోమవారం పాలకవర్గ ప్రమాణ స్వీకార ఘట్టానికి గ్రామపంచాయతి కార్యాలయం వద్ద ఏర్పాట్లు చేయగా ముందు జాగ్రత్తగా ఎస్ఐ గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. ప్రమాణ స్వీకారానికి సర్పంచ్ సనప సుజాతతో పాటు వారి ప్యానల్‌కు చెందిన ఉపసర్పంచ్, నలుగురు వార్డు సభ్యులు హాజరయ్యారు. మరోవైపు నూనావత్ స్వాతి తన వద్ద ఉన్న గెలుపు ధృవపత్రంతో తన ప్యానల్ వార్డు సభ్యులతో కలిసి తాము కూడా ప్రమాణ స్వీకారం చేస్తామని గ్రామపంచాయతి కార్యాలయానికి చేరుకునే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంత వాగ్వివాదం చోటు చేసుకుంది. అధికార బలంతో తమకు అన్యాయం చేస్తున్నారని, మూడు ఓట్ల మెజారిటితో గెలిచినా ఆ తర్వాత తమను కౌంటింగ్ వద్దకు అనుమతించకుండా రికౌంటింగ్ పేరుతో కాంగ్రెస్ అభ్యర్థి ఒక్క ఓటు తేడాతో గెలిచినట్లు ప్రకటించారని స్వాతి ఆరోపించారు. తమకు కూడా గెలుపు ధృవపత్రం జారీ చేసారు కాబట్టి తనతో కూడా ప్రమాణ స్వీకారం చేయించాలని స్వాతి, ఆమె భర్త రవినాయక్, వార్డు సభ్యులు వాదనకు దిగడంతో కొంత ఉద్రిక్తత పరిస్థితి చోటు చేసుకుంది. ఈలోగా అక్కడి పరిస్థితిపై ఉన్నతాధికారులతో మాట్లాడి క్లారిఫై చేసుకున్న ప్రత్యేకాధికారి మంగీలాల్ పంచాయతి కార్యాలయం వద్ద అందుబాటులో ఉన్న వార్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తుండగానే మిగిలిన వార్డు సభ్యులు కూడా అక్కడికి చేరుకోవడంతో అందరు వార్డు సభ్యులు, ఉపసర్పంచ్ ఉపేందర్, సర్పంచ్ సనప సుజాతతో ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో ప్రమాణస్వీకార ఘట్టం సుఖాంతమైంది. ఇదిలా ఉండగా తమ వద్ద ఉన్న గెలుపు పత్రం ఆధారంగా న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తామని, న్యాయం జరిగేవరకు పోరాడుతామని బిఆర్ఎస్ అభ్యర్థి నూనావత్ స్వాతిరవినాయక్ అన్నారు.

# రేపు 'బ్లూ బర్డ్' ఉపగ్రహా ప్రయోగం

## ఇస్రో చరిత్రలోనే భారీ ప్రాజెక్టు: చైర్మన్ నారాయణన్

**సూళ్లూరుపేట, డిసెంబరు 22 ప్రభాతవార్త:** ఇస్రో బాహుబలి రాకెట్ ఎల్‌విఎం3-ఎం6 ద్వారా అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహం బ్లూబర్డ్‌ను ప్రయోగించేందుకు మంగళవారం ఉదయం 8 గంటల 54 నిమిషాలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. కౌంట్‌డౌన్ 24 గంటల పాటు కొనసాగి బుధవారం ఉదయం 8 గంటల 54 నిమిషాలకు రాకెట్ ప్రయోగం జరగనుంది. ఈ ప్రయోగం మూడు దశల్లో ఉంటుంది. నింగిలోకి ఎగిసిన అనంతరం 520 కిలోమీటర్లు ప్రయాణించి 15 నిమిషాల 7 సెకన్లలో బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెడుతుంది. ఇందుకు సంబంధించి శ్రీహరికోటలో శాస్త్రవేత్తలు రాకెట్ అనుసంధాన ప్రక్రియ, ఇంధనం నింపు ప్రక్రియను పూర్తి చేశారు. ఎంఆర్‌ఆర్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. దీంతో రాకెట్ ప్రయోగానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లవుతుంది.

**ఇస్రో చరిత్రలో భారీ వాణిజ్య ఉపగ్రహ ప్రయోగం: ఇస్రో చైర్మన్ వి.నారాయణన్**

భారత భూభాగంనుంచి ఇస్రోచరిత్రలో భారీ ఉపగ్రహ వాణిజ్య ప్రయోగాన్ని ఈ నెల 24న శ్రీహరికోట వేదికగా నిర్వహించనున్నట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. సోమవారం శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని దర్శించుకున్న అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడారు. మంగళవారం ఉదయం 8 గంటల54 నిమిషాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమై 24 గంటల పాటు కొనసాగి బుధవారం ఉదయం 8 గంటల 54 నిమిషాలకు శ్రీహరికోటలోని రెండవ ప్రయోగ వేదిక నుంచి ఎల్‌విఎం3-ఎం6 రాకెట్ ప్రయోగం జరుగుతుందన్నారు. ఈ రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన 6,500 టన్నుల బరువు గల బ్లూబర్డ్ బ్లాక్ 2 ఉపగ్రహాన్ని రోదశిలోకి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ ఉపగ్రహం టెలి కమ్యూనికేషన్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు.

# విజిలెన్స్ విచారణ

>> ఏడాదికి 16 నుంచి 20 వేల కోట్లు రూపాయలు కడుతున్నామనిఆవేదనతో అన్నారు. గతంలో వాళ్లు చేసిన 45 టిఎంసిలు మైనర్ ఇరిగేషన్, గోదావరి డివెర్షన్ సేవింగ్ 45 టిఎంసిలు నిర్ణయం ప్రకారమే రాసిన లేక కొత్తది కాదని చెప్పారు. గత బిఆర్ఎస్ ఒప్పందాన్నే మేము లేఖను రాసాను అని ఆయన తెలిపారు.

# 17.65% డిఎ

>> ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. పెంచిన డిఎ ప్రకారం తెలంగాణ ట్రాన్స్‌కోలో 3,036 మంది ఉద్యోగులు, 3,769 మంది ఆర్టిజన్లకు, 2,446 మంది పెన్షనర్లకు మొత్తంగా 9,251 మందికి లబ్ధి చేకూరనుంది.

# 29 నుంచి అసెంబ్లీ

>> రిజర్వే షన్ల కల్పించే అంశంపై ప్రధానంగా చర్చించనున్నారు. సోమవారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులతో సిఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈభేటీలో ప్రధానంగా పంచాయతీ ఎన్నికల ఫలితాలపై చర్చించారు. ఫలితాలు సంతృప్తికరంగానే వచ్చినప్పటికీ, ఇంకా కొన్ని చోట్ల సరైన దృష్టి పెట్టలేదని పేర్కొన్నట్లు సమాచారం. కానీ ఎంపిటిసి,జెడిపిటిసి ఎన్నికల్లో ఇంకా బలంగా పనిచేయాలని మంత్రులకు సిఎం సూచించారు. పరిషత్ ఎన్నికల నిర్వహణపై త్వరలో నిర్ణయం తీసుకుంటా మని సిఎం పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి నీటిపారుదల ప్రాజెక్టుపై కెసిఆర్ అసత్యప్రచారాలను తిప్పికొట్టాలని మంత్రులకు సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లో పరిషత్ ఎన్నికలతో పాటు పిఎసిఎస్ ఎన్నికలు,మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల షెడ్యూల్‌తో పాటు బిసిలకు 42శాతం రిజర్వేషన్ల అమలు వంటి అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నట్లు సమాచారం,

**పంచాయతీ ప్రజా ప్రతినిధుల కరదీపిక పుస్తకం ఆవిష్కరించిన సిఎం**

గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధుల విధులు, బాధ్యతలకు సంబంధించి సమగ్ర సమాచారంతో రూపొందించిన గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధుల కరదీపికను సిఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్,ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వారం - వర్జ్యం

22-12-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
విదియ ఉ.11.50
ఉత్తరాషాఢ తె.5.21, మూల కార్తె
వర్జ్యం : ఉ.9.47-11.30
దు.ము.12.29-1.04, మ.2.42-3.27
శుభసమయం : ఉ.8.30-9.00
రాహుకాలం - ఉ.7.30-9.00

# వార్తాఫలం

**మేషం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. ఏ పనిని చేపట్టినా చికాకు కలిగిస్తాయి. వాహన సౌఖ్యం కలదు.

**వృషభం:** ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**మిథునం:** సాంకేతిక పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో స్వల్పమార్పులు చోటుచేసుకుంటాయి.

**కర్కాటకం:** చర్చాగోష్ఠులలో పాల్గొంటారు. పనులు మందకొడిగా సాగుతాయి. నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

**సింహం:** దూరప్రాంతాల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**కన్య :** వివాదాలకు దూరంగా ఉండండి. ఉద్యోగులకు స్థానచలనం ఉంటుంది. సోదరుల కలయిక. వాహన సౌఖ్యం.

**తుల :** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి. ఆస్తి వివాదాలు, కోర్టు కేసులు పరిష్కారదశకు చేరుకుంటాయి. వస్త్రలాభం.

**వృశ్చికం:** స్త్రీలతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించండి. ఊహించని విధంగా ఉద్యోగావకాశాలు పొందుతారు.

**ధనుస్సు:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. స్వల్ప ధనలాభం. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**మకరం:** ఋణబాధల నుండి విముక్తి పొందుతారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. సోదరుల కలయిక.

**కుంభం:** మీలోని సృజనాత్మకత వెలుగు చూస్తుంది. వ్యాపారాభివృద్ధి పట్ల దృష్టి సారిస్తారు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**మీనం:** పూర్తిగా ఆశలు వదులుకొన్న కార్యక్రమాలను సానుకూలము చేసుకోవటానికి కృషి చేస్తారు. వాహన సౌఖ్యం కలదు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'ఫోన్ ట్యాపింగ్' మళ్లీ మొదటికి!

>> ఇప్పటి వరకు నలుగురు పోలీసు అధికారులు అరెస్టయి కొన్ని నెలల పాటు జైల్లో వుండి బెయిలుపై విడుదలవడం తెలిసిందే. మరో నిందితుడు శ్రవణ్ రావు ముందస్తు బెయిల్ తీసుకోగా వేరే కేసులో ఆయనను పోలీసులు అరెస్టు చేయడం గమనార్హం. అయితే ఈ కేసులో కీలక నిందితుడు మొదటి ముద్దాయిగా వున్న నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావు సుప్రీం కోర్టు ముందస్తు బెయిల్ కారణంగా దాదాపు ఏడాది పాటు పోలీసులు అరెస్టు చేయలేక పోయారు. ఆయన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు కస్టడీ విషయంలో పోలీసులు విజయం సాధించి ఆయనను రెండు వారాల పాటు తమ అదుపులో వుండేలా చేసుకుని విచారణ చేస్తున్నారు. ఈ రెండు వారాల కస్టడీ విచారణ ఈ నెల 25వ తేదీతో ముగియనుంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 26వ తేదీన ప్రభాకర్ రావును పోలీసులు విడుదల చేయాల్సి వుంది. మరో మూడు రోజులు మాత్రమే ప్రభాకర్ రావును పోలీసులు విచారించే వీలుండడంతో ఈలోపు ఆ యన నుంచి ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి మరింత సమాచారం రాబట్టాలని సిట్ బృందం భావిస్తుండగా ఆయన మాత్రం తాను ఎస్ఐబి బాస్‌గా పనిచేసిన సమయంలో తన పై అధికారులుగా వున్న చీఫ్ సెక్రటరీలు, డిజిపిలు, నిఘా విభాగం బాస్‌లు, ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఏర్పాటైన రివ్యూ కమిటీ సభ్యుల పేర్లను వెల్లడించడం సంచలనం రేపింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో తానొక్కడినే దోషిని కాదని అప్పట్లో తనకు బాస్‌లుగా వున్న వారు కూడా దోషులేనని ప్రభాకర్ రావు చెబుతున్నట్లు సమాచారం. వారి ఆదేశాల మేరకే తాను అనేక మంది ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ప్రభాకర్ రావు వెల్లడించినట్లు తెలిసింది. దీంతో ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి అప్పట్లో ఆదేశాలు ఇచ్చిన నాటి చీఫ్ సెక్రటరీలు రాజీవ్ శర్మ, ఎస్‌కే జోషి, సోమేష్ కుమార్, శాంతి కుమారిలతో పాటు డిజిపిలుగా పనిచేసిన అనురాగ్ శర్మ, మహేందర్ రెడ్డి, అంజనీ కుమార్, రవి గుప్తా, నిఘా విభాగం బాస్‌లుగా వున్న నవీన్ చంద్, అనిల్ కుమార్, అప్పట్లో కీలకంగా వ్యవహరించిన సీనియర్ ఐఎఎస్ అధికారి రఘునందన్ రావులను విచారించాలని సిట్ బృందం నిర్ణయించింది. వీరిలో కొందరికి ఇప్పటికే తాఖీదులు జారీ చేసినట్లు సమాచారం తాఖీదులు అందుకున్న వారిలో కొందరు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి తమకు తెలిసిన విషయాలను సిట్ అధికారులకు వెల్లడించినట్లు తెలిసింది. మరికొందరు ఒకటి రెండు రోజుల్లో సిట్ విచారణకు హాజరయ్యే వీలుందని తెలిసింది. కాగా విశ్రాంత ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల్లో కొందరు నేరుగా సిట్ బృందం ఎదుట విచారణకు రా గా మరికొందరు అనారోగ్య కారణాలతో రాలేని పరిస్థితుల్లో వుండడంతో సిట్ అధికారులు వారి ఇళ్లకు వెళ్లి నాటి ఘటనలపై వాంగ్మూలం తీసుకు న్నారు. వాంగ్మూలం ఇచ్చిన అధికారులు అప్పట్లో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి తమ పాత్ర గురించి వివరించారని తెలిసింది. ఈ విషయంలో ప్ర భాకర్ రావు అతిగా చేశాడని మరికొందరు అధికారులు సిట్ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. తాము మావోయిస్టుల ఫోన్‌లు మాత్రమే ట్యాపింగ్ అనుమతి ఇస్తే ప్రభాకర్ రావు బృందం రాజకీయ నేతలు, జడ్జిలు, జర్నలిస్టులు, సినీ ప్రముఖులు, బడా వ్యాపారుల ఫోన్‌లను ట్యాపింగ్ చేసినట్లు వారు చెప్పారని తెలిసింది. ఈ కేసులో తమ పాత్ర నామమాత్రమేనని వారు వెల్లడించారని సమాచారం. అప్పట్లో ప్రభాకర్ రావు సూపర్ పవర్‌గా వెలిగిపోయాడని, పోలీసు శాఖలో ఆయన ఏం చేసినా చెల్లుబాటు అయ్యేదని వారు చెప్పినట్లు సమాచారం.

**ప్రభాకర్ రావు మూడవ రోజు విచారణ**

ఇదిలావుండగా ప్రభాకర్ రావు రెండవ దఫా విచారణలో భాగంగా మూడవ రోజు కస్టడీ దర్యాప్తు సోమవారం ముగిసింది. మూడవ రోజు విచారణ ఏడు గంటల పాటు సాగిందని తెలిసింది. ఈ విచారణలో సిట్ బృందంలోని ఐదుగురు అధికారులు పాల్గొని ప్రభాకర్ రావును భిన్న కోణాల్లో విచారించారు. అయితే ప్రభాకర్ రావు చెప్పిన అంశాలనే పదే పదే చెబుతున్నట్లు సమాచారం. మంగళవారం నాడు నాలుగవ రోజు విచారణలో ఈ కేసులో నిందితులుగా వున్న వారిని ఎదురుగా వుంచి విచారించే వీలుందని తెలిసింది. దీంతో పాటు అప్పట్లో బ్యూరోక్రాట్లుగా పనిచేసిన వారి ఎ దుట ప్రభాకర్ రావును వుంచి విచారించే వీలుందని సమాచారం. ఈ విచారణకు సిటీ కొత్వాల్ సజ్జన్నార్ స్వయంగా హాజరయ్యే వీలుందని తెలిసింది.

# సైబర్ ఉచ్చులో మాజీ ఐజీ

>> సమాచారం అందిన పది నిమిషాల్లోనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కొన ఊపిరితో ఉన్న చాహల్‌ను పార్క్ ఆసుపత్రికి తరలించారు. అయితే, చికిత్స ఫలించక ఆయన మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఘటనా స్థలం నుంచి 12 నుంచి 16 పేజీల సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డిజిపి గౌరవ్ యాదవ్‌ను ఉద్దేశించి రాసిన ఈ లేఖలో, తాను మోసపోయిన తీరును, ఆర్థిక ఇబ్బందులను ఆయన వివరించారు. గత అక్టోబర్‌లో ఓ మోసపూరిత కంపెనీలో చాహల్ పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. మొదట తన సొంత డబ్బు రూ.1 కోటి పెట్టుబడిగా పెట్టగా, ఆ తర్వాత కంపెనీ డిమాండ్ల మేరకు స్నేహితులు, బంధువుల నుంచి అప్పులు చేసి మిగతా మొత్తాన్ని చెల్లించారు. ఈ మోసంపై ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలకు కూడా ఆయన లేఖలు రాసినట్లు సమాచారం. అమర్ సింగ్ చాహల్ కెరీర్‌లో వివాదాలు కూడా ఉన్నాయి. 2015లో జరిగిన బెహబల్ కలాన్, కోట్‌కపురా కాల్పుల ఘటనల్లో ఆయన నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్, ఆయన కుమారుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌తో పాటు పలువురు పోలీసు అధికారులపై సిట్ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉన్నత హోదాలో పనిచేసిన అధికారి సైతం సైబర్ నేరగాళ్ల బారిన పడి ప్రాణాలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

# చలికి గిలగిల

>> ఉదయం నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు ఇలావున్నాయి. ఆసిఫాబాద్‌లోని సిర్పూర్‌లో ఏడు డిగ్రీలు, సంగారెడ్డిలోని కోహిర్‌లో 7.5, ఆదిలాబాద్‌లోని భీంపూర్‌లో 8.3 డిగ్రీలు నమోదయ్యాయి. వికారాబాద్‌లోని నవాబ్‌పేట్‌లో 8.7, రంగారెడ్డిలోని మొయినాబాద్‌లో 8.7, మెదక్‌లోని వెల్దుర్తిలో 9.5, సిద్దిపేట్‌లోని అక్బర్‌పేట్‌లో 9.5, కామారెడ్డిలోని గాంధారిలో 9.7, నిర్మల్‌లోని పెంబిలో 9.9 సిరిసిల్లాలోని రుద్రంగిలో 10.1, నిజామాబాద్‌లోని సాలూరలో 10.5, మేడ్చల్‌లోని ఉప్పల్‌లో 10.6, నారాయణ్‌పేట్‌లోని కోస్గిలో 10.7, పెద్దపల్లిలోని రామగిరిలో 10.8, కరీంనగర్‌లోని కొత్తపల్లిలో 10.8, జగిత్యాల లోని మల్లాపూర్‌లో 10.8, భూపాలపల్లిలోని ముత్తారంలో 10.8. మహబూ బ్‌నగర్‌లోని గండీడ్‌లో 11, మంచిర్యాలలోని భీమారంలో 11.1, హ నుమకొండలోని శాయంపేట్‌లో 11.1, ములుగులోని గోవిందరావుపేట్‌లో 11.1, నాగర్‌కర్నూలులోని అమ్రాబాద్‌లో 11.4, వరంగల్‌లోని నెక్కొండలో 11.5, జనగాంలోని ఘన్‌పూర్‌లో 11.5, భువనగిరిలోని రాజంపేట్‌లో 11.5, నల్లగొండలోని గుర్రంపోడ్‌లో 11.8, హైదరాబాద్‌లోని తిరుమ ల్‌గిరిలో 11.9, గద్వాల్‌లోని వెంకటాపూర్‌లో 12, మహబూబాబాద్‌లోని గంగారంలో 12.2, కొత్తగూడెంలోని గుండాలలో 12.2, వనపర్తిలోని రేవల్లిలో 13.1 ఖమ్మంలోని గౌరారంలో 13.2, సూర్యాపేట్‌లోని చిల్కూర్‌లో 13.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా రాష్ట్రంలో ఈ స మయంలో సాధారణ ఉష్ణోగ్రతలు 14 డిగ్రీలు వుండాల్సి వుండగా 1.2 డిగ్రీలు తగ్గి 12.9 డిగ్రీలుగా వుంది.

# విద్యుత్ ట్రూఅప్ చార్జీల వడ్డన!

## వినియోగదారులపై రూ.1,607 కోట్ల భారం

### విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు ప్రతిపాదన

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త :** తెలంగాణలోని విద్యుత్తు వినియోగదారులపై భారం పడే అవకాశం ఏర్పడింది. ట్రూ అప్ చార్జీల రూపంలో వినియోగదారుల నుండి అదనపు భారం వేసేందుకు తెలంగాణ విద్యుత్ సంస్థ ప్రతిపాదించింది. ఇందులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,607 కోట్ల ట్రూ అప్ చార్జీలకు అనుమతించాలని కోరుతూ టీజీ జెన్‌కో పిటిషన్ సమర్పించింది. విద్యుత్తు కొనుగోలు అంచనాలు, వాస్తవిక కొనుగోలు వ్యయానికి మధ్య ఉన్న తేడానే ట్రూ అప్ చార్జీలుగా బాదుడుకు సిద్ధమవుతోంది. అయితే ఇందుకు విద్యుత్ నియంత్రణ కమిషన్ అంగీకరిస్తుందా లేదా అనేది సందిగ్ధమైంది. ఈ ట్రూఅప్ చార్జీల బాదుడుకు సంబంధించి వినియోగదారుల, విద్యుత్ నిపుణుల నుండి జనవరి 22న విద్యుత్ నియంత్రణ కమిషన్ బహిరంగ విచారణ నిర్వహించనున్నది. ఈ పిటిషన్‌పై జనవరి 10లోగా తెలియజేయవచ్చు. విద్యుత్తు సంస్థల ఖర్చును నియంత్రిస్తూ దేనికి ఎంత ఖర్చుపెట్టాలనే ఆదేశాలతో ఈఆర్సీ ఏటా టారిఫ్ ఆర్డర్ ఇస్తుంది. దీనికి లోబడే విద్యుత్ పంపిణీ సంస్థలు ఖర్చుచేయాలి. అయితే అంచనాలకు మించి వ్యయం చేయడంతో దాన్ని అధగమించేందుకు ట్రూ అప్ చార్జీల వసూలుకు అనుమతి కోరింది. ఈ ట్రూ అప్ చార్జీలకు ఈర్సీ అనుమతి ఇస్తే, టీజీ జెన్‌కోకు వీటిని చెల్లించాలంటే తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్తు చార్జీల రూపంలో వినియోగదారుల నుండి ముక్కుపిండి వసూలు చేస్తాయి.

# వ్యవసాయ వర్సిటీలో విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్

## ఆలస్యంగా తినడం వల్ల అజీర్తి!

### ఆ వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదు : చీఫ్ వార్డెన్ డాక్టర్ గోవర్ధన్

**హైదరాబాద్ (అత్తాపూర్) డిసెంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిత్యం ఫుడ్‌పాయిజన్ ఘటనలు ఎక్కడోఒక్కచోట కలకలం రేపుతున్నాయి. రాజేంద్ర నగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో తాజాగా విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం వ్యవసాస యూనివర్సిటీలోని హాస్టల్‌లో విద్యార్థులు భోజనం చేసిన అనంతరం 25 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థత గురైయ్యారు. ఆహారం కలుషితం కావడం వల్ల (డి హైడ్రేషన్) వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పితో బాధపడడంతో వెంటనే యూనివర్సిటీ సిబ్బంది వైద్యచికిత్స నిమిత్తం పలు ఆస్పత్రులలో తరలించి చికిత్స అందించారు.

రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల, వసతిగృహంలో ఫుడ్ పాయిజన్ జరిగిందన్న వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎం. గోవర్ధన్ తెలిపారు. శనివారం బి హాస్టల్లో, హాస్టల్ డే నిర్వహించారనీ, అందులో కొంతమంది విద్యార్థులు ఆలస్యంగా తినడం వల్ల అజీర్తి అయిందని అంతకు మించి ఎలాంటి ఇబ్బంది లేదనీ తెలిపారు. విద్యార్థులు అందరూ సురక్షితంగా ఉన్నారు. ప్రచార మాధ్యమాల్లో వచ్చే పుకార్లు నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు. ఈ హాస్టల్ డేలో తనతోపాటు, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి కూడా విద్యార్థులతో కలిసి భోజనం చేయడం జరిగిందని తమకు ఎలాంటి ఇబ్బంది కలుగలేదని అన్నారు.

# 63వ జాతీయ రహదారిపై బొలెరో వాహనాన్ని ఢీకొన్న లారీ

## ముగ్గురు మహిళా కూలీలు మృతి, మరో పది మందికి గాయాలు

**జైపూర్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లాలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఘోర రోడ్డుప్రమాదంతో 63వ జాతీయ రహదారి రక్తసిక్తం అయింది. జైపూర్ సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుండి 23 మంది కూలీలు సుల్తానాబాద్ ప్రాంతంలో వరినాట్లు, ఇతర కూలీపనుల నిమిత్తం బోలెరో వాహనంలో వెళ్తుండగా జైపూర్ మండలం ఇందారం ఎక్స్ రోడ్డు సమీపంలో 63వ జాతీ య రహదారిపై సోమవారం తెల్లవారుజామున వెనకాల వస్తున్న లారీ వేగంగా ఢీ కొట్టడంతో బోలెరో వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళా కూలీలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరో పదిమంది తీవ్రంగా గాయల పాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స కొరకు, మృత దేహాలను పోస్ట్‌మార్టం కొరకు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీరాంపూర్ జిఎం కార్యాలయం నుండి చెన్నూర్ వెళ్లే జాతీయ రహదారి ఇరుకుగా ఉండడం, లారీ డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తుంది. ఈ దుర్ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నవీన్ కుమార్, ఎస్సై శ్రీధర్‌లు ఘటన స్థలాన్ని పరిశీలించారు.



# తెలంగాణ సాధనకు కాకా అహర్నిశలు కృషి

## 11వ వర్ధంతి సందర్భంగా మంత్రుల పుష్పాంజలి

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రసాధనకు మాజీ కేంద్రమంత్రి జి.వెంకటస్వామి అహర్నిశలు పాటుపడ్డారని సోనియాగాంధీకి ప్రత్యేక రాష్ట్రం అవసరం వివరించి ఆ దిశగా ఆమె నిర్ణయం తీసుకోవడానికి ఎంతగానో కృషిచేశారని మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వాకాటి శ్రీహరి అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకా వెంకట స్వామి 11 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలితో నివాళులు అర్పించారు. కరీంనగర్ పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గాలలో కాక కారణంగా అనేక అభివృద్ధి పనులు జరిగాయని ప్రతి గ్రామానికి మంచినీటి వసతి కల్పించేందుకు సమగ్ర కార్యాచరణ 2004లో ఆయన చేశారని కరీంనగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజన్‌కుమార్ వైద్యుల ఈ సందర్భంగా గాంధీభవన్‌లోని కాంగ్రెస్ శ్రేణులకు చరిత్రను వివరించారు.

# ఇన్నయ్య అరెస్టు అప్రజాస్వామికం

## సిపిఎం రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** ఇన్నయ్య అరెస్టు అప్రజాస్వామికమని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ విమర్శించింది. సామాజిక కార్యకర్త, అనాధాశ్రమాన్ని నిర్వ హిస్తున్న గాదె ఇన్నయ్యను ఎన్‌ఐఏ అధికారులు అప్రజాస్వామికంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటనలో తెలిపారు. మావోయిస్టు నేత కాతా రామచంద్రారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని, అక్కడ జరిగిన సభలో మావోయిస్టులకు అనుకూలంగా మాట్లాడారనే నెపంతో అరెస్టు జరిగినట్లు పోలీసులు చెబుతున్నారని అన్నారు. ఆపరేషన్ కగార్, కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణులను వ్యతిరేకిస్తున్న వారిని, సామాజిక సమస్యలపై స్పందించే వ్యక్తులను అరెస్టులు చేయడం ప్రజాస్వామిక గొంతుకలను అణచివేయడమేనన్నారు. ఇన్నయ్య అరెస్టును అభిప్రాయ వ్యక్తీకరణ స్వేచ్ఛపై జరిగిన దాడిగా భావించి ప్రజాస్వామిక వాదులందరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు.

# ఉపాధికి ఉరేసిన బిజెపి పాలకులు

### ఆ పథకంపై ఒత్తిడి పెంచడానికి 27, 28న కొత్త సర్పంచులతో ర్యాలీ

### బాధ్యతలు చేపట్టిన సర్పంచులు, వార్డు సభ్యులకు శుభాకాంక్షలు

### బాధ్యతాయుతంగా పనిచేస్తే పూర్తిస్థాయిలో సర్కారు సహకారం

### ధైర్యంగా ముందుకు సాగాలి : మంత్రి సీతక్క సూచన




సోమవారం గాంధీభవన్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** ఆదాని, అంబానీ మైనింగ్ కంపెనీల కోసం ఉపాధి హామీ చట్టానికి బిజెపి ఉరేసిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. సోమవారం గాంధీ భవన్‌లో మంత్రి సీతక్క మాట్లాడతూ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునే బాధ్యత మనందరిదని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడాలని గ్రామాల్లో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపిస్తామని తెలిపారు. కొత్త సర్పంచ్‌లు, వార్డు మెంబర్లతో ఈనెల 27, 28 తేదీల్లో ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. స్థానికంగా పని కల్పించి వలసలు తగ్గించేందుకు, వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం జాతీయ ఉపాధి హామీ చట్టం తెచ్చారని ఆ పథకాని ఉన్న గాంధీ పేరు తీసేసి గాంధీని మరోసారి బిజెపి హత్య చేసిందని ఆవేదన చెందారు. ఉపాధి హామీ చట్టాన్ని తీసేసి మళ్ళీ వెట్టి చాకిరి విధానాన్ని తేవాలని బిజెపి ఆలో చిస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలో కేంద్రం ప్రతి సంవత్సరం పని దినాలను తగ్గిస్తూ వస్తోందని అన్నారు.

సొంత ఊర్లో పని హక్కు లేకుండా బిజెపి చేస్తోందని అన్నారు. అదానీ అంబానీ వంటి కార్పోరేట్ల మైనింగ్ తవ్వకాలకు కూలీలను సరఫరా చేసేందుకు ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధి చట్టాన్ని రద్దు చేస్తే గ్రామాల్లో కూలీలకు పని ఉండదు ఆ కూలీలు తక్కువ కూలికే కార్పొరేట్లకు లభిస్తారని కేంద్ర ప్రభుత్వం చేసే కుట్రలను అందరూ తిప్పి కొట్టాలని కోరారు.

కేంద్రం బిక్షగా కాకుండా ఉపాధి హక్కుగా లభించే విధంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని మన ఆత్మగౌరహక్కుగా పోరాటం చేసి నిలుపుకోవాలని కోరారు. గ్రామ ప్రజాస్వామ్యానికి బలం చేకూర్చే విధంగా ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొంది నేడు పదవి బాధ్యతలు చేపట్టిన నూతన సర్పంచులు, వార్డు సభ్యులకు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల నమ్మకంతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన దిశగా బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. గ్రామాలే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని మంత్రి పేర్కొన్నారు..సర్పంచులు వార్డు సభ్యులు సమిష్టిగా పనిచేస్తేనే పల్లె ప్రగతి సాధ్యమవుతుందనీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపే నాయకత్వం అందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తుందని, ప్రజాప్రతినిధులు ధైర్యంగా ముందుకు సాగాలని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు.

# భాష ఇంటి నుంచే మొదలవుతుంది..

### భాషలోని మాధుర్యం, అమ్మ ఒడిలోని ఆత్మీయత మరెక్కడా లభించవు : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్ (సైఫాబాద్), డిసెంబరు 22, ప్రభాతవార్త:** భారతీయ సంస్కృతి, మాతృభాష పట్ల అవగాహన పెంపొందించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు చెప్పారు. భాష ఇంటి నుంచే మొదలు అవుతుందని తల్లి దండ్రులు పిల్లలతో మాతృభాషలోనే మాట్లాడాలని ఆయన సూచించారు. సోమవారం తెలుగు దేశభాషలందు అత్యంత ప్రాచీనమైనదిగా, విశాలమైన సాహిత్య సంపద కలిగిన భాషగా నిలిచిందన్నారు. భారతీయ భాష సమితి, విద్యా మంత్రిత్వ శాఖ, విద్యా భారతి ఉచ్చ శిక్షా సంస్థాన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థల ఆడిటోరియంలో జరిగిన జాతీయ భాషా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాన్వెంట్ విద్య విస్తరించని కాలంలోనే తెలుగు మహానుభావులు ప్రపంచ ఖ్యాతి సాధించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాతృభాషలో ఉన్న మాధుర్యం, అమ్మ చేతి వంటలోని కమ్మదనం, అమ్మ ఒడిలోని ఆత్మీయత మరెక్కడా దొరకదని ఆయన అన్నారు. అందుకే తెలుగు భాష అమ్మ వంటిదని, దీన్ని గౌరవంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భాష పరిరక్షణ ప్రజల బాధ్యతతోపాటు పాలకుల బాధ్యత కూడా ఉందని ఆయన స్పష్టం చేశారు.




సదస్సులో ప్రసంగిస్తున్న ఎం.వెంకయ్యనాయుడు

తరుచుగా విద్యా సంస్థల్లో ఇలాంటి భాష సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన భారతీయ భాషా పరివార్-భాషాశాస్త్రంలో ఒక కొత్త రూపరేఖ భారతీయ భాషా పరివార్- పర్స్పెక్టివ్స్ అండ్ హరైజన్స్ అనే పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సదస్సులో సొసైటీ వైస్‌ప్రెసిడెంట్ నరసింహారావు, జాయింట్ సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# టెట్ నుంచి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను మినహాయించాలి

### ఐదు పెండింగ్ డిఎలను తక్షణమే విడుదల చేయాలి

### సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలి

### బిటిఎఫ్ నూతన రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) నుంచి మినహాయించాలని బహుజన టీచర్స్ ఫెడరేషన్(బిటిఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అలాగే పెండింగ్‌లో ఉన్న 5 డిఏలను వెంటనే విడుదల చేయాలని సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసినట్టు రాష్ట్ర అధ్యక్షులు కల్వదర్శి చైతన్య తెలిపారు.

హైదరాబాద్‌లోని స్ఫూర్తి భవన్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో సంఘ నియమావాలి ప్రకారం ప్రతి రెండు సంవత్సరాల కాలానికి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన రాష్ట్ర అధ్యక్షులుగా కల్వదర్శి చైతన్య(రంగా రెడ్డి జిల్లా) ప్రధాన కార్యదర్శిగా మేఘవత్ సంతోష్ నాయక్ (నిజామా బాద్ జిల్లా ) కోశాధికారిగా కాడం బాలశంకర్ (మహబూబ్ నగర్) వర్కింగ్ ప్రెసిడెంట్ పట్నం చెన్నయ్య (మహబూబ్ నగర్ ) అదనపు ప్రధాన కార్యదర్శిగా నాగరాజు (రంగారెడ్డి) అశోసియేట్ ప్రెసిడెంట్స్‌గా సిద్దార్థ (నాగర్ కర్నూల్ ) బియ్య సాగర్ (నిజామా బాద్) ఎండి గౌస్ (రంగా రెడ్డి) ఉన్నికైనట్టు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా బిటిఎఫ్ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు వడ్డెమన్ బాల పీర్ వ్యవహారించారు. రాష్ట్ర అధ్యక్షులు కల్వదర్శి చైతన్య మాట్లాడుతూ .. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న 5 డిఏలను, పిఆర్‌సిని ప్రకటించాలన్నారు. సరెండర్ లీవ్ పెండింగ్ బిల్లును వెంటనే చెల్లించాలని, సిపిఎస్‌ను రద్దు పరిచి ఓపిఎస్‌ను అమలు పరచాలన్నారు. మధ్యాహ్నం భోజనం బాధ్యతల నుండి ప్రధానోపాధ్యాయులను మినహించాలని, ఎస్ఎస్‌సి ప్రత్యేక తరగతుల నిర్వహణలో పిల్లలకు ఉదయం అల్పాహారంతోపాటు సాయంత్రం స్నాక్స్‌ను ఇవ్వాలన్నారు.

# డిసెంబర్‌లో సైబర్ బాధితులకు రూ.42.22 కోట్లు అందజేత

### 9,540 మందికి

### లోక్ అదాలత్‌లో ఊరట

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సైబర్ నేరగాళ్ల బారినపడి డబ్బులు పోగొట్టుకుంటున్న బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) చాలా వరకు ఊరటనిస్తోంది.

ఈ ఏడాది డిసెంబర్ నెలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో 9540 మంది బాధితులకు లోక్ అదాలత్ ద్వారా 42.22 కోట్ల రూపాయలను అందజేశారు. దీనికి సంబంధించిన వివరాలను టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ సోమవారం మీడియాకు వెల్లడించారు. ఇందులో కాచకొండ కమిషనరేట్‌లో 1354 కేసులకు సంబంధించి 12.69 కోట్ల రూపాయలు, హైదరాబాద్‌లో 11.95 కేసులకు సంబంధించి 8.13 కోట్ల రూపాయలు, టిజిసిఎస్‌బి హెడ్ క్వార్టర్స్‌లో నమోదైన 472 కేసులకు సంబంధించి 6.06 కోట్ల రూపాయలు, సైబరాబాద్‌లో 3495 కేసులకు సంబంధించి 3.38 కోట్ల రూపాయలు, వరంగల్‌లో 372 కేసులకు సంబంధించి 1.18 కోట్ల రూపాయలు బాధితులకు అందజేశారు. కాగా ఈ ఏడాది మొత్తం మీద 29,111 మంది బాధితులకు టిజిసిఎస్‌బి బాసటగా నిలిచి 180 కోట్ల రూపాయ లను అందజేసింది. ఈ నగదును సైబర్ నేరగాళ్ల నుంచి జప్తు చేశారు.

2024లో 17,912 మంది బాధితులకు బాసటగా నిలువగా ఈ ఏడాది ఈ సంఖ్య 29,111కు పెరిగింది. ఇది 62.5 శాతం పెరుగుదలగా వుంది.

ఇప్పటి వరకు టిజిసిఎస్‌బి మొత్తం మీద 48,853 సైబర్ క్రైం బాధితుల కు లోక్ అదాలత్‌తో పాటు ఇతర మార్గాలలో 372 కోట్ల రూపాయలను నేరగాళ్ల నుంచి జప్తు చేసి అందజేసింది. కాగా సైబర్ నేరాల విషయంలో అన్ని వర్గాల వారు నిరంతరం జాగ్రత్తగా వుండాలని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ కోరారు. సైబర్ నేరాల విషయంలో 1930 లేదా సమీప పో లీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆమె తెలిపారు.

# ప్రమాణం చేయకుండానే ఉపసర్పంచ్ రాజీనామా

### బండకొత్తపల్లిలో రాజకీయ చర్చకు తెరలేపిన పరిణామం

**గుండాల, డిసెంబరు 22, ప్రభాతవార్త:** ఉప సర్పంచ్‌గా ఎన్నికైన ఓ ప్రజాప్రతినిధి ప్రమాణస్వీకారం చేయకుండానే ఏకంగా తన రాజీనామా పత్రాన్ని నేరుగా అధికారులకు అందజేసిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామంలో ఉపసర్పంచ్‌గా ఇటీవల ఎన్నికైన రాస్తాపురం చంద్రయ్య, ఇంకా ప్రమాణ స్వీకారం చేయకముందే తన పదవికి రాజీనామా చేయడం స్థానిక రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే గ్రామ పాలనపై ఆశలు పెట్టుకున్న ప్రజలకు ఈ పరిణామం ఆశ్చర్యం కలిగిస్తోంది. వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు సంబంధిత ప్రజాప్రతినిధి మండల అభివృద్ధి అధికారి (ఎండిఓ)కు లిఖితపూర్వకంగా లేఖ అందజేశారు. లేఖలో వ్యక్తిగత కారణాలు తప్ప ఇతర రాజకీయ లేదా పాలనా అంశాలను ప్రస్తావించలేదని సమాచారం. ఈ ఘటనతో గ్రామ పంచాయతీలో ఉపసర్పంచ్ స్థానం ఖాళీగా మారింది. నిబంధనల ప్రకారం, ఉపసర్పంచ్ రాజీనామాను అధికారులు ఆమోదించిన అనంతరం, పంచాయతీ సభ్యుల మధ్య కొత్త ఉపసర్పంచ్ ఎన్నిక జరగాల్సి ఉంటుంది. అయితే, ప్రమాణ స్వీకారం చేయకుండానే రాజీనామా చేయడం వెనుక నిజమైన కారణాలు ఏమిటన్నది గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. కొందరు ఇది పూర్తిగా వ్యక్తిగత నిర్ణయమే అంటున్నారు. ఈ అంశంపై గ్రామ సర్పంచ్ లేదా సంబంధిత అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉండగా, పూర్తి వివరాలు వెలువడితే స్పష్టత వచ్చే అవకాశముంది. అప్పటివరకు బండకొత్తపల్లి ఉపసర్పంచ్ వ్యవహారం గుండాల మండలంలో హాట్ టాపిక్‌గా కొనసాగుతోంది.



# ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిద్దండి

## పల్లె ప్రగతికి పునాది మీరే

### నూతన సర్పంచులు, వార్డు సభ్యులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికై, సోమవారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామ పంచాయతీలే అత్యంత కీలకమైనవని, మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారం కావడంలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో అమూల్యమని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామాల్లో ప్రజారోగ్య పరిరక్షణ బాధ్యత స్థానిక పాలకవర్గాలదేనని మంత్రి గుర్తుచేశారు. "మీ పదవీ కాలంలో గ్రామాల రోడ్లు, పరిశుభ్రత, పారిశుధ్యం, స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టి, ఆరోగ్య తెలంగాణ సాధనలో మీ వంతు సహకారం అందించాలని మంత్రి దామోదర రాజనర్సింహ సర్పంచ్‌లను కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా చూడాలని సూచించారు. దేశానికి తెలంగాణ పల్లెలు ఆదర్శ, ఆరోగ్య గ్రామాలుగా నిలవాలని మంత్రి దామోదర ఆకాంక్షించారు.



# గంజాయి నూనెతో అల్జీమర్స్‌కు చెక్!

## క్షీణించే జ్ఞాపకశక్తి పునరుద్ధరణ

**మెల్‌బోర్న్, డిసెంబరు 22:** మతిమరుపు వ్యాధి అల్జీమర్స్ తీవ్రస్థాయిలో బాధ పడుతున్న వారికి మంచి ఉపశమనం లభించినట్లయింది. ఈ వ్యాధి కారణంగా క్షీణించే జ్ఞాపకశక్తిని, మేధో సామర్థ్యాన్ని గంజాయి ఆధారిత ఔషధం అడ్డుకుంటున్నట్లు ఒక చిన్న అధ్యయ నంలో తేలింది. తక్కువ మోతాదులో గంజాయి నూనెను వాడటం వల్ల రోగులలో వ్యాధి లక్షణాలు ముదరకుండా నిలిచిపోయినట్లు ఆస్ట్రేలియా పరిశోధకులు గుర్తించారు. ఆస్ట్రేలియాలోని కర్టిన్ యూనివర్సిటీ, పెరాన్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు సంయుక్తంగా ఈ క్లినికల్ ట్రయల్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా, 60 నుంచి 85 ఏళ్ల మధ్య వయసున్న 54 మంది అల్జీమర్స్ రోగులను ఎంపిక చేసుకున్నారు. వారిని రెండు బృందాలుగా విభజించి, ఒక బృందానికి 14 వారాలపాటు రోజూ 5సార్లు గంజాయి నూనె ఇచ్చారు. మరో బృందానికి ఎటువంటి ఔషధం లేని ప్లేసిబో అందించారు. 14 వారాల తర్వాత ఫలితాలను పరిశీలించగా, ప్లేసిబో తీసుకున్న రోగుల జ్ఞాపకశక్తి గణనీయంగా క్షీణించింది. అయితే, గంజాయి నూనె తీసుకున్న వారిలో మాత్రం మేధో సామర్థం స్థిరంగా ఉన్నట్లు, ఎలాంటి క్షీణత కనిపించలేదని పరిశోధకులు తెలిపారు. ఈ ఔషధం వల్ల వికారం, తల తిరగడం వంటి స్వల్ప దుష్ప్రభావాలు మాత్రమే కనిపించాయని, ఇది సురక్షితమైన చికిత్సా విధానంగా నిరూపితమైందని అధ్యయనానికి నేతృత్వం వహించిన అసోసియేట్ ప్రొఫెసర్ మైఖేల్ ఆర్కిలో పేర్కొన్నారు. ప్రస్తుతం అల్జీమర్స్‌కు అందుబాటులో ఉన్న చికిత్సలు పరిమితంగానే పనిచేస్తున్నాయని, వాటితో దుష్ప్రభావాలు కూడా ఎక్కువేనని చెప్పిన తరుణంలో ఈ తాజా ఫలితాలు కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయని, వీటిని నిర్ధారించేందుకు భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయిలో అధ్యయనాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అధ్యయన వివరాలు జర్నల్ ఆఫ్ అల్జీమర్స్ డిసీజ్‌లో ప్రచురితమయ్యాయి.

# వరంగల్‌లో ఏసిపి, సిఐ, ఎస్ఐల సస్పెన్షన్

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** వరంగల్ కమిషనరేట్‌లో పనిచేసిన ఎసిపితోపాటు ఇన్‌స్పెక్టర్, ఎస్ఐను సస్పెండ్‌చేస్తూ డిజిపి శివధర్‌రెడ్డి సోమవారం ఆదేశాలు జారీచేశారు. వరంగల్‌లో గతంలో ఎసిపిగా పనిచేసిన నందిరాం నాయక్, ప్రస్తుత సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ గోపి, ఎస్ఐ విఠల్‌లు సస్పెండ్ అయ్యారు. గతంలో వీరు మట్టేవాడ పోలీసుస్టేషన్‌లో తప్పుడు కేసులు నమోదు చేసినట్లు ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపిన ఉన్నతాధికారులు డిజిపికి నివేదిక అందజేశారు. దాని ఆధారంగా ముగ్గురిపై వేటు పడింది.

# నీళ్లపై నిగ్గు తేలాలంటే మామ, అల్లుడు అసెంబ్లీలో మాట్లాడాలి

## ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్



**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** నీళ్లపై నిగ్గు తేలాలంటే మామా, అల్లుడు అసెంబ్లీలో మాట్లాడాలనీ దమ్ముంటే కెసిఆర్‌ను సభకు తీసుకొచ్చి మాట్లాడించండని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్ చేశారు. సిఎల్‌పిలో సోమవారం మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షి గా మీ పదేళ్ల పాలన, మా రెండేళ్ల పాలనపై చర్చిద్దాం దమ్ముంటే హరీశ్ రావు సవాల్ స్వీకరించి. కెసిఆర్‌ను ను తీసుకుని రావాలని అన్నారు. కెసిఆర్ పదేళ్ల పాలనలో నీళ్ల వాటలో ఎన్ని వాడుకున్నారో చెప్పాలని కోరారు. బయట ప్రెస్ మీట్లు పెట్టి, అబ ద్ధాలు చెబితే ఎవరు నమ్మే పరిస్థితి లేదని ఆయన అన్నారు. తెలంగాణ ప్రయోజనాల పట్ల ఎవరి చిత్తశుద్ధి ఏంటో నిరూపించుకుందామని అన్నారు. పక్క రాష్ట్రం కోసం పదేళ్ల రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టింది ఎవరు. ఏపీకి వెళ్లి చేపల పులుసుకు చేతులు కడుకున్నది ఎవరు. ప్రజాభవన్ సాక్షిగా జగన్‌తో కెసిఆర్ కెటిఆర్ చేసిన మంత్రాగం ఏంటీ అని ఆయన ప్రశ్నలు సందించారు. .రెండేళ్లలో కంప్లీట్ చేస్తానన్న పాలమూరు ప్రాజెక్టు పదేళ్లైనా చేయలేదని నిలదీశారు. రూ.35 వేల కోట్లతో పూర్తయ్యే కాళేశ్వరంను లక్షకోట్లకు పెంచి దోచుకున్నారనిఆరోపించారు. అదే కాళేశ్వరం ప్రాజెక్టును ఎవరి ప్రయోజనాల కోసం మూడేళ్లలో పూర్తి చేశారు. మీ సొంత లాభాలు, కమీషన్ల కోసమే కాళేశ్వరంను లక్ష కోట్లకు పెంచారు.. కెటిఆర్, హరీశ్ రావు బాగోతాలను కవిత బయటపెడుతోందని ఆయన వివరించారు. వాటికి సమాధానం చెప్పే దమ్ము, ధైర్యం కెటిఆర్, హరీశ్ రావుకు లేక మౌనంగా ఉంటున్నారని అన్నారు.

**NOTICE AS PER THE ORDERS OF THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II HYDERABAD.**

**IA No.3093/2025 in IA No.389/2025 in OA No.2392/2017 & I.A.NO.389 of 2025 In O.A.NO.2392/2017**

**Filed by UCO Bank vs P. Ram Sunder Reddy & Others.**

Please take Notice that the Petitioner UCO Bank has filed **IA No.3093/2025** in **IA No.389/2025** in **OA No.2392/2017** to amend the LR Petition and **I.A. No.389/2025** in **TA/OA No.2392/2017** to implead the LRs before the Hon'ble Debts Recovery Tribunal-2, at 1st Floor, Triveni Complex, Abids, Hyderabad -500001. The said I.A.s and O.A. are posted to **03/02/2026** for your appearance counter and hearing.

**P.S.Sujatha**
**Advocate**
**For Petitioner / Applicant**

4. P. Sravanthi Reddy D/o. Late P. Ram Sunder Reddy Aged about 40yrs H.no. 8-2-293/82/L/310/A/A, MLA Colony,Road No. 12, Banjara Hills, Hyderabad- 500034.
**Legal Representatives of Defendant No.1**
**Proposed Defendants No.3 & 4**

5. Sri P. Ravikanth Reddy S/o. Late P. Ram Sunder Reddy H.No. 310/A/A, MLA Colony, Road No. 12 Banjara Hills, Hyderabad - 500034 Also At: H.No. 1-42, Patel Nagar,Nakrekal, Nalgonda District. **Legal Representatives of Defendant No.1**
**Proposed Respondents No. 5/**
**Proposed Defendants No. 5**

వార్త

మానవజాతిని మార్చాలని ప్రతివాడూ చూస్తాడు. కాని తనను తాను మార్చుకోవాలని మాత్రం ఎవరూ చూడరు.

-లియో టాల్‌స్టాయ్

# 'అణు శాంతి' మంత్రం!

ఎదుటి వాడి వద్ద చేర్నకోల ఉండి మన వద్ద చిన్న చేతి కర్రయినా లేకుంటే అవతలి వానికి మన మీద స్వారీ చేయాలనిపిస్తున్నది నానుడి. అందుకే శత్రువు దగ్గర ఆయుధాలున్నప్పుడు మనకు ఎంతో కొంత బెరుకు తప్పదు. దాయాది దేశాల పోరు సల్పాల్సి వచ్చినప్పుడు అణుయుద్ధానికి వెనుకాడమంటూ పాక్ వంటి దేశాలు బడాయి హెచ్చరికలు చేస్తూంటే మనమూ జాగ్రత్త పడాలేమోననే భయం ఉండడం సహజం.అన్నింటా సమర్థులమై ఉంటే అవతలి వారి గర్జనలను లెక్కపెట్టబోము. ఆయుధాలు వాళ్ళ ఒక్కరి దగ్గరే ఉంటే మనకెప్పుడూ ప్రాణ భయమేనన్న విషయం గుర్తుంచుకోదగినదే! అగ్రదేశాలన్నీ అణుశక్తిని ఇప్పటికే కూడగట్టుకున్నాయి. భారతదేశం తన ఇంధన అవసరాల కోసం శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వయం సమృద్ధి సాధించే దిశగా ఒక చారిత్రాత్మక అడుగు వేసింది. దేశ భవిష్యత్తును మార్చే ఉద్దేశంతో తీసుకువచ్చిన సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్ఫర్మింగ్ ఇండియా (శాంతి) చట్టం, అణుశక్తిని కేవలం విద్యుత్ ఉత్పత్తికే కాకుండా దేశ సమగ్ర అభివృద్ధికి ఒక సాధనంగా మారుస్తుంది. పర్యావరణానికి హాని చేయని నిరంతరాయంగా లభించే ఈశక్తివనరు ద్వారా మనం ప్రపంచ వేదికపై ఒక శక్తివంతమైన దేశంగా ఎదగడానికి అవకాశం ఉంది. ఈచట్టం ముఖ్యంగా దేశంలోని పారిశ్రామిక రంగానికి పెద్ద పీటవేస్తుంది. ఇప్పటివరకు ప్రభుత్వ నియంత్రణలో ఉన్న అణుశక్తి రంగాన్ని ప్రైవేటు భాగస్వామ్యానికి తెరవడమే కాకుండా, విదేశీ సాంకేతికతను మన అవసరాలకు అనుగుణంగా మార్చుకునే వీలు కల్పిస్తుంది. దీని వల్ల రానున్న కాలంలో విద్యుత్ కొరత పూర్తిగా తొలగిపోతుందన్న అంచనాలున్నాయి. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని, సురక్షితమైన పర్యావరణాన్ని అందించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. అణు విజ్ఞానాన్ని శాంతియుత ప్రయోజనాల కోసం వాడుకుంటూనే, దేశ రక్షణ, ఇంధన భద్రతను పటిష్టం చేయడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుంది. కేవలం పట్టణాలకే కాకుండా మారుమూల గ్రామాలలోని చిన్నతరహా పరిశ్రమలకు కూడా చౌకగా విద్యుత్ అందించడం ఈ వ్యూహలక్ష్యం. గ్లోబల్ వార్మింగ్ వంటిసవాళ్లను ఎదుర్కోవడానికి కర్బన ఉద్గారాల నియంత్రణకు అణుశక్తిని మించిన ప్రత్యామ్నాయంగా మరొకటి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో భారతదేశం తన అణుశక్తి సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న స్థాయి నుండి రాబోయే రెండు దశాబ్దాలలో పది రెట్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. అణుఇంధన రంగంలో ప్రయివేట్ భాగస్వామ్యాన్ని ఆహ్వానించేందుకు నిర్దేశించిన 'శాంతి' బిల్లును పార్లమెంటు ఆమోదించింది. ఈ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు ఇతర ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అణు ఇంధన రంగంలోకి ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ఆహ్వానించే చర్యలను విపక్షాలు కూడా స్వాగతిస్తున్నాయి. కాగా భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదని మాత్రమే గట్టిగా చెబుతున్నాయి. 'శాంతి' బిల్లు ప్రస్తుతం ఉభయ సభల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఈబిల్లు 2025పై చర్చనడుస్తోంది.పర్యావరణ పరిరక్షణవిషయమై స్పష్టత కావాలని పలువురు సభ్యులుకోరారు.అణువ్యర్థాల నిర్వహణ, పర్యావరణంపై ఎలాంటి ప్రభావం ఉంటుందో వాటిని ఏ విధంగా పరిష్కరిస్తామన్న విషయంలో స్పష్టత లేదన్నది వారివాదన. వాటికి ఎవరు ఏ స్థాయిలో బాధ్యత వహించడంలో ప్రత్యేకంగా ప్రస్తావనలేదనే అనుమానాలు లేకపోలేదు.నల్లమలలో తవ్వకాలు పరిశోధనల రీత్యా గిరిజన ప్రాంతాల్లో అణుపరీక్షల కారణంగా గిరిజనులు క్యాన్సర్ వంటి రోగాల భారిన పడుతున్నందున భద్రతా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాజ్యసభ్యులు వివిధ అంశాలపై స్పష్టత కావాలని కోరుకున్నారు. తగినభద్రత, రక్షణపర మైన అంశాలను చర్చించకుండా అణుఇంధన వ్యవస్థను ఏర్పాటు చేయడమంటే అంతర్గత భద్రతకు ప్రమాదం ఏర్పడే అంశంపై ఉదాసీన వైఖరి అవలంబించడమేనని విపక్షాలు వాదిస్తున్నాయి. తీవ్రమైన భద్రతా అంశాలపై బిల్లులో ప్రస్తావనలేదని అనుమానాలు లేవనెత్తారు. అణు ఇంధన పరికరాలను సరఫరాదారుని జవాబుదారీతనాన్ని ఈ బిల్లు ద్వారా బలహీనపరచడమేనని వాదిస్తున్నారు.వాతావరణ మార్పులను దృష్టిలోపెట్టుకుని అణు ఇంధన కేంద్రాలు సురక్షితంగా ఉంచే చర్యలు తీసుకోవాల్సి ఉంది. విదేశీ రెగ్యులేటరీ వ్యవస్థల ప్రమేయం నిమిత్తం లేకుండా విదేశీ ప్రైవేట్ అణుఇంధన నమూనాను నేరుగా దిగుమతి చేసుకుంటున్నారని 'ఆప్' ఎంపి ఒకరు వ్యాఖ్యానించడం లో వాస్తవాలు ఉన్నాయి. అదే జరిగితే దేశానికి మంచిది కాదనే వాదనలున్నాయి. దీని కారణంగా స్థానికులకుఉద్యోగ భరోసా ఆయా రాష్ట్రాలకు విద్యుత్ కేటాయింపులో స్పష్టత, ప్రాధాన్యత, సామాజిక అభివృద్ధి వంటి అంశాలకు బిల్లులో చోటులేదని కొన్ని విమర్శలు ప్రస్ఫుటంగానే కన పడుతున్నాయి.ఈ బిల్లుపై దేశవ్యాప్తంగా తీవ్రవ్యతిరేకత వ్యక్తమౌతోంది.ఈనెల 23న ఆలిండియా పవర్ ఇంజి నీర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చారు. సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు, సంయుక్త కిసాన్ మోర్చాలు కూడా సంఘీభావం ప్రకటిస్తున్నాయి.బిల్లుఎలాగూ ఆమోదం పొందినందునే నిరసనలు మాత్రం కేంద్రానికి హెచ్చరికగా నమోదై ఉంటాయి. అణు విపత్తులు లేకున్నా మనకుంటూ అణ్వాయుధ కేంద్రాలను నిర్మించుకోవడం అవసరం.

సజ్జనులు ఏది న్యాయమో చూస్తారు, అల్పులు ఏది లాభమో అని ఆలోచిస్తారు.



సిసి కాల్టన్

వ్యక్తులు ఇతరుల బోధన ద్వారా కంటే తమ కష్టాల ద్వారానే ఎక్కువ నేర్చుకుంటారు.



వివేకానందుడు

# రైతు బతుకులు బాగు పడేదెప్పుడు?

**ఆహార ధాన్యాల ధరలకు తగిన ప్రోత్సాహాన్ని అందించడం ద్వారా వారు సహేతుకమైన ఆదాయాన్ని పొందేలాచూడాలి. పారదర్శక సరసమైన ధరల విధానాలను ఏర్పాటుచేయాలి. మెరుగైన ధరల ఆవిష్కరణ కోసం సమర్థవంతమైన మార్కెట్ మౌలికసదుపాయాలను అభివృద్ధి చేయాలి.ప్రతీ రాష్ట్రం లో రైతులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నేరుగా విక్రయించే ఏర్పాట్లు చేయాలి. రైతులకు ఆర్థిక సహాయం మరింత చేయాలి. రైతులు అధునాతన వ్యవసాయ సాంకేతికతలు అందిపుచ్చుకోడానికి డిజిటల్ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ అందించాలి. భారతీయ వ్యవసాయం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి, సుస్థిరతను ప్రోత్సహించడానికి, ఉత్పాదకతను పెంచడానికి, దేశవ్యాప్తంగా రైతుల జీవనో పాధిని మెరుగుపరచడానికి ప్రభుత్వాలు కృషి చేయాలి.**

డి జె మోహన రావు

వ్యవసాయ విధానాలను రూపొందించడంలో, రైతుల సాధికారతలో కీలక పాత్ర పోషించిన చౌదరి చరణ్ సింగ్ గౌరవార్థం భారత ప్రభుత్వం 2001లో తొలిసారిగా కిసాన్ దివస్‌ను నిర్వహించింది. గ్రామీణ భారతదేశం సవాళ్లపై అవగాహనకు ప్రసిద్ధి చెందిన సింగ్ రైతుల జీవితాలను మెరుగుపరచడానికి, సుస్థిర వ్యవసాయ అభివృద్ధిని నిర్ధారించడానికి అనేక విధానాలను ప్రవేశపెట్టారు. గ్రామీణ సమాజాల సాధికారత, స్వావలంబన వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను పెంపొందించాలని విశ్వసించారు. రైతుల జీవితాలను మెరుగుపరచడానికి అలుపెరగని కృషికి పేరుగాంచిన భారతదేశంలో భూసంస్కరణలు, గ్రామీణ రుణ ఉపశమనంలో కీలక పాత్ర పోషించారు. అందుకే ఆయనను 'ఛాంపియన్ ఆఫ్ ఇండియాస్ ఫార్మర్స్' అని పిలుస్తారు. రైతు శ్రేయస్సే జాతి శ్రేయస్సు. రైతులు జాతికి ఆత్మ. అందరి కడుపులు నింపేవాడు. వ్యవసాయం తప్ప ఇంకో పని తెలియనివాడు. తన కష్టాన్ని మాత్రమే నమ్ముకున్నోడు. నిత్య కృషీవలుడు. పండించడం మాత్రమే తెలిసినోడు. చలైనా, ఎండైనా, వర్షమైనా రైతుకు ఒక్కటే ! కాలంతో పనిలేకుండా తన పొలంలో విత్తడం, దున్నడం, కోయడం చేసుకుంటాడు. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద వ్యవసాయయోగ్యమైన భూమిని కలిగి ఉన్న మన దేశ ఆర్థికవ్యవస్థలో ముఖ్యపాత్ర పోషిస్తూ ప్రజల ఆహారవసరాలు తీర్చే వ్యవసాయంగ్రామీణ ప్రజానీకానికి వెన్నెముక. దేశ మొత్తం భూభాగంలో వ్యవసాయ అవసరాల కోసం దాదాపు 60శాతం భూభాగం వినియోగించబడుతున్నది. ఉపాధి, ఉత్పత్తిపరంగా ఆర్థికవ్యవస్థకు ప్రధానమైనది. యాభై ఎనిమిది శాతానికి పైగా గ్రామీణ కుటుంబాలకు వ్యవసాయమే ఆధారం. గ్రామాలలో నివసిస్తున్న 72.8 మంది జనాభాలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఏభై శాతానికి పైగా ప్రజలకు జీవనోపాధిని అందిస్తుంది. మొత్తం శ్రామిక శక్తిలో యాభై ఎనిమిది శాతం ఈ రంగంలోనే ఉన్నారు. దేశ జిడిపిలో వ్యవసాయ వాటా సుమారు పద్దెనిమిది శాతం. వ్యవసాయం ఆహారపరిశ్రమల ముడిపదార్థాలకు మూలం. అధిక జనాభాతో అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రజల ఆహార భద్రతను నిర్ధారించడంలోను, పరిశ్రమలు సేవారంగాల వృద్ధికి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుంది.గ్రీన్హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి, జీవవైవిధ్యాన్ని రక్షించడానికి వ్యవసాయంసహాయపడుతుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన వ్యవసాయరంగానికి రైతన్నే కీలకం.వ్యవసాయం పర్యావరణ, ఆర్థిక, సంస్థాగత, సాంకేతికతపరంగా ఎన్నో ఆటుపోట్లకు గురవుతున్నది. రైతులు వ్యవసాయంలో ఉత్పాదకత, లాభదాయక జీవన నాణ్యతకు ఆటంకం కలిగించే అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. విత్తు నుండి కోత వరకూ రోజూ రైతుకు ఒత్తిడే. సాగుభూమి చిన్నాభిన్నంగా చిన్న కమతాలుగా మారడం, నాణ్యమైన విత్తనాల కొరత,నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు పంట ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపి దిగుబడి తగ్గి వ్యవసాయ ఉత్పాదకత తగ్గుతుంది. సరైన పంట ఉత్పత్తి కాక రైతులు ఉసూరుమంటున్నారు. ఎక్కువ శాతం వ్యవసాయం వర్షాధారమే! 14.1కోట్ల హెక్టార్ల స్థూల విత్తన విస్తీర్ణంలో 52 శాతం అంటే 7.3 కోట్ల హెక్టార్లు నీటిపారుదల సౌకర్యాన్ని కలిగి ఉందని నీతి ఆయోగ్ తెలిపింది. అరవై ఐదు శాతం వ్యవసాయం ఋతుపవన వర్షపాతమే ఆధారం. మొత్తం నీటిపారుదల ప్రాంతంలో 40 శాతం కాలువల మీద, మిగిలినది భూగర్భ జలాల మీద ఆధారపడి ఉంది. ఋతుపవనాలలో ఏమాత్రం తేడా వచ్చి సరైన సమయంలో వర్షంపడకపోతే కాలువల మీద ఆధారపడిన ప్రాంతంలో కూడా పంటలు పండవు. ఇకకాలువేతర ప్రాంతాలలో కేవలం భూగర్భజలాలే ఆధారం. అతివృష్టి, అనావృష్టి, పంట ఉత్పత్తిపై ప్రభావం చూపి ఫలితంగా



ఆహార ధాన్యాల ఉత్పత్తి ఏటా అస్థిరత్వానికి గురవుతోంది. భూ వనరులపై అధిక జనాభా ఒత్తిడి కారణంగా వర్షాధార ప్రాంతాలు, ముఖ్యంగా పొడి భూములు తక్కువ దిగుబడిని ఎదుర్కొంటున్నాయి. వరి, గోధుమలు, పత్తి, నూనె గింజలతో సహా భారతీయ పంటల దిగుబడులు అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. హరితవిప్లవం, అస్తవ్యస్త నీటిపారుదల వ్యవసాయ పద్ధతులు భూమి క్షీణతకు దారితీశాయి. మానవ కార్యకలాపాల వల్ల వర్షాధార ప్రాంతాలు కూడా నేల కోతను క్షీణతను ఎదుర్కొంటుంది. ఒకే పంటను పదేపదే సాగుచేయడం వల్ల నేల పోషకాలను కోల్పోయి నిస్సారంగా మారింది. ఎరువులు, పురుగుమందులు, విత్తనాల ధరతో పాటుగా లేబర్ ఛార్జీలు కూడా పెరుగుతున్నాయి. పంట పెట్టుబడికి రైతులు అధిక వడ్డీకి రుణాలు వాడుతున్నారు. పంట నష్టపోవడం, పంటలకు గిట్టుబాటుధర లేకపోవడం, అధిక ఖర్చులు వలన సగానికి పైగా వ్యవసాయ కుటుంబాలు అప్పుల పాలవుతున్నారు. చాలా మంది అనధికారిక వనరుల నుండి రుణాలు పొందుతున్నారు. వాణిజ్యపంటలు సాగుచేసే రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. కరవు, పంట నష్టాలు వలన అప్పుల ఊబిలో కూరుకుపోయి ఒక్కోసారి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.అసమర్థమైన వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలు ధరల అస్థిరతకు దారితీస్తాయి. సరైన నిల్వ,రవాణా సౌకర్యాలు లేకపోవడం వలన రైతులు వెంటనే తక్కువ ధరకే ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఇది పంట అనంతర నష్టాలను మరింత పెంచుతుంది. వీరు పండించే పంటలను విక్రయించడానికి ఇప్పటికీ దళారులపైనే ఆధారపడుతున్నారు. దళారులు రైతులను మోసం చేస్తున్నారు.ఇంకా కొన్ని రాష్ట్రాలలో ఇప్పటికీ నేరుగా మార్కెటింగ్ విధానం లేకపోవడం వలన వచ్చేఆదాయంలో కొంత భాగం మధ్యవర్తుల పాలవుతున్నది. ప్రస్తుతం ఉన్న పంటల విధానం కొన్ని ప్రధాన పంటల వైపు మాత్రమే మొగ్గుచూపే విధంగా ఉన్నాయి. పంటలలో వైవిధ్యం లేకపోవడం వల్ల వ్యవసాయ రంగం తెగుళ్లు,వ్యాధులు,మార్కెట్ ఒడిదుడుకుల బారినపడుతుంది. సాగులో ఆధునిక సాంకేతికలు అమలు పరచడం లేదు. అందరూ స్వంతవ్యవసాయ కమతాలు కలిగిఉండరు.ఇంకొక పెద్ద రైతుదగ్గర వ్యవసాయ క్షేత్రాన్ని కౌలుకుతీసుకుంటారు. పంట సరిగా పండకపోతే వీరు మరింత పేదరికంలోనికి నెట్టబడుతున్నారు.సవాళ్లను పరిష్కరించడానికి బహుముఖ విధానం అవసరం. వ్యవసాయంలో సాంకేతికతను జోడించి ఖర్చులను కనిష్టం చేసే మార్గాలను ప్రవేశపెట్టాలి. వ్యవసాయ పనితీరును మెరుగుపరచడం, ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వం, గ్రామీణాభివృద్ధికి భరోసా ఇవ్వడానికి ఈసవాళ్లను పరిష్కరించడం అత్యవసరం. ఇటు రైతు అటు ప్రభుత్వాలు వ్యవసాయానికి రెండు చక్రాల్లాంటి వారు. రైతులు నేల క్షీణతను అరికట్టడానికి తగుచర్యలు తీసుకోవాలి.పర్యావరణ అనుకూల పద్ధతులు పాటించాలి. డ్రిప్, స్ప్రింక్లర్ సిస్టంలతో సహా,సమర్థవంతమైన నీటి నిర్వహణ పద్ధతులు అవలంబించాలి. విభిన్న పంటరకాలు, పద్ధతులను అనుసరించాలి. సేంద్రీయ ఎరువులు వాడాలి. ఇక ప్రభుత్వపరంగా సమర్థవంతమైన నీటిపారుదల పద్ధతులు, వర్షపునీటి సంరక్షణను అమలు చేయాలి. తీవ్రమైన వాతావరణ సంఘటనల కోసం ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను అందుబాటులోకి తేవాలి. ఆహారోత్పత్తిని పెంచేందుకు ఎప్పటికప్పుడు నిర్ణయించే ఆహార ధాన్యాల ధరలకు తగిన ప్రోత్సాహాన్ని అందించడం ద్వారా వారు సహేతుకమైన ఆదాయాన్ని పొందేలాచూడాలి. పారదర్శక సరసమైన ధరల విధానాలను ఏర్పాటుచేయాలి. మెరుగైన ధరల ఆవిష్కరణ కోసం సమర్థవంతమైన మార్కెట్ మౌలికసదుపాయాలను అభివృద్ధి చేయాలి.ప్రతీ రాష్ట్రంలో రైతులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నేరుగా విక్రయించే ఏర్పాట్లుచేయాలి. రైతులకు ఆర్థికసహాయం మరింత చేయాలి. రైతులు అధునాతన వ్యవసాయ సాంకేతికతలు అందిపుచ్చుకోడానికి డిజిటల్ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ అందించాలి. భారతీయ వ్యవసాయం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి, సుస్థిరతను ప్రోత్సహించడానికి, ఉత్పాదకతను పెంచడానికి, దేశవ్యాప్తంగా రైతుల జీవనోపాధిని మెరుగుపరచడానికి ప్రభుత్వాలు కృషి చేయాలి. ●

# మానవ హక్కులపై అవగాహన అవసరం

తరిగోపుల నారాయణస్వామి

ప్రతి మనిషి స్వేచ్ఛగా, గౌరవంగా, భయపెట్టబడకుండా, వివక్ష లేకుండా జీవించడానికి ఉన్న అధికారాన్నే మానవ హక్కులు అంటారు, ఈ హక్కులు మనిషి పుట్టుకతోనే వస్తాయి, ఎవరు ఇవ్వాల్సిన అవసరం లేదు, ఎవరు కాజేయకూడదు, మనిషి జీవితం సమానత్వం, న్యాయం, భద్రత, గౌరవం అనే నాలుగు మూలాలపై నిలబడాలి. ఈ నాలుగు విలువలు బలహీనపడితే నాగరికత వెనక్కి తగ్గుతుంది. ప్రపంచంలో ఎన్నో యుద్ధాలు, దోపిడీలు, అణచివేతలు, దాస్యాలు, కులవివక్షలు జరిగిన తర్వాతే మానవ హక్కుల అవసరం ప్రపంచానికి అర్థమైంది. ఒక వ్యక్తి హక్కులు ఉల్లంఘించబడితే అది ఒక్కరికి జీవననష్టం కాదు, అది సమాజానికి నైతిక నష్టం, దేశానికిప్రతిష్టనష్టం, మానవతకు గాయం, అందుకే మానవ హక్కులను రక్షించడం ప్రభుత్వాల పనికాదు, ప్రతి మనిషి బాధ్యత.మన దేశంలో రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులను కల్పించింది, అదివ్యక్తి స్వేచ్ఛ, వ్యక్తిత్వ వికాసం, విద్య, ఉపాధి, ఆస్తి, సంచారం, మతబంధం, భద్రత, చట్టపరమైన రక్షణ ఇవన్నీ ప్రతి పౌరుడి హక్కులు, కానీ హక్కులు ఉన్నంత మాత్రమే సరిపోదు, అవగాహన కూడా ఉండాలి. ఎందుకంటే అవగాహన లేని హక్కులు చేతిలో ఉన్నాలేనట్లే. హక్కులను రక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు చేసింది. మానవ హక్కుల సంఘాలు ఏర్పాటు చేయబడ్డాయి, కానీ సమాజం మార్చుకోవాలనే నైతికత లేకపోతే హక్కులు కేవలం కాగితాలపై మాత్రమే మిగిలిపోతాయి. ప్రత్యేకించి చిన్నారులు, మహిళలు, వృద్ధులు, కార్మికులు, దళితులు, గిరిజనులు, నిరుపేదలు, అణగారిన వర్గాలు, అశక్తులు ఇలా ఎంతోమంది హక్కుల అణచివేతకు గురవుతుంటారు. వీరి హక్కులు రక్షించడంలో సమాజం స్పందించకపోతే అభివృద్ధి అసాధ్యం అవుతుంది. పిల్లలపై హింస, బాల్య వివాహాలు, బాలకార్మికులు, విద్య లేకపోవడం ఇవి మానవ హక్కుల ఉల్లంఘనలు, మహిళలపై వేధింపులు, అసమాన వేతనాలు,అవకాశాల లోపం హక్కుల ఉల్లంఘనలు,వృద్ధుల నిర్లక్ష్యం, కార్మికుల దోపిడీ, కులమత రాజకీయాలు, ఆలోచన స్వేచ్ఛ అణచివేత, ఇవన్నీ మానవ హక్కులకు ఎదురయ్యే ప్రమాదాలు. ఎవరిమీదైనా వివక్ష చేయకుండా జీవించడం మానవత, వారి స్వేచ్ఛ, భావాలు, గౌరవం, కలలు, భావోద్వేగాలు కూడా మనలాంటివేననే భావన పెరగాలి. హక్కులను కేవలం మనకోసమే వినియోగించడం కాదు, ఇతరుల హక్కులను గౌరవించడం నేర్చుకున్నప్పుడే నిజమైన మనిషితనం పుడుతుంది. నా హక్కులు ఎంత ముఖ్యమో, మీ హక్కులు కూడా అంతే ముఖ్యమని మనసులో నిలిపినప్పుడే సమానత్వం సాధ్యమవుతుంది. మానవ హక్కులు సాకారం అయ్యే సమాజంలో ద్వేషం ఉండదు, హింస ఉండదు, దోపిడీ ఉండదు, ఇతరుల బాధను చూసి నిర్లక్ష్యం ఉండదు. పేద, ధనిక మధ్య గోడలుండవు, విద్య, వైద్యం,ఉపాధి, భద్రత అందరికీ చేరుతాయి. మనిషి మనిషిని గౌరవించే సంస్కృతి బలపడుతుంది. దేశం అభివృద్ధి చెందుతుంది, శాంతి పెరుగుతుంది, మానవత్వం వెలుగుతుంది. హక్కులను అర్థం చేసుకోవడం ప్రతి ఒక్కరి అవగాహనగా మారాలి, హక్కులను రక్షించడం మన కర్తవ్యంగా మారాలి, ఇతరుల హక్కులను కాపాడడం మన మానవత్వపు పరీక్షగా మారాలి, మానవ హక్కుల గురించి ప్రతి మనసులో అవగాహన కలిగితేనే సమాజం దయతో, న్యాయంతో, ప్రేమతో, శాంతితో, సమానత్వంతో నిండిన ఆధ్యాత్మిక శక్తిగా నిలుస్తుంది. ●

# ప్రజావాక్కు



## దేశ భద్రతకు పెను సవాల్

బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిస్థితులు భారతదేశ భద్రతకు పెను సవాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా జులై ఐక్య మంచో అనే సంప్రదాయవాద తీవ్రవాద సమూహాల కూటమి ఢాకాలోని భారత హైకమిషన్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించడం అత్యంత ఆందోళనకరమైన పరిణామం. ప్రస్తుతం భారతదేశంలో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనాను తిరిగి అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఈ శక్తులు చెలరేగిపోతున్నాయి. ఈ క్రమంలో వారు భారతదేశాన్ని ఒక శత్రు దేశంగా అభివర్ణించడమే కాకుండా, భారత ఈశాన్య రాష్ట్రాలను ప్రధాన భూభాగం నుండి వేరు చేస్తామంటూ దేశ సార్వభౌమాధికారానికి భంగం కలిగించేలా హెచ్చరికలు జారీ చేశారు. నేషనల్ సిటిజన్ పార్టీ నాయకులు కూడా ఈ భారత వ్యతిరేక ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## హెల్మెట్ తప్పనిసరి

ఇటీవల సంభవిస్తున్న రోడ్ ప్రమాదాల్లో హెచ్చు శాతం మోటార్ వాహన చోదకులు సరైన హెల్మెట్ ధరించక,లేక ఉన్నప్పటికీ ఎదుటి వాహనాన్ని ఢీకొట్టడంవల్ల తలభాగం మరణానికి కారణంగా ఉన్నది. ఇది ఒక రక్షణకు ముఖ్య వస్తువు. దాన్ని ధరించడం తప్పనిసరిచేయాలి. అందరూ విధిగా చేస్తే ట్రాఫిక్ పోలీసులు లేనివారికి తనిఖీ అవసరమే లేదు. తిరుపతిలో దీన్నిప్రత్యేకంగా ప్రచారం భాగంలో ప్రత్యేకంగా తయారుచేసిన హెల్మెట్లు బంక్ ద్వారా అమ్మకం చేశారు.ఇది రెండులాభాలు ఇస్తుంది. ఇదే మిగిలిన జిల్లాల్లో కూడా చేస్తే దాన్నే కొని ధరిస్తారు.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

## అప్రమత్తతే మన రక్షణ కవచం

ఔషధతయారీ, పంపిణీ వ్యవస్థల్లో పారదర్శకత లేకపోతే ప్రజారోగ్యంఎంత ప్రమాదంలో పడుతుందో కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ ఈ ఘటనస్పష్టంగా చూపించింది.ప్రజలు అప్రమత్తంగా ఉండటం అత్యవసరం. ఇంట్లో లేదా ఫార్మసీలలో కోల్డ్రిఫ్ సిరప్ నిల్వఉంటే వెంటనే తొలగించాలి. పిల్లలకు వైద్యుల సూచన లేకుండా ఏ సిరప్ ఇవ్వకూడదు. ప్రతి మందువాడే ముందు దానిలేబుల్, తయారీసంస్థ, బ్యాచ్ నంబర్ వంటివివరాలు పరిశీలించడం అలవాటు కావాలి.

- వి. కృష్ణ కుమార్, హైదరాబాద్

## మగ్గం రంగంలో విప్లవాత్మక మార్పు

నూలుబట్టలు నెయ్యడం భారతదేశపు సంప్రదాయ వృత్తుల్లో ఒకటి. తరతరాలుగా లక్షలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలిచిన ఈ రంగం, కాలానుగుణంగా మార్పులను స్వీకరిస్తూ నేటి ఆధునిక సాంకేతికత వైపు అడుగులు వేస్తోంది. నూలు నెయ్యడంలో తాజాగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్ మగ్గాలు ఈ రంగ భవిష్యత్తుపై కొత్త ఆశలను రేకెత్తిస్తున్నాయి.సాంప్రదాయ జక్కట్ మగ్గాలను నడపాలంటే నేయువాడు రెండు కాళ్లు, రెండు చేతులను ఒకేసారి ఉపయోగించాల్సి వచ్చేది.ఈ ప్రక్రియ శారీరకంగా ఎంతో కష్టసాధ్యమైనది.దీర్ఘకాలం ఇలా పని చేయడంవల్ల మోకాళ్ల నొప్పులు,వెన్నునొప్పులు, చేతి కీళ్ల సమస్యలు వంటి ఆరోగ్య సమస్యలు నేయువాళ్లను వేధించేవి. ఈ కారణాల వల్లకొందరు నేయువాళ్లు వృత్తినే వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈపరిస్థితులకు పరిష్కారంగా రూపొందించిన ఎలక్ట్రానిక్ జక్కట్‌మగ్గం నేయువాళ్లకు వరంగా మారుతోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## ఉపాధి రోజులకు పెంచితే లాభం ఏమిటి?

కొత్తగావచ్చిన ఉపాధిహామీ బిల్ హక్కులకు శరాఘాతంలా కనిపిస్తుంది. ఒకటి కేంద్రం తమ బాధ్యతలు నుండి తప్పుకోవడం మాత్రమేకాదు ఎటువంటి ఆబ్లీగేషన్స్ లేకుండా కేంద్రం పక్కకు తప్పుకోవడం విచారకరం అయితే 2005లో బిల్ వచ్చినప్పుడు పార్టీలకు అతీతంగా కళ్యాణ్ సింగ్ నేతృత్వంలో వేసిన సలహా కమిటీ ఈ బిల్‌డ్రాఫ్ట్ తయారుచేసింది. ఈబిల్ చట్టంగా మారడానికి ముందు ఒకసంవత్సరంపాటు చర్చజరిగింది కానీ ఇప్పుడు అంత క్షణాల్లో అయిపోయింది.కేవలం లోక్‌సభలో అధికార పక్షానికి ఉన్న సంఖ్యా ఆధిపత్యం వల్లనే సుమా. తెలంగాణ ఎలా వెనుకబడిన ప్రాంతంగా మారిందో ఉపాధి హామీ చట్టం కూడా నిర్వీర్యం చేయబడిన చట్టంగా తయారు అయింది.

- భారత అవినాష్, జనగామ

## దర్శనానికి నిర్ణీత సమయం కేటాయించాలి


ప్రముఖఆలయాలున్న భద్రాచలం, కొండగట్టు, యాదగిరిగుట్ట, అన్నవరం, శ్రీశైలం ఆదిగాగల పుణ్యక్షేత్రాలలో పండుగలనాడే గాక మామూలు రోజుల్లో కూడా భక్తుల రద్దీ సాధారణం కంటే ఎప్పుడూ ఎక్కువగా ఉంటోంది. ఈ కారణంగా అరవైఏళ్ళు పైబడిన వృద్ధులు క్యూలలోగంటల తరబడి నిలబడి దైవ దర్శనం చేసుకోవడం కష్టతరంగా ఉంది. తిరుపతిలో మాదిరిగా వృద్ధులదర్శనానికి ప్రతీరోజూఒనిర్ణీత సమయాన్ని కేటాయించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

# విశ్వసనీయత కల్పించే బాధ్యత ఎవరిది?

బైరబోయిన వెంకటేశ్వర్లు

ఏ తల్లి అయిన తన కడుపున పుట్టిన పిల్లలందరినీ సమానంగా చూస్తుంది. కానీ భారతదేశం కడుపున పుట్టిన బిడ్డలకు సమాననైపుణ్యమైన విద్య,మెరుగైన వైద్యం అందుతుందా అంటే అది లేదనే చెప్పాలి.ఎందుకంటే ఉన్న వాళ్ల కడుపున పుడితే కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్థాయిలో మధ్యతరగతి, పేదల కడుపున పుడితే సాధారణ ప్రవేట్, ప్రభుత్వ బడులలో విద్య, ఆసుపత్రులలోవైద్యం అందుతున్నాయి. ఆర్థిక అంతరాలను బట్టి అందే విద్య,వైద్యం తీరు మారుతుంది.కానీ ఫిన్లాండ్, డెన్మార్క్,స్వీడన్, కెనడా,నార్వే వంటి అత్యుత్తమ విద్య విధానం కలిగిన దేశాలు అందరికీ సమాన నాణ్యమైన విద్యఅందిస్తున్నాయి.ఈదేశాలలో అందిస్తున్న విద్యలో 98 శాతం బడులు ప్రభుత్వ అధీనంలో నడుస్తే మిగిలిన రెండుశాతం ప్రైవేట్ బడులు ప్రభుత్వ నిధుల ద్వారానే నడుస్తున్నాయి. అక్కడ పిల్లలందరికీ పట్టణ, గ్రామీణ, పేద, ధనిక అనే తేడాలేకుండా ఒకే రకమైన పాఠ్యాంశాలు, మౌలిక వసతులు కల్పిస్తూ పిల్లలందరికీ సమాన నైపుణ్యమైన విద్యను అందిస్తూ సమాన అవకాశాలు కల్పిస్తున్నాయి. ప్రజలకు కావలసిన సంక్షేమంలో కనీస అవసరాలు విద్య, వైద్యం కానీ మన దేశంలో అందే విద్య అంతరాన్ని బట్టి, సామాజిక ఆర్థిక పరిస్థితులను బట్టి మారుతుంది. ఏది నిర్మించాలన్నా దానికి పునాది బలంగా ఉండాలి. వ్యక్తిగత వికాసానికి, మనిషి ఎదుగుదలకుపునాది ప్రాథమిక విద్య.మన దేశంలో కార్పొరేట్, ప్రైవేట్‌తో పోలిస్తే ప్రభుత్వ బడులలో ప్రాథమిక విద్య బలహీనమవుతుంది అనడంలో సందేహం లేదు. ప్రభుత్వం అంటేనే ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు పాలించే నాయకులు,ప్రభుత్వాలు పథకాలను ప్రవేశపడితే ప్రభుత్వ ఉద్యోగులు వాటిని సక్రమంగా ప్రజలకు అందేలా చూస్తారు.దేశంలో అధికారంలో ఉన్న నాలుగు వేలకుపెగా శాసన సభ్యులు, 750కి పైగా లోక్‌సభ రాజ్యసభ సభ్యులు, వేలకు పైగా నామినేటెడ్ పదవుల్లోని సభ్యులు, ఇలా పాలక పక్షం ప్రతి పక్షం కలుపుకొని గల్లీ నుండి ఢిల్లీ వరకు లక్షలకు పైగా రాజకీయ నాయకుల ఆకాంక్ష ప్రజాసేవ ప్రజా సంక్షేమం.అలాగే కేంద్ర ప్రభుత్వంలో 50 లక్షలకు పైగా, ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో పది లక్షలకు పైగా, ఇలా దేశ వ్యాప్తంగా కోటి మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు నిరంతరం ప్రజలకు సేవలు అందించడంలో విధులు నిర్వహిస్తుంటారు. వీరిలో ఎంతమంది తమ పిల్లలని ప్రభుత్వ బడులలో చదివిస్తున్నారు? ఎంతమంది ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలను ఉప్పయోగిస్తున్నారో ఆలోచిస్తే సమాధానాలు ఆశ్చర్యంకలిగిస్తాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బోధిస్తున్న చాలామంది ఉపాధ్యాయుల పిల్లలు కార్పొరేట్ స్కూల్లో చదువుతున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 21లక్షల విద్యార్థుల ఆర్థిక స్థితిగతులు పరిశీలిస్తే అర్థం అవుతుంది ఏ వర్గం వారికి ప్రభుత్వ పాఠశాలలు వేదికలవుతున్నాయో. ఏ రంగంలోనైన సాధించిన అంతిమ లక్ష్యాలనే ప్రామాణికంగా తీసుకుంటారు. దేశంలో ఉన్నతస్థాయి ఉద్యోగాలైనఐఎఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ లాంటి ఉద్యోగాలకు ఎంపిక అవుతున్న



వారిలో అలాగే ఇటీవలే తెలంగాణలో ఎంపికైన గ్రూప్ 1,2,3,4 ఉద్యోగులలో, ప్రతి సంవత్సరం ప్రభుత్వరంగ సంస్థల్లో, క్యాంపస్ రిక్రూట్మెంట్లో ఎంపికవుతున్నఇంజనీర్లు, డాక్టర్ సీట్లు సాధిస్తున్న వారిలో ఎంత మంది ప్రాథమిక విద్య ప్రభుత్వ బడులలో చదివి ఎంపికయ్యారో తెలిస్తే విద్యపై ప్రభుత్వ లక్ష్యాలు ఎంతవరకు గమ్యం చేరుతున్నాయో తెలుస్తుంది. బడి చదువులు బ్రతుకుదెరువు నేర్పాలి. బ్రతుకు తెరువు నేర్పని చదువులపై ప్రజల్లో నమ్మకం ఉండదు అనేది నిజం. ఒక గ్రామంలో విద్య, విద్యుత్, పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, ఆరోగ్య, ఇలా ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు విధులు నిర్వహిస్తుంటారు. ప్రజలకు అందేసేవలలో ఎవరి విధులు వారివే.ఇలా గ్రామంలో చిన్నపాటి మండల స్థాయిలో గ్రూప్ 1 2 3, జిల్లా స్థాయిలో ఐఎఎస్ ఐపీఎస్ వంటి అత్యున్నత స్థాయి ఉద్యోగులుంటారు. సమజంలో గౌరవ ప్రదమైన హోదాలో ఉన్న వీరు ప్రభుత్వ విద్య వైద్యాన్ని ప్రోత్సహిస్తే ప్రజల్లో బలమైన నమ్మకం కలుగుతుంది. రాష్ట్ర ఆదాయంలో మూడోవంతు ఆదాయాన్ని జీతాల రూపంలోతీసుకుంటున్న ఉద్యోగులు ప్రభుత్వ విద్య వైద్యంపై ప్రజల్లో విశ్వసనీయత కల్పించే బాధ్యత ఉందన్నది ఆలోచించాలి. ప్రజల్లో విశ్వసనీయత పెంచకుండా ప్రభుత్వాలు విద్య వైద్యంపై ఎన్ని నిధులు ఖర్చుపెట్టినా ప్రయోజనం లేదన్నదినిజం. 2025-26 సంవత్సరానికి గాను మన దేశం ప్రాథమిక విద్యకు 78,572 కోట్లు, ఉన్నత విద్యకు 50,078 కోట్లు బడ్జెట్లో కేటాయించింది. అలాగే తెలంగాణ ప్రభుత్వం 24 వేలా కోట్లు (రాష్ట్ర బడ్జెట్లో 8 శాతం) విద్యకు కేటాయించింది. మౌలిక వసతుల కల్పన, మధ్యాహ్న భోజనానికి,పుస్తకాలు, యూని ఫార్మ్‌కు నిధులను ఖర్చు చేస్తున్నాయి. మనం విద్యపై ఎన్ని నిధులు ఖర్చు పెట్టారన్నది ముఖ్యం కాదు నిధులతో పాటు మనం ప్రభుత్వ విద్యపై ప్రజల్లో ఎంత విశ్వాసం కల్పిస్తున్నామన్నది కూడా ముఖ్యం. ఈ విశ్వసనీయత కల్పించే బాధ్యత మొదటగా రాజకీయ నాయకుల, ప్రభుత్వం ఉద్యోగుల అందరి మీద ఉన్నదని గమనించాలి. ఒక జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్ని విభాగాలకు అధికార అధిపతి. ఇలాంటి స్థాయి అధికారి తమ పిల్లలను ప్రభుత్వ స్కూల్లో చదివిస్తే తమ దిగువ స్థాయి ఉద్యోగులకు,ప్రజలకు ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగించిన అలాగే సామాజిక ఆర్థిక అంతరాలను తొలగిస్తూ సమానత్వ భావాన్ని కల్పిస్తూ ప్రభుత్వ బడులను ప్రోత్సహించిన వారవుతారు. వైద్యం పరంగా నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులుప్రభుత్వ సేవలు సౌకర్యాలు వాడుకున్నప్పుడే ప్రజలకు వాటిపై నమ్మకం కలుగుతుంది. ఉన్నతస్థాయి ఉద్యోగులు ప్రభుత్వ సౌక ర్యాలను వాడుకోవడంవల్ల ప్రజల్లో అసమానతలు తొలగిపోయి ప్రభుత్వఆసుపత్రులపై విశ్వసనీయత పెరుగుతుంది. ఏ పాలకులు ప్రజా సంక్షేమం కోసం సొంత ధనాన్ని ఖర్చు పెట్టారు. ఆదాయం మొత్తం ప్రజలపన్నుల ద్వారా వచ్చేవే. ప్రజాధనంపై అజమాయిషీ వహించిపాలన నిర్వహించే రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలను నడిపేనాయకులు, ప్రజలు పన్నుల రూపంలో చెల్లించే ధనాన్ని జీతంగా తీసుకునే ప్రభుత్వఉద్యోగులు ప్రభుత్వం సంక్షేమ రూపంలో అందిస్తున్న పథకాలు విద్య,వైద్యంపై ప్రజల్లో విశ్వవసనీయతపెంచడంలో ముందువరసలో ఉండాలని ఆలోచించాలి. అప్పుడే ప్రభుత్వం ఖర్చుపెట్టే నిధులకి సార్థకత దక్కుతుంది. ●

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# శబరిమల ఆలయం చోరీ కేసు

## మరో ఇద్దరి అరెస్టు - రిమాండ్ రిపోర్ట్‌లో కీలక విషయాలు

**కొచ్చిన్, డిసెంబరు 22:** శబరిమల ఆలయం బంగారం చోరీ కేసులో సిట్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టిని అరెస్టు చేసిన సిట్ పోలీసులు, తాజాగా చెన్నైకి చెందిన స్మార్ట్ క్రియేషన్స్ సిఇఒ పంకజ్ భండారి, బళ్లారికి చెందిన ఆభరణాల వ్యాపారి గోవర్ధన్‌లను అరెస్ట్ చేసింది. కోలాం విజిలెన్స్ కోర్టులో నిందితులను హాజరుపరచగా, రిమాండ్‌కు తరలించారు. సిట్ పోలీసుల రిమాండ్ రిపోర్టులో శబరిమల ఆలయానికి చెందిన బంగారు దొంగతనం కేసులో నిందితుల ప్రమేయం, వారి ముఠా నెట్‌వర్క్‌కు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదిక ప్రకారం చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న స్మార్ట్ క్రియేషన్స్ సంస్థ సిఇఒ పంకజ్ భండారి, బళ్లారికి చెందిన ఆభరణాల వ్యాపారి గోవర్ధన్ ఈ దొంగతనంలో కీలక పాత్ర పోషించినట్లు తేలింది. కోలాం విజిలెన్స్ కోర్టులో సిట్ దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులో ఈ ఇద్దరూ ప్రధాన నిందితులకు సహకరించి నేరాన్ని దాచిపెట్టేందుకు తప్పుడు సాక్ష్యాలు ఇచ్చినట్లు పేర్కొంది. విచారణలో సేకరించిన ఆధారాల ఆధారంగా వీరిద్దరినీ అరెస్టు చేసినట్లు సిట్ వెల్లడించింది. ఈ కేసుకు అంతర్‌రాష్ట్ర సంబంధాలు ఉన్నాయని కూడా దర్యాప్తులో తేలింది. శబరిమల ఆలయ ద్వారపు ఫ్రేమ్, ద్వార పాలకుల విగ్రహాలపై ఉన్న బంగారు పూత పలకలను మరమ్మతుల పేరిట చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్స్‌కు తరలించినట్లు సిట్ గుర్తించింది. అక్కడి నుంచి బంగారాన్ని వేరు చేసి, దాని ఒక భాగాన్ని బళ్లారి ఆభరణాల వ్యాపారికి విక్రయించినట్లు ఆధారాలు లభించాయి. ఇప్పటికే సిట్ బళ్లారి ఆభరణాల దుకాణం నుంచి సుమారు 400 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుంది. ఇది దొంగతనంలో భాగమేనని అధికారులు చెబుతున్నారు. మిగిలిన బంగారాన్ని దాని ఆధ్యాత్మిక విలువ కారణంగా అధిక ధరకు విక్రయించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. దర్యాప్తు సమయంలో గోవర్ధన్, ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి, పంకజ్ భండారి మధ్యవర్తిగా వ్యవహరించినట్లు సిట్ గుర్తించింది. ఆలయానికి చెందిన బంగారు పూత పలకల నుంచి సేకరించిన బంగారంలో సుమారు 100 గ్రాములను మరమ్మతుల పారితోషికం పేరిట స్మార్ట్ క్రియేషన్స్‌కు ఇచ్చినట్లు సమాచారం. ఆ బంగారం శబరిమలదేనని భండారికి తెలుసుననిసిట్ తేల్చింది.

## దేశం వీడింది భయపడి కాదు..

# మారణహోమం ఆపడానికే


## : బంగ్లా మాజీ పిఎం హసీనా



ఢాకా, డిసెంబరు 22: బంగ్లాదేశ్‌లో కొనసాగుతోన్న ఉద్రిక్తతలపై ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా స్పందించారు. గత యేడాది దేశంలో జరిగిన మారణహోమాన్ని ఆపడానికే తాను దేశం వీడి భారత్‌కు వచ్చానని.. భయపడి కాదన్నారు. అయినప్పటికీ ఆ దేశంలో ఉద్రిక్తతలు చల్లారట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. యూనస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బంగ్లాలో హింస పెరిగిపోయిందని.. ప్రభుత్వం బలహీనంగా మారిపోయిందని విమర్శించారు. అక్కడ చట్టాలు ఏమీ అమల్లో లేవని.. దేశంలో పాలన సరిగ్గా లేకపోతే అంతర్జాతీయంగా బంగ్లాదేశ్ పేరు దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు.అల్లర్లలో 25 యేళ్ల దీపూచంద్రదాస్ అనే మైనారిటీ యువకుడిని ఆందోళనకారులు దారుణంగా కొట్టి చంపి, నిప్పంటించడంపై హసీనా ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మైనారిటీల భద్రతను కాపాడడంలో తాత్కాలిక ప్రభుత్వం విఫలమైందని ఈ ఘటనతో స్పష్టమైందని అన్నారు. యూనస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే భారత్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటోందని.. కానీ పైకి మాత్రం భారత్‌తో స్నేహం కోరుకుంటున్నట్లు బూటకపు మాటలు చెబుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి ఎన్ని తాత్కాలిక ప్రభుత్వాలు వచ్చినా భారత్-బంగ్లా మధ్య ఉన్న బంధాన్ని బలహీనపరచలేవన్నారు. యూనస్‌కు అండగా ఉన్న తీవ్రవాదులు దేశ ప్రజల మధ్య వైరాన్ని సృష్టిస్తున్నారని.. వారే తన కుటుంబాన్ని, తనను ప్రాణాల కోసం పారిపోయేలా చేశారని హసీనా ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వం దౌత్య కార్యకలాపాలను రక్షిస్తుందని.. వాటిని దెబ్బతీసే వారిపై చర్యలు తీసుకుంటుందన్నారు. కానీ అందుకు భిన్నంగా యూనస్ ప్రభుత్వం గూండాలకు మద్దతిస్తూ.. వారిని దేశ భక్తులుగా అభివర్ణిస్తోందని మండిపడ్డారు. తమ ప్రభుత్వ పాలనలో తీవ్రవాదులుగా గుర్తించి జైలులో పెట్టిన వారిని యూనస్ ప్రభుత్వం విడుదల చేసి, ప్రజా జీవితంలోకి అనుమతించిందని.. అందువల్లే బంగ్లాలో అల్లర్లు తీవ్రమవుతున్నాయన్నారు

# 27న సిడబ్ల్యూసి భేటీ

### - ఉపాధి హామీ, పార్టీ బలోపేతం, తాజా రాజకీయ పరిస్థితులే ప్రధాన అజెండా



**న్యూఢిల్లీ, డిసెంబరు 22:** కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణయాత్మక విభాగం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం ఈ నెల 27న ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయంలో నిర్వహించనుంది. ఈ మేరకు సిడబ్ల్యుసి సభ్యులకు ఎఐసిసి సమాచారం అందించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) రద్దు చేసి, ఆ స్థానంలో విబి జి రామ్‌జి పథకాన్ని తీసుకువస్తున్న ప్రభుత్వ నిర్ణయంపై, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించడమే అజెండాగా ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. బీహార్ ఎన్నికల్లో ఓటమి తర్వాత జరుగుతున్న మొదటి సిడబ్ల్యుసి సమావేశం కావడం వల్ల దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. అంతేకాదు, 2026లో జరగనున్న అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, బంగాల్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ అనుసరించే వ్యూహంపై సిడబ్ల్యుసి సమావేశంలో చర్చించే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. సిడబ్ల్యుసి సమావేశంలో ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ రద్దు అంశంతో పాటు, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా సమాలోచనలు చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి మోడీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోళన చేపట్టే అంశాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ పరిశీలిస్తోందని సీనియర్ నాయకుడొకరు తెలిపారు.

# బిజెపికే అత్యధిక విరాళాలు

## 2024-25లో రూ.6654కోట్ల డొనేషన్లు

**న్యూఢిల్లీ, డిసెంబరు 22:** భారతీయ జనతా పార్టీకి గత ఆర్థిక సంవత్సరంలో భారీ మొత్తంలో విరాళాలు సమకూరాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.6,654 కోట్లు ఆ పార్టీకి విరాళంగా అందినట్లు తెలుస్తోంది. సభ్యత్వం రికార్డుల ఆధారంగా ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ నిలిచింది. లోక్‌సభ ఎన్నికలు జరిగిన సంవత్సరంలో ఆ పార్టీకి గత ఏడాదితో పోలిస్తే 68 శాతం విరాళాలు పెరిగినట్లు ఎన్నికల సంఘం రిపోర్టులో తెలిసింది. ఈనెల 8వ తేదీన ఆ నివేదికను సమర్పించారు. ప్రస్తుతం ఈసీ వెబ్‌సైట్‌లో ఆ రిపోర్టు ఉన్నది. 20 వేల కన్నా ఎక్కువ విరాళం అందుకున్న పార్టీ వివరాలు మాత్రమే ఆ వెబ్‌సైట్‌లో వెల్లడించారు. ఆ నివేదిక ప్రకారం ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 30, 2025 వరకు విరాళాలు ముట్టినట్లు తెలుస్తోంది. ఈ సమయంలోనే దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలతో పాటు అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఏపీ, ఒడిశా, జమ్మూకశ్మీర్, హర్యానా, జార్ఖండ్,మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో బీజేపీకి 3,967 కోట్లు విరాళంగా అందాయి. అయితే ఈసారి మాత్రం ఆ విరాళాలు 68 శాతం పెరిగినట్లు రిపోర్టులో తెలిపారు. బీజేపీకి వచ్చిన డోనేషన్లలో సుమారు 40 శాతం విరాళాలు ఎలక్టోరల్ ట్రస్టుల నుంచి వచ్చినట్లు తేల్చారు. ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ రూ.2180 కోట్ల విరాళం అందజేయగా, ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్ రూ.757 కోట్లు, న్యూ డెమోక్రాటిక్ ఎలక్టోరల్ ట్రస్టు 150 కోట్లు డోనేట్ చేశాయి. ఇక ఇతర ట్రస్టుల నుంచి సుమారు రూ.3112.5 కోట్లు బీజేపీకి విరాళంగా వచ్చినట్లు తెలిసింది. సీరం ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ ఇండియా సుమారు వంద కోట్లు విరాళం ఇచ్చింది. రుంగ్తా సన్స్ ప్రైవేటు సంస్థ 95 కోట్లు, వేదాంత 67 కోట్లు, మాక్రోటెక్ డెవలపర్స్ 65 కోట్లు, బజాజ్ గ్రూపు కంపెనీలు 65 కోట్ల, డిరైవ్ ఇన్వెస్టిమెంట్స్ సుమారు 50 కోట్లు విరాళం ఇచ్చాయి. మలబార్ గోల్డ్ 10 కోట్లు, కళ్యాణ్ జ్వలర్స్ 15 కోట్లు, హీరో గ్రూపు 23 కోట్లు, దిలీప్ బిల్డ్‌ఐకాన్ గ్రూపు 29 కోట్లు, ఐటీసీ లిమిటెడ్ 35 కోట్లు, వేవ్ ఇండస్ట్రీస్ 6 కోట్లు, జిరోదా ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ 1.5 కోట్లు విరాళం అందజేశాయి. బీజేపీ నేతలు కూడా ఆ పార్టీకి భారీగా విరాళాలు అందజేశారు.

అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ 3 లక్షలు, మంత్రి పీయూష్ హజారికా 2.75 లక్షలు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ లక్ష, ఒడిశా సీఎం మోహన్ చరన్ మాజీ 5 లక్షలు, ఇండోర్ మేయర్ భార్గవ లక్ష, ఆకాశ్ విజయవర్గియా లక్ష రూపాయాలు విరాళం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీకి మాత్రం భారీగా విరాళాలు తగ్గాయి. ఆ పార్టీకి 522.13 కోట్లు మాత్రమే విరాళాల రూపంలో వచ్చాయి. 2023-24 సీజన్‌లో 1129 కోట్లు అందుకున్న కాంగ్రెస్ పార్టీకి గత ఏడాది 43 శాతం తక్కువగా విరాళాలు అందాయి.

## భారత్ ముమ్మాటికీ హిందూ దేశమే..

## రాజ్యాంగ సవరణ అవసరంలేదు..

### ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్‌భగవత్



**కోల్‌కత్తా, డిసెంబరు 22:** సూర్యుడు తూర్పున ఉదయిస్తాడనేదానికి రాజ్యాంగం నుంచి ప్రత్యేకంగా ఆమోదం అవసరమాలలాగే భారత్ హిందూ రాష్ట్రం అన్నది కూడా అంతే సత్యమని ఆరెస్సెస్ (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. కోల్‌కతాలో జరిగిన ఒక సదస్సులో ఆయన మాట్లాడుతూ హిందూ రాష్ట్రం అనే భావనపై తన అభిప్రాయాలను ఆయన స్పష్టంగా వివరించారు. భారత్‌ను హిందూ రాష్ట్రంగా ప్రకటించేందుకు పార్లమెంటు రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం లేదని భగవత్ పేర్కొన్నారు. ఎవరు ఈ దేశాన్ని మాతృభూమిగా భావిస్తారో, ఎవరు ఇక్కడి సంస్కృతిని గౌరవిస్తారో అప్పటి వరకు భారత్ హిందూ రాష్ట్రమే. రాజ్యాంగంలో ఆ పదాన్ని చేర్చినా, చేర్చకపోయినా మాకు అది ముఖ్యం కాదు. ఎందుకంటే ఇది ఒక సత్యమని ఆయన పేర్కొన్నారు. అలాగే, పుట్టుకతో వచ్చే కుల వ్యవస్థ హిందుత్వ లక్షణం కాదని ఆయన గుర్తుచేశారు. సంఘ్ ముస్లిం వ్యతిరేక సంస్థ అనే ప్రచారాన్ని భగవత్ కొట్టిపారేశారు. ఆర్‌ఎస్‌ఎస్ పారదర్శకమైన సంస్థ. మాపై మీకు అనుమానం ఉంటే ఎప్పుడైనా వచ్చి చూడవచ్చు. మేము కేవలం హిందువులను సంఘటితం చేస్తాం, అంతమాత్రాన మేము ముస్లింలకు వ్యతిరేకం కాదని వివరించారు. హిందుత్వం అనేది ఒక సంకుచిత మతపరమైన గుర్తింపు కాదని, అది ఒక జీవన విధానమని ఆయన పునరుద్ఘాటించారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందువులపై జరుగుతున్న దాడుల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. హిందువులకు ఉన్న ఏకైక దేశం భారత్ మాత్రమే. బంగ్లాదేశ్‌లోని హిందువులు తమ రక్షణ కోసం ఐక్యంగా ఉండాలి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులంతా వారికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. సహజీవన వ్యవస్థపై స్పందిస్తూ అది బాధ్యత నుంచి తప్పించుకోవడమేనని విమర్శించారు. వివాహ వ్యవస్థ అనేది కేవలం శారీరక తృప్తి కోసం మాత్రమే కాదని, అది సమాజానికి మూలమని చెప్పారు. దేశ జనాభాను సరిగ్గా నిర్వహించలేకపోయామని, 50 ఏళ్ల ప్రొజెక్షన్‌తో ప్రభుత్వం ఒక విధానాన్ని తీసుకురావాలని సూచించారు. డాక్టర్లు, నిపుణుల సలహా మేరకు ముగ్గురు పిల్లలు ఉంటే కుటుంబంలో అహం తగ్గుతుందని, ఆరోగ్యం బాగుంటుందని తనకు తెలిసిందని భగవత్ పేర్కొన్నారు.

## శబరిమల ఎయిర్‌పోర్టు నిర్మాణానికి బ్రేక్

### - భూసేకరణ నోటిఫికేషన్ రద్దు - కేరళ ప్రభుత్వంపై హైకోర్టు ఫైర్

**తిరువనంతపురం, డిసెంబరు 22:** శబరిమల గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. భూసేకరణ కోసం కేరళ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను హైకోర్టు రద్దు చేసింది. అలాగే, సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఎస్‌ఐఎ), నిపుణుల కమిటీ నివేదికల్లోనూ స్పష్టత లేదని పేర్కొంది. చట్టంలోని నిబంధనలను అతిక్రమించి అవసరానికి మించి భూసేకరణ చేస్తున్నట్లు గుర్తించిన హైకోర్టు, ఆ ప్రక్రియను రద్దు చేసింది. ఈ మేరకు జస్టిస్ జయచంద్రన్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలిచ్చింది. తిరువల్లకు చెందిన అయానా చారిటబుల్ సొసైటీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఈ మేరకు తీర్పును వెలువరించింది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అంత భూమి ఎందుకని.. విచారణ సందర్భంగా కోర్టు ప్రశ్నించింది.

భూసేకరణ చట్టం 2013 ప్రకారం ప్రాజెక్టుకు అవసరమైన కనిష్ట భూమిని మాత్రమే సేకరించాలని కోర్టు తెలిపింది. ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం కేరళ ప్రభుత్వం.. 2,570 ఎకరాలు సేకరించాలని భావించగా.. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం భారీ విమానాలైన బోయింగ్ 777 వంటి వాటి కోసం 1,200 ఎకరాలు సరిపోతాయని పేర్కొంది. ప్రస్తుత నోటిఫికేషన్ రద్దు కావడంతో.. కేరళ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను మళ్లీ ప్రారంభించాల్సిన పరిస్థితి నెలకొంది. విమానాశ్రయ ప్రాజెక్టు మరింత జాప్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

### హెచ్1బి వీసాదారులకు మరిన్ని చిక్కులు

## అపాయింట్‌మెంట్లు రీషెడ్యూల్

### వెట్టింగ్ పాలసీ, క్రిస్మస్ సెలవులతోనే వాయిదా

### అమెరికా కాన్సులేట్ అధికార ప్రతినిధి స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, డిసెంబరు 22:** హెచ్1బి వీసాదారులకు మరిన్ని చిక్కులు వచ్చాయి. సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీ, క్రిస్మస్ సెలవుల కారణంగా డిసెంబర్ 15 నుంచి 26 మధ్య అపాయింట్‌మెంట్లను వాయిదా పడ్డాయి. ఈ మేరకు అమెరికా కాన్సులర్ రీషెడ్యూల్ చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో అమెరికా వర్క్ పర్మిట్ల రెన్యువల్ కోసం ఇండియాకు వచ్చిన హెచ్1బీ వీసాదారులకు ఊహించని షాక్ తగిలింది. అపాయింట్‌మెంట్ తేదీ ముందే ఖరారు కావడంతో భారత్‌కు వచ్చిన రెండు మూడు రోజుల్లోనే పనైపోతే వెళ్లి పోదామని అనుకున్నారు. కానీ, వారి అపాయింట్‌మెంట్లు మార్చికి వాయిదా పడ్డాయి. వందలాది మంది భారత్‌లో చిక్కుకుపోవడంతో ఇమ్మిగ్రేషన్ లాయర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపాయింట్‌మెంట్స్ రీషెడ్యూల్‌పై అమెరికా రాయబార కార్యాలయం అధికార ప్రతినిధి స్పందిస్తూ.. ఇప్పటికే స్టూడెంట్, ఎక్స్ఛేంజ్ వీసాదారులకు సంబంధించి ఎఫ్,ఎం, జే వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా అకౌంట్లను విదేశాంగశాఖ పరిశీలిస్తోందని చెప్పారు. తాజాగా, హెచ్1బి, హెచ్4 దరఖాస్తుదారులను కూడా ఇందులో చేర్చారని ఆయన పేర్కొన్నారు.



## ఆపరేషన్ సిందూర్‌లో మనకు దైవిక సాయమే అందింది!

### పాక్ సిడిఎస్ ఆసిమ్ మునీర్

**ఇస్లామాబాద్, డిసెంబరు 22:** ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌తో జరిగిన సైనిక ఘర్షణ గురించి పాకిస్థాన్ త్రివిధ దళాల అధిపతి, ఫీల్డ్ మార్షల్ అసీమ్ మునీర్ మాట్లాడుతూ భారత్‌తో జరిగిన సైనిక ఘర్షణలో తమకు దేవుడు నుంచి మంచి సహాయం అందిందని వ్యాఖ్యానించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా మే 7న భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాకిస్థాన్ , పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడి అనంతరం ఇరు దేశాల మధ్య ఘర్షణ జరిగింది. నాలుగు రోజుల పాటు కొనసాగిన ఉద్రిక్తతలు చివరకు కాల్పుల విరమణ ఒప్పందంతో తగ్గుముఖం పట్టిన సంగతి తెలిసిందే. ఇస్లామాబాద్‌లో నాలుగు రోజుల పాటు జరిగే నేషనల్ ఉలేమా కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న జనరల్ అసీమ్ మునీర్ అఫ్గనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వాన్ని ఉద్దేశించికూడా వివాదాస్పద వ్యాఖ్యలుచేసారు. పాకిస్థాన్ లేదా తెహ్రీక్‌ఇతాలిబన్ పాకిస్థాన్‌లలో ఎవరినో ఒకరిని ఎంచుకోవాలని తాలిబన్లను హెచ్చరించారు. దేశంలోకి చొరబడుతోన్న ఉగ్రవాదులలో ఎక్కువ మంది అఫ్గన్ జాతీయులేనని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో మునీర్ ఖురాన్‌లోని కొన్ని వాక్యాలను పఠిస్తూ భారత్‌తో జరిగిన సైనిక సంఘర్షణ గురించి ప్రస్తావించారు. పాకిస్థాన్ సైన్యం భారత్‌తో పోరాడుతున్నప్పుడు దేవుడి సాయం పొందిందని పాక్ డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ మునీర్ అన్నారు. మేము దానిని అనుభవించాం అని మునీర్ అన్నారు.

పాకిస్థాన్ ఏర్పాటును 1,400 సంవత్సరాల కిందట అరబ్ ప్రాంతంలో (నేటి సౌదీ అరేబియా) ప్రవక్త స్థాపించిన రాజ్యంతో మునీర్ పోల్చారు. ప్రపంచంలో 57 ఇస్లామిక్ దేశాలు ఉన్నాయని, వాటిలో హరమైన్ షరీఫైన్(మక్కా, మదీనా) సంరక్షకులుగా ఉండటం దేవుడు మాకు ఇచ్చిన గౌరవమని పాక్ త్రివిధ దళాధిపతి పేర్కొన్నారు. టీటీపీ లోకి వస్తున్న వారిలో 70 శాతం మంది అఫ్గన్ జాతీయులేనని ఆయన ఆరోపించారు.

అఫ్గనిస్థాన్ మన పాకిస్థానీ పిల్లల రక్తాన్ని చిందించడం లేదా అని అతడు ప్రశ్నించారు. ఈ క్రమంలో పాకిస్థాన్ లేదా టీటీపీలో ఎవరో ఒకరిని తాలిబన్లు ఎంచుకోవాలని ఆయన పునరుద్ఘాటించారు.

## సంక్షిప్తంగా..

### బంగ్లాదేశ్‌లో మరో విద్యార్థి నాయకుడిపై హత్యాయత్నం



**ఢాకా, డిసెంబర్ 22:** భారత వ్యతిరేకి, ఇంకిలాబ్ మోంచో నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యతో బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఆందోళనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ మరో విద్యార్థి నాయకుడిపై హత్యాయత్నం జరగడం కలకలం రేపుతోంది. బంగ్లాదేశ్ నేషనల్ సిటిజన్ పార్టీ సీనియర్ నేత మోతాలెబ్ సికదార్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. సోమవారం ఉదయం ఖులానా పట్టణంలోని సికదార్ నివాసం వద్దే ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో సికదార్ తల్లోకి తూటా దూసుకెళ్లడంతో ఎడమవైపు తీవ్ర గాయమైంది. అతడి మద్దతుదారులు వెంటనే ఆసుపత్రికి తరలించారు.

### కారుబాంబు దాడిలో రష్యా సైనిక జనరల్ మృతి

**మాస్కో, డిసెంబరు 22:** మాస్కోలో జరిగిన కారు బాంబు దాడిలో కీలక రష్యా సైనిక జనరల్ ఒకరు మృతి చెందారు. ఈ విషయాన్ని రష్యా దర్యాప్తు సంస్థ వెల్లడించింది. రష్యా సాయుధ దళాల జనరల్ స్టాఫ్‌కు చెందిన ఆపరేషనల్ ట్రైనింగ్ డైరెక్టర్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఫనిల్ సర్వరోవ్, బాంబు దాడి ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో మరణించినట్లు ఆ సంస్థ తెలిపింది. ఆయన కారు కింద అమర్చిన పరికరం పేలడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. అపార్టుమెంట్ దగ్గర కారు పార్కింగ్ ప్రాంతంలో జరిగిన ఈ దాడి వెనుక ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ హస్తం ఉన్నట్లు రష్యా అధికారులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. గత మూడేళ్లుగా రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఈ యుద్ధాన్ని ఆపేందుకు వివిధ దేశాలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఉద్రిక్తతలు మాత్రం తగ్గడం లేదు.

### సాంకేతిక లోపం: తిరిగి వచ్చిన ఎయిరిండియా విమానం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 22:** గగనతలంలో ఎయిరిండియా విమానానికి అత్యవసర పరిస్థితి ఎదురైంది. సాంకేతికలోపం కారణంగా ఇంజిన్ ఆయిల్ ప్రెజర్ జీరోకి పడిపోయింది. ఢిల్లీ నుంచి ముంబయికి బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన వెంటనే పైల్ ఈ లోపాన్ని గుర్తించారు. ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సోమవారం ఉదయం 3.20 గంటల సమయంలో ఎయిరిండియా బోయింగ్ విమానం టేకాఫ్ అయింది. ఆ వెంటనే కుడిపైవే ఇంజిన్ ఆయిల్ ప్రెజర్ అసాధారణంగా తగ్గిపోవడాన్ని పైలట్ గుర్తించారు. తర్వాత అది జీరోకు పడిపోయింది. దాంతో అప్రమత్తమైన పైలట్ విమానాన్ని వెనక్కి మళ్లించారు. టేకాఫ్ అయినచోటే సురక్షితంగా ల్యాండ్ చేశారు.

### విజయోత్సవ ర్యాలీలో మంటలు - పలువురికి తీవ్ర గాయాలు



**పూణె, డిసెంబరు 22:** మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల విజయోత్సవ ఊరేగింపులో మంటలు చెలరేగాయి. దీంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. గెలిచిన అభ్యర్థులతో సహా పలువురికి కాలిన గాయాలయ్యాయి. వారిని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మహారాష్ట్రలోని పూణే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జెజురి మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో గెలిచిన ఎన్సీపీ కౌన్సిలర్లు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో కలిసి ఆశీర్వాదం కోసం ఖండోబా ఆలయానికి వెళ్లారు. కాగా, ఆలయం ఉన్న కోట ముందు కొందరు మహిళలు సాంప్రదాయ జ్యోతులు వెలిగించారు. కోటపై ఉన్న కొందరు యువకులు స్ప్రేలతో రంగులు చల్లారు. అయితే వెలుగుతున్న జ్యోతులపై ఆ రంగులు పడటంతో మంటలు చెలరేగాయి.

### మహారాష్ట్ర మాజీ మంత్రి మాణిక్‌రావ్‌కు శిక్ష నిలిపివేత

**న్యూఢిల్లీ, డిసెంబరు 22:** మహారాష్ట్ర మాజీ మంత్రి, ఎన్‌సిపి ఎమ్మెల్యే మాణిక్‌రావ్ కోకటేకు సుప్రీంకోర్టులో పాక్షిక ఊరట లభించింది. మోసం, అవినీతి కేసులో కోకటేకు విధించిన శిక్షను నిలిపివేసింది. తర్వాత ఆయన మహారాష్ట్ర అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా అనర్హత వేటు నుంచి కూడా ఊరట లభించినట్టయింది. ఈ యేడాది ఫిబ్రవరిలో ట్రయల్ కోర్టు తనను దోషిగా నిర్ధారిస్తూ ఇచ్చిన తీర్పును కోకటే సుప్రీకోర్టులో సవాల్ చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ మాజీ మంత్రి మాణిక్‌రావ్ కోకటే శిక్షను నిలిపివేస్తూ పాక్షిక ఊరట కల్పించింది.

# స్టార్‌లింక్‌కు 'మిల్లీమీటర్' గండం - రష్యా అన్నంత పని చేస్తుందా?

**మాస్కో, డిసెంబరు 22:** అంతరిక్ష రంగంలో పశ్చిమ దేశాల ఆధిపత్యాన్ని అడ్డుకోవాలని చూస్తోన్న రష్యా.. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన 'స్టార్‌లింక్' ఉపగ్రహాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. కక్ష్యలోనే ఈ ఉపగ్రహాలను పేల్చే విధంగా సరికొత్త యాంటీ-శాటిలైట్ ఆయుధాన్ని అభివృద్ధి చేస్తోందని పశ్చిమ దేశాల నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ సందేహాలు నిజమైతే మాత్రం అంతరిక్ష రంగానికి పెను ముప్పు పొంచి ఉందని హెచ్చరిస్తున్నాయి. ఈ వ్యవహారంపై నాటో, పశ్చిమ దేశాల ఇంటెలిజెన్స్ వర్గాల అధ్యయనాలను ఆధారంగా చేసుకుని అసోసియేటెడ్ ప్రెస్ కథనం రాసింది. దీంతో రష్యా యాంటీ-శాటిలైట్ ఆయుధాన్ని సంబంధించి కీలక విషయాలు బయటికొచ్చాయి. రష్యా అభివృద్ధి చేస్తోన్న ఈ ఆయుధాన్ని 'జోన్-ఎఫెక్ట్'గా పేర్కొంటున్నారు. అంటే ఒక ఉపగ్రహాన్ని మాత్రమే కాకుండా.. కక్ష్యలో ఎక్కువ భాగాన్ని లక్ష్యంగా చేసుకోవడమే దీని ఉద్దేశం. ఒకేసారి వేల సంఖ్యలో పెల్లెట్లను కక్ష్యలోకి పంపించి అనేక స్టార్‌లింక్ ఉపగ్రహాలను కూల్చేసే విధంగా దీన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం.





**'మిల్లీమీటర్'తో భారీ ముప్పు:** ఈ పెల్లెట్లు చాలా చిన్నగా, మిల్లీమీటర్ పరిమాణంలో మాత్రమే ఉంటాయని నిఘా వర్గాలు తమ అధ్యయనంలో పేర్కొన్నాయి. వీటిని భూమ్మీద గానీ.. అంతరిక్షంలో గానీ గుర్తించడం కష్టతరమని తెలిపాయి. వీటిని ట్రాక్ చేసే అవకాశం లేకపోవడంతో ముప్పును ముందే పసిగట్టలేమని అంచనా వేశాయి. అయితే, వీటితో ప్రమాదం మాత్రం తీవ్రంగానే ఉంటుందని హెచ్చరించాయి. ఇలాంటి చిన్న పరిమాణంలో ఉండే శకలం కారణంగా ఇటీవల చైనా చెందిన ఓ వ్యోమనౌక దెబ్బతింది. దీంతో భూమ్మీదకు రావాల్సిన ముగ్గురు వ్యోమగాములు అంతరిక్షంలోనే చిక్కుకుపోయారు. అంతేకాదు.. ఒకవేళ రష్యా ఈ దాడికి పాల్పడితే కక్ష్యలోని ఇతర వ్యవస్థలకూ ప్రమాదం వాటల్లే అవకాశం ఉంది. దాడి తర్వాత పెల్లెట్లు, ఉపగ్రహ శకలాలు భూమి దిశగా కిందకు జారుతాయి. ప్రస్తుతం ఈ స్టార్‌లింక్ ఉపగ్రహాలు భూమికి 550 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కక్ష్యలో ప్రయాణిస్తున్నాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం, చైనా అంతరిక్ష కేంద్రం దీని కంటే తక్కువ ఎత్తులో ఉండే కక్ష్యలో తిరుగుతున్నాయి. ఒకవేళ శకలాలు కిందకు పడే సమయంలో వీటిని ఢీకొనే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. **స్టార్‌లింకే ఎందుకు..?** : స్టార్‌లింక్ ఉపగ్రహాలను రష్యా తమ దేశానికి తీవ్ర ముప్పుగా పరిగణిస్తోంది. యుద్ధంలో ఉక్రెయిన్ నిలదొక్కుకునేందుకు అవి సహకరిస్తున్నట్లు అనుమానిస్తోంది.

# పార్టీ ఉనికి కోసమే ఫామ్‌హౌజ్ బయటకు వచ్చిన కెసిఆర్



సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

## ఒక్క ఎకరానికి నీరుపారని పాలమూరు-రంగారెడ్డిని జాతికి అంకితం చేసిన కెసిఆర్

### పర్యాటక, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు, జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను బట్టి చూస్తే బిఆర్ఎస్ పార్టీ కండలు కరిగి తోలు మాత్రమే మిగిలినదనిపిస్తోందని పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ మూడింట ఒక వంతు సీట్లు కూడా గెలుచుకోలేక పోయింది.. ఆ పార్టీ బలహీనపడింది, దాని ప్రతిష్ట దిగ జారింది, కెటిఆర్, హరీశ్‌రావు ఆ పార్టీని కాపాడు కోలేకపోయారనీ, అందుకే బలహీనమై రోజురోజుకూ దిగజారుతున్న పార్టీని కాపాడుకోవడానికి కెసిఆర్ ఫామ్ హౌస్‌ను వదిలి బయటకు వచ్చారే తప్ప పాలమూరు ప్రాజెక్ట్‌లపై ప్రేమ కాదని అపహాస్యం చేశారు. బిఆర్ఎస్ పార్టీని ఉనికికాపాడుకొనేందుకు ఫామ్‌హౌజ్ బయటకు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్ట్‌లను గత కెసిఆర్ సర్కార్ నిరక్ష్యం చేసిందని ఆరోపించారు. ఒక్కఎకరానికి కూడా నీరు అందించలేని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతికి అంకితం చేసిన ఘనత కెసిఆర్‌దే అని ఆయన అన్నారు. నార్లాపూర్ ఏదుల్ల రిజర్వాయర్‌లకు నీరు అందించే కాలువలు కూడా పూర్తిచేయలేదని శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకోని పరిస్థితి అని అన్నారు. పది ఏండ్లలో ప్రాజెక్టులను పూర్తి చేయలేని దద్దమ్మ ప్రభుత్వం మీది అని ఆరోపించారు. పదేండ్ల పాలనలో ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేని మీకు ఉన్నట్టుండి ఇప్పుడు ప్రేమ ఒలకబోస్తున్నారని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బిజెపి కేంద్ర ప్రభుత్వంతో అంటకాగి ఏనాడు తెలంగాణ రాష్ట్ర హక్కుల గురించి కొట్లాడలేదని విమర్శించారు. బిజెపితో సఖ్యత ఉండి కూడా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌తో అంటకాగి రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు సహకరిస్తామని చెప్పింది మీరు కాదా? కృష్ణ నదీ జలాల్లో తెలంగాణ నీటి వాటాను వదులుకుంది మీరు కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర హక్కులను కాపాడుకునే అవకాశం ఉన్న ఏనాడు బిజెపి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేకపోయారని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరించడం లేదు, అభివృద్ధికి అడుగడుగునా అడ్డం పడుతోందనీ ఆవేదన చెందారు. తెలంగాణ వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా కేంద్రం యూరియాను సరఫరా చేయడం లేదని చెప్పారు. డిమాండ్‌కు అనుగుణంగా యూరియా కేటాయింపులు చేయడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన టిజి సెట్ పరీక్షలు

### 24 వరకు కొనసాగింపు.. 45,127 మంది దరఖాస్తు

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీ లెక్చరర్ల నియామక అర్హత కోసం నిర్వహించే తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టిజి సెట్)- 2025 పరీక్షలు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభ మైనట్టు టిజి సెట్ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ బి శ్రీనివాస్ తెలిపారు. ఈ పరీక్షలు ఈ నెల 24 వరకు కొనసాగనున్నాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని టిసి సెట్ కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ఉదయం 8:30 గంటలకు పరీక్షల పాస్‌వర్డ్ విడుదల చేసి, రాష్ట్రవ్యాప్తంగా పరీక్ష ప్రక్రియను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, ఓ.ఎస్.డి ప్రొఫెసర్ ఎస్. జితేంద్ర కుమార్ నాయక్, టిజి సెట్ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ బి. శ్రీనివాస్, కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి, తెలుగు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ నిత్యానంద రావు, పిజి అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ. పాండురంగారెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. కిషన్ పాల్గొన్నారు. మొదటి రోజు ఉదయం సెషన్‌లో 31 కేంద్రాల్లోనూ .. మధ్యాహ్నం సెషన్‌లో 32 కేంద్రాల్లో కలిపి మొత్తం 15వేల 705 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. 24 వరకు జరిగే టిజి సెట్ పరీక్షలకు 45,127 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే తక్షణమే పరిష్కరించేందుకు, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని మెంబర్ సెక్రటరీ స్పష్టం చేశారు. కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా ప్రతి పరీక్షా కేంద్రాన్ని రియల్ టైమ్ లో పర్యవేక్షి స్తున్నట్లు తెలిపారు.



# రాజేష్ మరణానికి కారకులైన ఎస్ఐ సహా పోలీసులపై చర్యలు తీసుకోవాలి

### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్ (గోషామహల్), డిసెంబరు 22, ప్రభాతవార్త:** కర్ల రాజేష్‌ను చట్ట విరుద్దంగా అదుపులోకి తీసుకుని తీవ్రంగా చిత్రహింసలు పెట్టి అతని మరణానికి కారకులైన ఎస్.ఐ.తోపాటు పోలీసు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను మందకృష్ణ మాదిగ, మృతుడు కర్ల రాజేష్ తల్లి కర్ల లలితమ్మతో కలిసిపత్రం సమర్పించారు. అనంతరం మంద కృష్ణమాదిగ విలేకరులతో మాట్లాడుతూ ఏ ఫిర్యాదు లేకుండా చట్టవిరుద్ధంగా దళిత సామాజిక వర్గానికి చెందిన రాజేష్‌ను అదుపులోకి తీసుకుని నాలుగు రోజులపాటు తీవ్రంగా చిత్రహింసలు పెట్టి అతని మరణానికి కారకులైన చిలుకూరు సురేష్‌రెడ్డి మీద, ఇతర పోలీసు సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
చనిపోయిన మాదిగ బిడ్డ పక్షాన నిలబడకుండా తన రెడ్డి సామాజిక వర్గం పక్షాన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి నిలబడడం ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. ఇదంతా పకడ్బందీగా ఎస్ఐ సురేష్‌రెడ్డిని కాపాడానికి ప్రణాళికబద్ధంగా ప్రయత్నాలు చేయం జరిగిందని ఆరోపించారు. తక్షణమే సురేష్‌రెడ్డి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాజకీయంగా మాదిగలంతా ఉత్తమ్ పద్మారెడ్డికి దూరమయ్యే పరిస్థితి వస్తుందన్నారు.

# హిందూ పేరుతో రాజకీయ లబ్ధికి బిజెపి కుట్రలు

### కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** హిందు పేరుతో రాజకీయాలు చేసి లబ్ది పొందాలని చూస్తున్నారని నోట్లపై ఉన్న గాంధీ బొమ్మను తొలగించి వీరసావర్కర్ బొమ్మను పెట్టాలని కుట్ర చేస్తున్నారని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు విహనుమంతరావు ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం మాట్లాడుతూపాకిస్తాన్ ముస్లిం దేశం అయినా ఇక్కడ సెక్యులర్ దేశంగా ప్రకటించుకున్నాఅయితే ఆర్.ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భగత్ దేశాన్ని హిందు దేశం అంటున్నారని అన్నారు.దేశంలో అన్ని మతాల వారు దేశంలో ఉన్నారని అందరి మనోభావాలకు గుర్తింపు ఇవ్వాలనిసూచించారు. ఎస్ఐఆర్ చేసిబిజెపి అనుకూలంగా ఉన్న వాళ్ళను జాబితాలో ఉంచి రెండో అభిప్రాయం ఉన్నవారి పేర్లు జాబితానుంచి తొలగించాలని చూస్తున్నారని ఆరోపించారు.మహాత్మా గాంధీ జీవితాన్ని త్యాగం చేసి స్వాతంత్రం తెచ్చారని ఉపాధికి ఆయన పేరు తొలిగించి అవమానం చేశారని అన్నారు. నెహ్రూ జీవితాన్ని దేశం కోసం ఎంతో చేశారని, సూది కూడా ఉత్పత్తి చేయలేని దేశాన్ని ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. గాంధీ పేరుతో ఉపాధి హామీ పథకం ఉంటే దాన్ని రద్దు చేశారని ఆవేదన చెందారు మోడీ ప్రజా వ్యతిరేక పనులు చేస్తున్నారు. దేశం కోసం ఆర్ఎస్ఎస్ ఎక్కడ పని చేయలేదని ఆరోపించారు. దేశం సెక్యులర్ దేశంగానే ఉంటదని ఆయన తెలిపారు.


ఫీజుల బకాయిల కోసం విద్యార్థుల భారీ ప్రదర్శనలో ఎంపి ఆర్.కృష్ణయ్య, అనంతుల రామూర్తిగౌడ్ తదితరులు

# ఫీజుల బకాయిల కోసం విద్యార్థుల భారీ ప్రదర్శన

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** వివిధ కాలేజీ కోర్సులు చదువుతున్న 15 లక్షల మంది విద్యార్థుల 10 వేల కోట్ల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లిం చాలని డిమాండ్ చేస్తూ సోమవారం నగరంలో వేలాదిమంది బీసీ విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అనంతుల రామూర్తిగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పగిళ్ల సతీష్ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో విద్యార్థి నాయకులు నీలా వెంకటేష్, శివ కుమార్‌యాదవ్, నరేష్‌గౌడ్, జిల్లపల్లి అంజి, రామకోటి, మోడీ రాందేవ్, నిఖిల్ పాల్గొన్నారు. విద్యార్థులనుద్దేశించి బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థుల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 'ఫీజులు కట్టాలని కాలేజీ యాజ మాన్యాలు ఒత్తిడి తెస్తున్నారు. కోర్సు పూర్తయిన ఫీజులు లేక సర్టిఫికెట్లు ఇవ్వ డం లేదు. సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు వచ్చినవారికి అప్పులు చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. కొందరు సర్టిఫికెట్లు తీసుకోలేక ఉద్యోగాలు కోల్పో తున్నారు' అని అన్నారు. 'ఫీజుల బకాయిలు చెల్లించాలని రాష్ట్రంలోని 8 వేల కాలేజీల్లో 15 లక్షల మంది విద్యార్థులు కష్టాలు పడతున్నారని ఆయన అన్నారు. ఈ ప్రదర్శనలో నిఖిల్ పటేల్, స్నేహ, మంజుల, మమత, మాధవి, అంజలి, అద్వైత, సుమలత తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# మహిళలకు ఉచిత బస్సుపాస్ కార్డు

### ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆర్‌టిసిలో అమలు జరుగుతున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్‌పాస్ కార్డు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు ఆర్‌టిసి జెఎసి తెలిపింది. ఆర్‌టిసిలో అమలు జరుగుతున్న మహాలక్ష్మి పథకం ప్రారంభమై రెండేళ్లు కావొస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం వలన మహిళలకు ఆర్టీసీ బస్‌లలో 'జీ' టికెట్‌తో ఉచిత ప్రయాణం అమలుచేయడం వలన కండక్టర్లు మహిలకు జీరో టికెట్, పురుషులకు డబ్బుల టికెట్ ఇచ్చునప్పుడు అధిక రద్దీ కారణంగా ఈ రెండురకాల టికెట్లు ఇస్తున్నప్పుడు అనుకోకుండా పురుషులకు కూడా జీరో టికె ట్ రావడం, వీటిపై టిటిఐలు కేసులు నమోదు చేయడం, ఈ కేసులకు గురైన వారిని అధికారులు నిర్లాక్ష్యంగా ఉద్యోగాల నుండి తీసి వేయడం జరుగుతుందని జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న అన్నారు. ఈ విధానాన్ని మొట్టమొదటి నుండి వ్యతిరేకిస్తూ వి టికెట్ బదులు ఉచితబస్సు పాస్‌కార్డు ఇవ్వాలని జెఎసి డిమాండ్ పెట్టిందని.. దీనిపై పలు దఫాలుగా ప్రభుత్వ, యాజమాన్యాల దృష్టికి తీసుక పోవడంపాటు జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతి పోరాట కార్యక్రమంలో ఈ డిమాండ్‌ను పెట్టి వివిధ ప్రసారసాధనాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసిందని జెఎసి నాయకులు తెలిపారు. మే 6న రవాణా శాఖ మంత్రి జెఎసితో జరిపిన చర్చలల్లో ఉచిత బస్‌పాస్ గురించి ప్రస్తావించినప్పుడు మంత్రి సానుకూలంగా స్పందించారని గుర్తు చేశారు. కొంత ఆలస్యం అయినప్పటికీ ఆదివారం ఉపముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి భట్టివిక్రమార్క ఆధ్వర్యంలో జరిగిన ఆర్టీసీ సమీక్ష సమావేశంలో ప్రభుత్వం ఎట్టకేలకు మహిళలకు ఉచిత బస్‌పాస్ కార్డు ఇవ్వాలని నిర్ణయించడం పట్ల జెఎసి హర్షం వ్యక్తం చేస్తుందని తెలిపారు. దాంతోపాటు ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీలైన యూనియన్ పునరుద్ధరణ, 2021-25 వేతన సవరణ, ఉద్యోగ భద్రత, ప్రభుత్వంలో విలీనంతోపాటు పనిభారాల తగ్గింపు, సిబ్బంది ఖాళీల భర్తీ తదితర ప్రధాన అంశాలను కూడా పరిష్కరించాలని జెఎసిగా కోరుతున్నామని చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం థామస్‌రెడ్డి, కన్వీనర్ మౌలానా కోకన్వీనర్లు, కత్తుల యాదయ్య. సుద్దాల సురేష్, బి.యాదగిరి ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని కోరారు.


మామిడాల రాములును సన్మానిస్తున్న ఘంటా చక్రపాణి తదితరులు

# ఏరోస్పేస్ రంగంలో విస్తృత అవకాశాలు

### అమెరికాలోని సియాటిల్ వర్సిటీ సీనియర్ ప్రొ. మామిడాల రాములు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), డిసెంబరు 22, ప్రభాతవార్త:** తెలంగాణ విమానయాన తయారీరంగంలో వృత్తి నైపుణ్యత పెంచేందుకు కృషి చేస్తానని అమెరికాలోని బోయింగ్ విమాన తయారీసంస్థ శాస్త్రవేత్త, పరిశోధన విభాగ అధిపతి ఆచార్య మామిడాల రాములు అన్నారు. ఏరోస్పేస్ రంగ నిపుణులకు వృత్తి, ఉపాధి కల్పన రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. బోయింగ్ రూపకల్పన, పరిశోధనతో అనుబంధం ఉన్న సీనియర్ విద్యావేత్త, వాషింగ్టన్, సియాటిల్ విశ్వవిద్యాలయంలో సీనియర్ ప్రొఫెసర్, జనగామ ప్రాంతవాసి మామిడాల రాములుతో సోమవారం డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలోని డిజిటల్ క్లాస్‌రూమ్‌లో ముఖాముఖి చర్చ (ఇంటరాక్టివ్ సెషన్) జరిగింది. ఈ అకాడమిక్ చర్చలో అన్ని విభాగాల అధ్యాపకులు, పరిశోధనా విద్యార్థులు, విశిష్ట విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య మామిడాల రాములు మాట్లాడుతూ విద్యారత్నాలకు నిలయాలు సంక్షేమ వసతి గృహాలని వివరించారు. తాను అలాంటి సంక్షేమ వసతిగృహం నుంచే వచ్చానని చెప్పుకోవడానికి సంతోషంగా ఉందన్నారు. పెద్దోళ్ల ఇళ్లలో అన్నానికి ప్రాధేయపడే స్థాయి నుంచి పెద్దోళ్ల పిల్లలకు పాఠాలు చెప్పేస్థాయికి ఎదిగినట్లు తెలిపారు. ఎవరినైనా ఉన్నతస్థాయిలో నిలిపే ఏకైక సాధనం విద్య మాత్రమే అన్నారు. విద్యలో రాణించే వారిని ప్రోత్సహించాలని, విద్య విలువలు, వృత్తి నైతికతను పాటించాలన్నారు. ఈ ముఖాముఖి చర్చలో రాష్ట్ర ప్రభుత్వ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయ అధ్యాపకులు ప్రొ. పిల్లలమర్రి రాములు, ఉస్మానియా విశ్వ విద్యాలయ మాజీరిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీ నారాయణ, సామాజిక అంశాల వ్యాసకర్త డా. గుర్రం సీతారాములు, విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ డా.ఎల్ విజయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొని అభి ప్రాయాలను పంచుకున్నారు.

# రాజకీయాలంటే పదవుల అందలమే కాదు..

# ప్రజలకు సాధికారత కల్పించాలి

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (చిక్కడపల్లి), డిసెంబరు 22, ప్రభాతవార్త:** రాజకీయాలు అంటే కేవలం పదవులను అనుభవించడం కాదు, ప్రజలకు సాధికారత కల్పించడం అనేది గుర్తుంచుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. సోమవారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విద్య సంస్థల ఆధ్వర్యంలో బిఆర్ అంబేద్కర్ లా కాలేజీ పూర్వ విద్యార్థుల సమావేశానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారై ఆ సంస్థ వ్యవస్థాపకులు, మాజీ కేంద్రమంత్రి కాకా వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ప్రసంగించారు. అంబేద్కర్ స్ఫూర్తిని కాకా కొనసాగిస్తున్నాడని ఆయన అన్నారు. కాకా బి.ఆర్. అంబేద్కర్ గొప్ప ఆశయంతో విద్యా సంస్థలను స్థాపిం చారని ఆయన అన్నారు. విద్య ద్వారానే అభివృద్ధి వస్తుందని కాకా బలంగా నమ్మారు. పేదలు, బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేశారని ఆయన అన్నారు.
కాకా తనయులు వివేక్, వినోద్ కాకా స్ఫూర్తిని కొన సాగి స్తున్నారని, వివిధ హోదాల్లో పని చేస్తున్నప్పటికీ కాకా పేదల పట్ల శ్రద్ధ వహిస్తున్నారని ఆయన అన్నారు. అంబేద్కర్ విద్యా సంస్థలు ఐదు దశాబ్దాలుగా అనేక మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చాయని ఆయన అన్నారు. ఐదు వేల మంది విద్యార్థులతో నడుస్తున్న విద్యాసంస్థలు ఇప్పటి వరకు లక్ష మంది పూర్వ విద్యార్థులను కలిగి ఉండటం గొప్ప విషయమని ఆయన అన్నారు.
అంబేద్కర్ విద్యా సంస్థలు పేదలు, మంత్రి కాకా వెంకట స్వామి విజన్ అందరికీ ఆదర్శ మని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. వెనుక బడిన విద్యార్థుల కోసం ఎంతో చేస్తున్నా యని ఆయన అన్నారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ కాక స్ఫూర్తితో ముందుకు సాగుతున్నామన్నారు. ఆయన చిపించిన బాటలో పయ నిస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విద్యాసంస్థల చైర్మన్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, కార్యదర్శి, బెల్లంపల్లి ఎమ్మెల్యే జి వినోద్, పద్మశ్రీ పురస్కార గ్రహీత శాంతా సిన్హా, విద్యాసంస్థల కరస్పాండెంట్ జి సరోజా వివేక్, సంయుక్త కార్యదర్శి రమణకుమార్, సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి, గవర్నర్ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు విద్యా సంస్థలు రూపొందించిన సావనీరును గవర్నర్ ఆవిష్కరించారు.



విద్యార్థులను సత్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, జి.వినోద్, సరోజవివేక్, ప్రొఫెసర్ లింబాద్రి, శాంతాసిన్హా తదితరులు

# మోడీ నియంతృత్వ పోకడలకు నిదర్శనం గాంధీ పేరు తొలగింపు : కొప్పుల రాజు

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** జాతీయ ఉపాధిహామి పథకంలో మహాత్మాగాంధీ పేరు తొలగింపు మోడీ నియంతృత్వ పోకడలకు నిదర్శనం అని సిడబ్ల్యుసి సభ్యుడు కొప్పుల రాజు ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం లో మహాత్మా గాంధీ పేరు తొలగించి జీరామ్ జీ తీసుకొచ్చినందుకు ప్రజలు బాధపడుతు న్నారని అన్నారు. పేద ప్రజలకు ఉపయోగపడే పథకం నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆయన వివరించారు. గ్రామీణ కేంద్రాలుగా సంపద ఏర్పాటు చేసుకోవడానికి ఈ పథకం గొప్పగా ఉపయోగపడిందని ఆయన అభిప్రాయ పడ్డారు.
20 సంవత్సరాల క్రితం 2006 ఫిబ్రవరి 2న అనంతపురంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం మొదలెట్టారని గుర్తుచేశారు. పేద ప్రజల పండగ గా నిర్వహించే అవకాశం నాకు దక్కిందని ఆయన గుర్తచేశారు. 20 సంవత్సరాల తర్వాత బృహత్తర పథకం భూస్థాపితం అయిన సందర్భంగా మీ ముందుకు వచ్చానని బాధపడ్డారు. పేద ప్రజల గుండె చప్పుడు ను వినిపించే అవకాశం వస్తుందని అనుకోలేదని చెప్పారు. సెప్టెంబర్ 2005 లో నోటి ఫై అయ్యింది. ఈ చట్టాన్ని పకడ్బాదంగా అమలుచేయటానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆదేశాలతో తూచా తప్పకుండా అమలు చేశారని దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోనే వైఎస్ హయాంలో ఇది విజవయంతంగా నడిచేలా డిజైన్ చేశారని గుర్తుచేసుకున్నారు.

# ధరణి తెచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని దెబ్బతీసింది మీరే

### పాలమూరుపై కెసిఆర్‌కు కపట ప్రేమ

### మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హయంలో తెచ్చిన ధరణి కారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైందని ఎంత మంది ప్రజల పొట్ట కొట్టారని మంత్రి వాకిటి శ్రీహరి ఆరోపించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ పాలమూరుపై కెసిఆర్ కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని ఆరోపిం చారు. కేసీఆర్‌కు మీడియా ముందుకు వచ్చి కేంద్రం నుంచి ఎపికి మాత్రేమ నిధులు తరలిపోతున్నాయనీ తెలంగాణపై వివక్ష చూపుతున్నారని మాట్లాడుతారనుకున్నాను, కానీ పాతపురాణమే మొదలు పెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నట్టు ఉండి పాలమూరు పై కెసిఆర్‌కు ప్రేమ ఎందుకు వచ్చిందో అని ప్రశ్నించారు. పాలమూరులో కెసిఆర్‌కు ఊరు, పేరు లేకున్నా ఎంపిగా గెలిపించామని పదేళ్లలో పాలమూరుపై కెసిఆర్ కపట ప్రేమ చూపించి లేనిపోని అభూత కల్పనలు సృష్టిం చారని దుయ్యబట్టారు. ఎకరానికి నీళ్ళు ఇవ్వలేని రిజర్వాయర్‌లో పంపు హౌస్ ఓపెన్ జాతికి అంకితం చేశారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఏం అంటారో అని సోయి లేకుండా కెసిఆర్ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ విషయంలో అబద్ధాలు మాట్లాడారని అన్నారు. సంఘం బండ, భూత్పూర్ లో ప్రాజెక్ట్లో బండ పగలకొడితే 20 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని ఆలోచన కూడ గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం చేయలేదని అన్నారు. కెసిఆర్‌కు త్వరితగతిన కాళేశ్వరం పూర్తిచేయాలన్న తపన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయడంలో ప్రదర్శించలేదని అన్నారు. పాలమూరుపై కెసిఆర్‌కి ప్రేమ లేకపోవడం వల్లనే శాసనసభ ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చివాత పెట్టారని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఊరికి పోయి టివి సీరియల్ లాగా ఎపిసోడ్ 1,2 అనే ప్రచారాలు ఆపండి అన్నారు. ప్రభుత్వాలుపని చేయకపోతే తోలుతీసే పని ప్రజలది అందుకే బిఆర్ఎస్ తోలు పార్ల మెంట్, బై ఎలెక్షన్‌లో, పంచాయతీ ఎన్నికల్లో తోలుతీసారని చెప్పారు. అసెంబ్లీకి కెసిఆర్ వచ్చి బిఆర్ఎస్, కాంగ్రెస్ పాలమూరు జిల్లా పాలనపై చర్చ చేయాలి? కాంగ్రెస్ పార్టీ హయంలో ప్రాజె క్టుల కోసం భూసేకరణకు నిధులు ఇస్తున్నామని తెలిపారు. అవగాహన లేకుండా ఎలా పడితే అలా మాట్లా డితే ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరన్నారు.

# కెసిఆర్ మెప్పు కోసమే సోనియాకు కిషన్‌రెడ్డి లేఖ

### ప్రజలే న్యాయనిర్ణీతలు.. ప్రతి ఎన్నికల్లో మీ తోలు తీస్తున్నారు: రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** కెసిఆర్ మెప్పుకోసమే కిషన్‌రెడ్డి సోని యా గాంధీకి లేఖ రాశారని, కిషన్‌రెడ్డి 12 సంవత్సరాల్లో తెలంగాణ అభివృద్ధి కోసం ఏం చేశారు, వాటిపై లేఖ రాయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు కదా ఏమైంది అని నిలదీశారు. మొన్ననే ప్రధాని చివాట్లు పెట్టారని వార్తలు చూసాం తెలంగాణ కు న్యాయంగా రావాల్సిన వాట నిధులు ఎందుకు రావడం లేదు ఆవేదికపైనే ఆయనను అడిగితే సరైన సమాధానం ఇచ్చినట్లు అయ్యేది కదా అని కిషన్‌రెడ్డికి సలహా ఇచ్చారు. కేంద్రంలోని బిజెపి,ఇక్కడి ప్రతిపక్ష పార్టీ తెలంగాణా ప్రజలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోరని ఆయన అన్నారు. దేశంలో తెలంగాణ అంతర్భాగం అని ఆయన గుర్తుచేశారు. నరేంద్ర మోదీ పుట్టక ముందే ఏర్పడిన పార్టీ కాంగ్రెస్ అని స్వాతంత్ర్య కోసం ప్రాణాలు అర్పించిన పార్టీ అని స్వాతంత్ర్యం చెప్పుకొచ్చారు. నెహ్రూ, ఇందిరా గాంధీ పేర్లు కనిపించకుండా చూడాలని చూస్తున్నారని ఆరోపించారు.ఉపాధి హామీ పథకానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహాత్మా గాంధీ పేరు తీసేసి జీ రామ్ జీ గాడ్సే పేరు పెడుతున్నారనీ దేశానికి వ్యతిరేకంగా వ్యవహిస్తే ప్రజలు ఊరుకోమని అన్నారు.ప్రతిపక్షనేత వయస్సు లో పెద్దవారు పాలన అనుభవం అతను కెసిఆర్ మేము ఏదైనా పొరపాటు చేసి ఉంటే మాకు మద్దతు ఇవ్వండి సలహాలు సూచనలు ఇవ్వాలని అనేక సార్లు కెసిఆర్‌ను కోరామని పొన్నం గుర్తుచేశారు. మేము ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా పాలన కొనసాగిస్తున్నామని అందుకే మాకు ప్రజలు అండగా ఉన్నారని అందుకే ఉప ఎన్నికల్లో,సర్పంచ్ ఎన్నికల్లో మాకు పట్టం కట్టారని చెప్పారు తోలు తీసే హక్కు ప్రజాస్వామ్యం లో ప్రజలకు మాత్రమే ఉందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ,ఎమ్మెల్సీ ఎన్నికల్లో , ఉప ఎన్నికల్లో,సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలే మీ తోలు తీశారని ఎద్దేవా చేశారు. ప్రజలే న్యాయ నిర్ణేతలు,శాసన సభ సమావేశాలకు రావాలని ముఖ్యమంత్రి చెప్పారు,మీ గౌరవానికి ఏమి తగ్గించకుండా చూడమని స్పీకర్ చెప్పారని ఆయన వివరించారు. మీరు అప్పులు చేసినా ఆర్థికంగా దివాళా తీయించినా ప్రజా కార్యక్రమాలు తీసుకొని వెళ్తున్నాం.మీరు హాస్టల్ అద్దెలు పెండింగ్ పెడితే మేము చెల్లించామని తెలిపారు గోదాముల్లో మీరు స్కూల్ లు పెడితే మేమూ సొంత భవనాలు కడుతున్నామని అన్నారు..మా తోలు తీసే అంశాలు ఏమి ఉన్నసభ లో చర్చించండని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ,తెలంగాణ ఉద్యమకారుడిగా మాకు గౌరవం ఉందని అన్నారు.

# ప్రేమికుడి వేధింపులతో బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్ (సరూర్‌నగర్), డిసెంబరు 22, ప్రభాతవార్త:** ప్రేమించిన వ్యక్తి ప్రవర్తన నచ్చక మాట్లాడడం మానేసినా.. తననే పెళ్లి చేసుకోవాలని వేధింపులకు గురి చేయడంతో జీవితంపై విరక్తి చెందిన బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. ఈ విషాదకర ఘటన హైదరాబాద్‌లోని అల్మాస్‌గూడలో జరిగింది. మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఇన్‌స్పెక్టర్ శంకర్‌కుమార్‌నాయక్ తెలిపిన ప్రకారం.. బాలాపూర్ మండలంలోని అల్మాస్ గూడ ఎస్ఎస్ఆర్‌కాలనీలో నివాసముంటున్న అశోక్, రూప దంపతుల కుమార్తె విహారిక (20) అబ్దుల్లాపూర్‌మెట్‌లోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కాలేజీలో బిటెక్ చదువుతున్నది. అల్మాస్‌గూడ రాజీవ్‌గృహకల్ప కాలనీకి చెందిన డెకరేషన్ పనులు చేసే కిశోర్ (32) ఆమెను ప్రేమించగా వివాహానికి కుటుంబసభ్యులు అంగీకరించారు. ఇదిలా ఉండగా కిశోర్ ప్రవర్తన నచ్చక విహారిక కొన్నిరోజులుగా అతనితో మాట్లాడడం మానేసింది. దీంతో కిశోర్ తనతో మాట్లాడాలనీ తననే వివాహం చేసుకోవాలని విహారికను ఫోన్ ద్వారా పదేపదే మెసేజ్‌ల ద్వారా మాన సికంగా ఒత్తిడి చేయడంతోపాటు వేధింపులకు గురిచేశాడు. అవమానించాడు. ఆమె కుటుంబాన్ని కూడా బెదరించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన విహారిక జీవితంపై విరక్తి చెందిన ఆదివారం రాత్రి పడక గదిలో సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్య సమాచారం అంద డంతో ఘటనా ప్రాంతానికి చేరుకున్న మీర్‌పేట్ పోలీసులు విహారిక మృతిపై విచారణ జరిపారు. కిశోర్ వేధింపులతోనే తమ కూతురు ఆత్మహత్య చేసు కుందని మృతురాలి కుటుంబం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసును నమోదు చేశారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ శంకర్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐ జి.శ్రీనివాస్‌రెడ్డి కేసును దర్యాప్తు చేస్తున్నారు.


విహారిక (ఫైల్)

## టిజి, ఎపిల్లోనే ఎస్సీలపై అధిక దాడులు

### జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** దేశంలోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎస్సీలపై దాడులు పెరగడం పట్ల జాతీయ ఎస్సీ కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఎస్సీ కమిషన్ సభ్యులు రామచందర్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఈ రెండు రాష్ట్రాల్లో దళితులపై అధిక దాడులు జరగడంతో కేసులు పెరుగుతున్నా యన్నారు. తెలంగాణలోని కోదాడలో దళిత యువకుడు రాజేష్ లాకప్ డెత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు జరగాల్సి ఉందని తెలిపారు. ఈ సంఘటకు సంబంధించి రీ పోస్ట్ మార్టం కూడా జరిగిందని చెప్పారు. ఈ ఘటనలో సిఐ సస్పెన్స్ చేశారని, అయితే ఇది సరిపోదని స్పష్టం చేశారు. కచ్చితంగా కేసు పెట్టాల్సిందేనన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి, అమరావతిలో దళితుల డికె పట్టా భూముల విషయంలో ఫిర్యాదులు అందాయని వివరించారు. ఈ ఫిర్యాదులపై విచారణ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.




## కులాంతర వివాహం చేసుకుందని గర్భిణిని కొట్టి చంపిన తండ్రి

### కర్ణాటకలో పరువు హత్య!

**హుబ్బళి, డిసెంబరు 22:** కర్ణాటకలోని హుబ్బళ్లిలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. వద్దన్నా వినకుండా కులాంతర వివాహం చేసుకుందనే కోపంతో ఓ తండ్రి తన కూతురినే హత్య చేశాడు. గర్భవతి అని కూడా చూడకుండా బంధువులతో కలిసి ఇనుపరాడ్లతో దారుణంగా కొట్టి చంపాడు. అడ్డుకున్న కూతురు అత్త, ఆడపడుచులపైనా దాడి చేశాడు. హుబ్బళ్లి జిల్లాకు చెందిన 19 ఏళ్ల మన్య పాటిల్ వేరే కులానికి చెందిన యువకుడిని ప్రేమించింది. కుటుంబ సభ్యులను ఎదిరించి ఈ ఏడాది మే నెలలో వివాహం చేసుకుంది. తండ్రి ప్రకాశ్ ఫక్రిగోడాకు భయపడి ఆ జంట స్వగ్రామానికి దూరంగా నివసిస్తోంది. అయితే, మన్య గర్భం దాల్చడంతో ఈ నెల 8న భార్యాభర్తలు ఇద్దరూ సొంతూరుకు తిరిగి వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం పొలంలో పనిచేస్తున్న మన్య భర్త, మామలపై ఆమె తండ్రి ప్రకాశ్ దాడి చేశాడు. బంధువులతో కలిసి దాడికి వచ్చిన ప్రకాశ్ నుంచి ఆ తండ్రీకొడుకులు తప్పించుకున్నారు. తిరిగి సాయంత్రం ప్రకాశ్, మరో ముగ్గురు బంధువులతో కలిసి మన్య అత్తగారింటికి వెళ్లాడు. ఇంట్లోకి చొరబడి మన్యపై ఇనుప రాడ్లతో దాడి చేశాడు. అడ్డుకోబోయిన మన్య అత్త, ఆడపడుచును కూడా కొట్టాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ మన్య ఆసుపత్రికి తరలించేలోపే కన్నుమూసింది. తీవ్రంగా గాయపడ్డ మన్య అత్త, ఆడపడుచు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మన్య భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## విద్యాదీశతీర్థశ్రీపాదరుస్వామికి చిన్నమర్యాద

**తిరుమల,డిసెంబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** ఉడిపి బండారుకేరిమఠం పీఠాధిపతి విద్యాదీశతీర్థశ్రీపాదరు స్వామికి టిటిడి చిన్నమర్యాద చేసింది. సోమవారం ఉదయం శిష్యులతో కలసి ఆలయం వద్దకు విచ్చేసిన స్వామివారికి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ ,అర్చకులు ఇస్తికఫాలత్‌తో స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన స్వామి ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మళ్లీ ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్న కెసిఆర్

### పరిధి దాటి మాట్లాడితే మంచిది కాదు ఖబద్దార్

### జూరాల, ఆర్‌డిఎస్ ప్రాంతాల్లో సమావేశాలు పెడతాం

### టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, బక్కని నర్సింహులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 22:** చంద్రబాబు గానీ, తెలుగుదేశం పార్టీ గానీ గత 20 సంవత్సరాలుగా తెలంగాణలో అధికారంలో లేదు. అయినా చంద్రబాబుగారి గురించి, తెలుగుదేశం పార్టీ గురించి ఇంకా కేసీఆర్ మాట్లాడుతున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తప్పుపట్టారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు మళ్లీ ప్రాంతీయ విభేదాలు సృష్టించే ప్రయత్నాలు ప్రారంభించారని మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షల మేరకు చంద్రబాబు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మూడు సార్లు లేఖ ఇచ్చారని గుర్తు చేశారు. ఆర్‌డీఎస్ కెనాల్ దగ్గర కుర్చీ వేసుకుని ప్రాజెక్టును నిర్మిస్తానన్న కెసిఆర్. పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా తెలంగాణ రాష్ట్రాన్ని పాలించి మహబూబ్‌నగర్ జిల్లాకు ఏమీ చేయలేదన్నారు. రాబోయే జడ్పీటీసీ, వాటి తరువాత వచ్చే శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రాంతీయ విభేదాలను సృష్టించాలని కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌కు బీఆర్ఎస్ అధ్యక్షులుగా చంద్రశేఖర్ అనే వ్యక్తిని కేసీఆర్ నియమించారని,. దేశ్‌కి నేత అంటూ మహారాష్ట్రలో కూడా కేసీఆర్ పర్యటించారని,. విశాల హృదయంతో ఆలోచించకుండా కేసీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. జగన్‌మోహన్ రెడ్డితో అలయ్ బలయ్ చేసుకుని కేసీఆర్ దావత్ ఇచ్చారని, అప్పుడు కేసీఆర్ ఎందుకు ప్రాజెక్టుల గురించి మాట్లాడలేదన్నారు.కేసీఆర్ మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా గెలిచింది చంద్రబాబు ఆశీర్వాదంతోనని, కేసీఆర్ ఎంపీగా మహబూబ్‌నగర్ జిల్లాకు ఏమి తీసుకొచ్చారో సమాధానం చెప్పాలి? అని ప్రశ్నించారు. విశాఖపట్నంలో చంద్రబాబు ప్రభుత్వం పరిశ్రమల కోసం ఎంఒయూ చేసుకున్నవాటిలో అటెండర్ల పేర్లు కూడా ఉన్నాయని కేసీఆర్ మాట్లాడటం సరికాదని, అలాంటి పేర్లతో ఎంఒయూలు మీ స్నేహితుడు జగన్‌మోహన్ రెడ్డి హయాంలోనే జరిగాయని కేసీఆర్‌కు గుర్తు చేస్తున్నామన్నారు.వెలుగుపథకం, వనసంరక్షణ పథకం, మహిళా సంఘాలు, ఆరోగ్యానికి సంబంధించి 100 పడకల ఆసుపత్రి ఇలా అనేక పథకాలు చంద్రబాబు తీసుకొచ్చి అమలు చేశారని అన్నారు. మీ కుమార్తె కవితఅడుగుతున్న ప్రశ్నలకు కేసీఆర్ ముందు సమాధానం చెప్పాలి. మీ కుటుంబ సభ్యులు అక్రమంగా కొన్న భూముల వివరాలను తగిన సమయంలో బయటపెడతామన్నారు. మాకూ అన్ని భాషలూ వచ్చు.. కేసీఆర్ నీ పరిధిలో నీవు ఉండి మాట్లాడితే మంచిది. పరిధి దాటితే మంచిదికాదు ఖబడ్దార్ అని హెచ్చరించారు. 2014లో 15 మంది టీడీపీ ఎమ్మెల్యేలను తీసుకున్నావు. 2018 లోనూ గెలిచిన ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలను తీసుకున్నావు. ఎవరి ప్రలోభాలకు లొంగకుండా ఉన్న ప్రస్తుత తెలుగుదేశం పార్టీ ని తూలనాడే పని చేయవద్దు. చంద్రబాబు గురించి మాట్లాడితే ఒప్పుకోం... ఎన్‌టిఆర్ వారసులం మేము... కొంత సంయమనం పాటిస్తున్నాం. ఇంక ఊరుకోం.. తగిన బుద్ధి చెబుతాం. కేసీఆర్ సమావేశాలు పెడతామంటున్నారు.. అంతకన్నా ముందు మేమే తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి జూరాల, ఆర్‌డీఎస్ ప్రాంతాలలో తిరిగి ప్రజలకు కేసీఆర్ చేసిన మోసాల గురించి బయటపెడతామన్నారు.

# కెసిఆర్ స్టేట్స్‌మన్‌లా మాట్లాడితే మీకు బాధ ఏమిటో?

### సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌పై హరీశ్‌రావు విమర్శలు




సోమవారం తెలంగాణభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్ర హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 22:** కేసీఆర్ ఆదివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన మాటలపై రేవంత్ రెడ్డి చిట్‌చాట్‌లో స్పందించిన తీరును బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు తప్పుపట్టారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన కేసీఆర్ ఒక స్టేట్స్ మెన్‌లా మాట్లాడితే.. రేవంత్‌రెడ్డి స్ట్రీట్ రౌడీలా మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ చాలా గొప్పగా మాట్లాడారని, ఆ మాటతో సీఎం రేవంత్‌రెడ్డికి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వచ్చిన బాధ ఏమిటో అర్థం కావడం లేదని హరీశ్‌రావు అన్నారు. తప్పు చేసింద్రు కాబట్టే వాళ్లకు బాధ కలుగుతున్నదని వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉత్తరకుమారుడిగా తేలిపోయారని ఎద్దేవా చేశారు. ఆసరా పింఛన్‌లను రూ.4 వేలకు పెంచుతామని ఎందుకు పెంచలేదని కేసీఆర్ ప్రశ్నించారని, దానికి మీరు ఎందుకు సమాధానం చెప్పలేదని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీకి అపారమైన అనుభవం ఉన్నదని, నిధులు ఎలా సమీకరించాలో, ప్రజలకు ఎలా ఇవ్వాలో బాగా తెలుసని ఎన్నికల ముందు చెప్పింద్రు కదా.. ఇప్పుడు ఏమైంది మీ అనుభవం అని హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. మీ అనుభవం అంతా దోపిడీలకు, కమిషన్‌లకు, వాటాలకు, లూటీలకే సరిపోయిందా..? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేస్తే యూరియా బస్తాలు తెచ్చి ఇంట్లో వేసి వెళ్లేవారని, ఇప్పుడు చెప్పులు లైన్‌లో పెట్టే పరిస్థితి వచ్చిందని, యాప్‌లు, మ్యాప్‌లతో రైతులను ఎందుకు గోసపెడుతున్నర్రు అని కేసీఆర్ ప్రశ్నించారు. దానికి మీ సమాధానం ఏదీ అని హరీశ్‌రావు క్వశ్చన్ చేశారు. తాము ఫార్మాసిటీ కోసం కేటాయించిన స్థలంలో ఇప్పుడు ఫ్యూచర్ సిటీ ఎందుకు అంటున్నారని కేసీఆర్ అడిగిన ప్రశ్నకు సీఎం నుంచి సమాధానం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు.

కేసీఆర్ రాష్ట్ర ప్రయోజనాల గురించి, హైదరాబాద్ శ్రేయస్సు గురించి మాట్లాడితే.. రేవంత్ రెడ్డి అంతా సొల్లు మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఆర్థిక అరాచకత్వం సాగింద్ఠి అన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలపై కూడా మాజీ మంత్రి మండిపడ్డారు.ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో నువ్వు ఆహ్వానించిన ప్రముఖులే తెలంగాణ ఆర్థిక ప్రగతిని కొనియాడారని హరీశ్‌రావు గుర్తుచేశారు. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, ఆర్బీఐ గవర్నర్ సుబ్బారావు మాట్లాడిన మాటలను రేవంత్ రెడ్డి ఒకసారి వీడియో పెట్టుకుని చూడాలని సూచించారు. కొత్త రాష్ట్రమైనా తెలంగాణ అద్భుతమైన ఆర్థిక ప్రగతిని సాధించిందని, మూడు రెట్ల జీఎస్‌డీపీని సాధించిందని, మూడు రెట్ల తలసరి ఆదాయం పెరిగిందని వారు కేసీఆర్ పాలనను మెచ్చుకున్న విషయాన్ని గుర్తుచేశారు.రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ.. 11 లక్షల 60 వేల 895 ఎకరాలకు నీళ్లిస్తామని అసెంబ్లీ చెప్పారని, కనీసం 11వేల ఎకరాలకు అయినా నీళ్ల ఇచ్చింద్రా..? అని ప్రశ్నించారు. తాము 17 లక్షల 24 ఎకరాలకు కొత్త ఆయకట్టు ఇచ్చామని, 31లక్షల ఎకరాలను స్థిరీకరించామని చెప్పారు. రేవంత్‌రెడ్డి 11 లక్షల ఎకరాలకు నీళ్లు ఎక్కడ ఇచ్చాడో చూపెట్టాలని,లేదంటే ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలను క్షమాపణ కోరాలని మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షి గా మోసం చేశామని రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాల్సిందిపోయి, కాంగ్రెస్ నేతలు ఇంక సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని

## 2030కి భారత్ 7 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ

### కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ అంచనాలు




**న్యూఢిల్లీ, డిసెంబరు 22:** భారత్ జిడిపి 2026 సంవత్సరంలో 7.5శాతం వృద్ధినమోదుచేస్తుందని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ విశ్లేషించింది. అంతకుముందు వేసిన వృద్ధి అంచనాలను సవరించింది. వ్యవసాయ ఉత్పత్తులు పెరగడం, పండగ సీజన్ డిమాండ్, పన్నులు తగ్గింపులు, జిఎస్టీ రేట్లు సవరణ వంటివాటితో రెండో అర్థభాగంలోనే వృద్ధి పెరిగిందని వెల్లడించింది. అలాగే సుంకాల కారణంగా ఎగుమతులు కొంత తగ్గినా పండగ సీజన్ వినియోగంతో కొంత ఊపందుకుంది. దీనితో వచ్చే ఆర్థిక సంవత్సరంలో కరెంటు ఖాతాలోటు, ఆర్థికలోటు రెండూ కూడా అంచనాలకు అనుగుణంగానే ఉంటాయని వెల్లడించింది. 2030 నాటికి భారత్ ఏడులక్షలకోట్ల డాలర్ల ఆర్థికవ్యవస్థ ఉన్న దేశంగా భాసిల్లుతుందని కూడా కేర్ వెల్లడించింది. 2027 ఆర్థిక సంవత్సరంలో ఏడుశాతం మాత్రమే ఉంటుందని వెల్లడించింది. ద్రవ్యోల్బణం రిటైల్ 2.1శాతంగా ఉంటుందని, 2027లో నాలుగు శాతానికి పెరగవచ్చని వెల్లడించింది. ఇక కరెంటుఖాతాలోటు కూడా గణనీయంగా తగ్గు తుందని, స్థూల దేశీయోత్పత్తిలో ఒకటిశాతంగా ఉంటుందని వెల్లడించింది. ఇక ఆర్థిక సంతులనం ప్రాధాన్యతగా ఉంటుందని, ఆర్థికలోటు మొత్తం జిడిపిలో 4.2 నుంచి 4.3శాతానికి చేరుతుందని కేర్‌ఎడ్జ్ విశ్లేషించింది. ప్రపంచంలోనే శరవేగంగా వృద్ధిచెందుతున్న మేజర్ ఆర్థికవ్యవస్థ ఉన్న దేశంగా భారత్ కొనసాగుతోందని అంచనా వేసింది.

## వైకుంఠద్వార దర్శనాలకు ఏర్పాట్లు పూర్తి

### కేటాయించిన సమయానికే భక్తులు క్యూలైన్ల వద్దకు చేరుకోవాలి - సూచించిన మార్గాల్లోనే భక్తులు ప్రవేశించాలి - వైకుంఠద్వార దర్శనాలకు సకల ఏర్పాట్లు - మంత్రుల సబ్‌కమిటీ విజ్ఞప్తి

**తిరుమల,డిసెంబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి తొలిమూడురోజులు (డిసెంబర్ 30,31,జనవరి 1)ఆన్‌లైన్‌లో టోకెన్లు అందుకున్న భక్తులు కేటాయించిన సమయానికి తిరుమలకు చేరుకుని క్యూలైన్లలో రావాలని రాష్ట్రమంత్రులు విజ్ఞప్తి చేశారు. సామాన్య భక్తులకు దర్శనాలు చేయించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలతోనే ఆన్‌లైన్‌లో టోకెన్లు జారీచేయడం జరిగిందన్నారు. భక్తులు ప్రశాంతంగా ,సంయమనంతో కేటాయించిన సమయానికి ప్రవేశమార్గాల వద్దకు చేరుకుని భక్తితో వైకుంఠద్వార దర్శనాలు చేసుకోవాలని మంత్రులు సూచించారు.గత ఏడాది వైకుంఠద్వార దర్శనాల సందర్భంగా చోటుచేసుకున్న అపశృతిని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది ప్రశాంతంగా భక్తులకు వైకుంఠ దర్శనాలు చేయించేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలతో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, దేవాదాయశాఖ మంత్రి ఆనంరామ నారాయణరెడ్డి, తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి, రాష్ట్రరెవెన్యూశాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ ముగ్గురు కలసి సోమవారం రాత్రి తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు , సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ టిటిడి విభాగాల ఉన్నతాధికారులు, పోలీసు అధికారులతో కలసి అన్ని కోణాల్లో సమీక్షించారు. ఈ ఏడాది పదిరోజుల వైకు:ఠద్వార దర్శనాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

ఎక్కడా చిన్నపాటి అసౌకర్యం, ఇబ్బందులు లేకుండా భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందన్నారు. భక్తులు కూడా టోకెన్లు ఉన్నవారే ఆలయంలోనికి చేరుకునేలా భద్రత సిబ్బంది చర్యలు తీసుకుంటారన్నారు. పూర్తిస్థాయిలో భద్రత ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. భక్తులను కూడా తిరుమలలో మూడుప్రాంతాల నుండి అనుమతించడం జరుగుతుందని, ఆయా రోజుల్లో సమయం ప్రకారం క్యూలైన్ల వద్దకు రావాల్సి ఉంటుందన్నారు. ఉదయం,మధ్యాహ్నం, సాయంత్రం టోకెన్లు ఉన్న భక్తులు ఎక్కడ నుండి క్యూలో ప్రవేశించాలని రూట్‌మ్యాప్ పోలీసుశాఖ సిద్ధం చేసిందన్నారు. ఆ ప్రదేశాల్లోనే మొదట మూడురోజులు స్లాట్ టోకెన్లు ఉన్న భకుత్లను ఆలయంలోనికి అనుమతి ఉంటుంద న్నారు. భక్తులకు వైకుంఠద్వార దర్శనాలు కల్పించేందుకు టిటిడి సర్వం సిద్ధమైందన్నారు. 30,31,జనవరి 1మూడు రోజులు టోకెన్లు ఉన్నవారికి మాత్రమే దర్శనం ఉంటుందని స్పష్టం చేశారు. ఉదయం స్లాట్ టోకెన్లు భక్తులను తిరుమలలోని కృష్ణతేజ కూడలి నుండి, మధ్యాహ్నం స్లాట్ భక్తులను ఏటిజిహెచ్‌నుండి, సాయంత్రం స్లాట్ టోకెన్ భక్తులను శిలాతోరణం కూడలి నుండి దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపారు.

## సంక్షేమ స్కాలర్‌షిప్‌లకు రూ.365.75 కోట్లు విడుదల

### మెస్ ఛార్జీలపై త్వరలో నిర్ణయం

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, గిరిజన సంక్షేమ శాఖలకు సంబంధించి స్కాలర్‌షిప్ నిధులను ఆర్థిక శాఖ విడుదల చేసింది. మొత్తం రూ. 365.75 కోట్ల బకాయిలను మంజూరు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో సాంఘిక సంక్షేమ శాఖకు రూ. 191.63 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖకు రూ. 152.59 కోట్లు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖకు రూ. 21.62 కోట్లు కేటాయించారు.

ఈ నిధుల విడుదలతో గత ప్రభుత్వం నుండి పెండింగ్‌లో ఉన్న మెజారిటీ బకాయిలు పరిష్కారమైనట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. కాగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడమే కాకుండా విద్యా రంగంలో మౌలిక సదుపాయాల కల్పనపై కూడా దృష్టి పెట్టింది. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు అందించే భోజన వసతి, మెస్ చార్జీల విషయంలో కూడా త్వరలో సానుకూల నిర్ణయం తీసుకోనుంది. కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకురాకుండా ఉండేందుకు ఈ బకాయిల విడుదల ఎంతో కీలకంగా మారనుంది. మంజూరైన నిధులు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి లేదా సంబంధిత విద్యా సంస్థలకు జమ అయ్యేలా పారదర్శకమైన చర్యలు తీసుకుంటున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

## ప్రియుడి మోజులో కట్టుకున్న భర్తనే కడతేర్చింది..

### భార్యసహా ముగ్గురు నిందితుల అరెస్ట్



పూర్ణిమ



పి. మహేష్



భూక్య సాయికుమార్

**హైదరాబాద్ (మేడిపల్లి), డిసెంబరు 22, ప్రభాతవార్త :** వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని తన భర్తని ప్రియుడు, ప్రియుడు స్నేహితుడితో కలిసి గొంతుకోసి హత్య చేసిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... తూర్పు బృందావన్ కాలనీ బోడుప్పల్ లో వి జె అశోక్ (45) తన భార్య పూర్ణిమ(36), కొడుకుతో నివాసం ఉంటున్నారు. అశోక్ శ్రీనిధి విశ్వవిద్యాలయంలో లాజిస్టిక్ మేనేజర్ గా,భార్య పూర్ణిమ ఇంటి దగ్గరే ప్లే స్కూల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు.తన భార్య ఏ1 పూర్ణిమ,గతంలో అదే కాలనీలో నివాసం ఉన్న ప్రియుడు భవన నిర్మాణ కార్మికుడు ఏ 2 పాలేటి మహేష్ తో అక్రమ సంబంధం ఉందని అనుమానం పెంచుకున్న భర్త తన భార్యను ప్రశ్నించడం వేధించడం ప్రారంభించాడు.దీని కారణంగా తన భార్య ప్రియుడుతో కలిసి భర్తను అంతమొందించడానికి కుట్రపన్నారు.ప్రియుడి స్నేహితుడైన యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఏ3 భూక్య సాయికుమార్ (22) సహాయంతో ఈనెల 11న తన భర్త ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత మహేష్ ,సాయి కుమార్ అతని పట్టుకుని దాడి చేయగా భార్య అతని కాళ్ల పట్టుకుంది.మహేష్ మూడు చున్నీలతో మృతుడిని గొంతు కోసి హత్య చేశారు.హత్య తర్వాత నిందితుడు మృతుడి బట్టలు మార్చాడు. సాక్షాలు లేకుండా చేయడానికి వస్తువులను పడేశాడు.

తన భర్త గుండెపోటు వల్ల మరణించాడని బంధువులను తప్పుదారి పట్టించింది.తన భర్త ఇంటి వాష్‌రూమ్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్నారని మల్కాజ్గిరి ప్రభుత్వాసుపత్రిలో మరణించినట్లు ప్రకటించారని మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొదట్లో ఎలాంటి అనుమానం కలుగలేదు.కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మృతదేహంపై అనుమానాస్పద గాయాలు కనిపించడం, చెంప, మెడపై గాయాలు కూడా ఉండడంతో మరణంపై కొంత అనుమానం రావడంతో సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు ఆపిల్ ఫోన్ (ఏ2), రక్తంతో తడిసిన మూడు చున్నీలు, మరకలున్న చొక్కా బనియన్, మరణించిన వ్యక్తి యొక్క విరిగిన పళ్ళు, నేరారూపణ చేసే ఫోటోలు, వీడియోలు ఉన్న ఒక పెన్ డ్రైవ్, ఫ్యాషన్ ప్రో 2 వీలర్ బైక్ (ఏ3),రక్తపు మరకలు ఉన్న ప్యాంటు చొక్కా (ఏ3) ఆధారాలతో ఏ1తన భార్య పూర్ణిమ,ఏ 2 పాలేటి మహేష్ ,ఏ3 భూక్య సాయికుమార్‌గా నిందితులుగా గుర్తించారు.కేసును సెక్షన్ 194 బిఎన్ఎస్ఎస్ నుండి సెక్షన్ 103(1),238 ఆర్/డబ్ల్యూ 3(5) బిఎన్ఎస్ కు మార్చారు. రాచకొండ పోలీస్ కమిషనర్ జి సుధీర్ బాబు నాయకత్వంలో మల్కాజిగిరి జోన్ డిసిపి సిహెచ్ శ్రీధర్, మల్కాజ్గిరి ఏసిపి ఎస్ చక్రపాణి, ప్రత్యక్ష పర్యవేక్షణలో కేసును గుర్తించారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్ సిఐ గోవిందరెడ్డి, ఎస్ఐలు నర్సింగరావు, ఉదయ భాస్కర్, సిబ్బంది బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు.

## ధనుర్మాసానికి విశేష ప్రాధాన్యం

### ఏకాంతంగా తోమాల, అర్చన ఆర్జితసేవలు

**తిరుమల,డిసెంబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి అత్యంత ముఖ్యమైన ధనుర్మాసానికి విశేష ప్రాధాన్యం ఉంది. ఈ మాసంలో శ్రీవారికి విశేష కైంకర్యాలు నిర్వహిస్తారు. బిల్వపత్రాలతో సహస్రనామార్చన చేస్తారు. విల్లిపుత్తూరు చిలుకలను ప్రతి రోజూ స్వామివారికి అలంకరిస్తారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి విశేష ప్రసాదాలను నివేదిస్తారు.పురాణాల ప్రకారం ధనుర్మాసంలో దేవతలు



సూర్యోదయానికి ఒకటిన్నరగంట ముందుగా నిద్రలేచి బ్రహ్మముహూర్తంలో శ్రీమహావిష్ణువును ప్రత్యేకంగా ప్రార్థిస్తారు. అందువల్ల ఈ మాసానికి సౌరమానంలో ప్రత్యేక ప్రాధాన్య ఉంది. డిసెంబర్ 17వతేదీ నుండి స్వామివారికి సుప్రభాతసేవ స్థానంలో తిరుప్పావై పాశుర పారాయణాన్ని నివేదిస్తున్నారు. 12మంది ఆళ్వారులలో ఆండాళ్ గోదాదేవి ఒకరు. ఈమెను నాచియార్ అని పిలుస్తారు. శ్రీవేంకటేశ్వరస్వామిని స్తుతిస్తూ ఆండాళ్ రచించిన 30 పాశురాలను కలిపి తిరుప్పావై అంటారు. ఈ మాసంలో ఆలయంలో సాధారణంగా భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామికి ఏకాంతసేవ నిర్వహిస్తారు. తిరుప్పావై పఠనం పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది. ధనుర్మాసంలో ఆలయంలోపల స్వామివారికి నిర్వహించే తోమాల,అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా జనవరి 14వరకు ఆర్జితసేవలు కూడా రద్దుచేశారు. అదేగాక ఈనెల 29వతేదీ నుండి జనవరి 1వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దుచేయడం జరిగింది. అదేవిధంగా జనవరి 2వ తేదీ నుండి 8వరకు స్వామివారి కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు. భక్తులను అనుమతించరు.

## పరీక్ష గదిలోనే బిడ్డను ప్రసవించిన విద్యార్థిని

**బెగుసరాయ్, డిసెంబరు 22:** బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో ఒక అరుదైన, ఆశ్చర్యకరమైన ఘటన చోటుచేసుకుంది. డిగ్రీ పరీక్షలు రాస్తున్న ఓ గర్భిణికి పరీక్షా కేంద్రంలోనే నొప్పులు రావడంతో, అక్కడి సిబ్బంది సాయంతో ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. బేగుసరాయ్ జిల్లా మల్హూర్ గ్రామానికి చెందిన రవిత కుమారి భరద్వాజ్ కాలేజీలో బీఏ చదువుతోంది. ఘాటియా గ్రామంలోని శశి కృష్ణ కాలేజీలో ఎకనామిక్స్ పేపర్ రాసేందుకు ఆమె హాజరైంది. పరీక్ష జరుగుతున్న సమయంలోనే ఆమెకు ప్రసవ వేదన మొదలైంది. ఆమె పరిస్థితిని గమనించిన పరీక్ష విధుల్లో ఉన్న మహిళా సిబ్బంది వెంటనే స్పందించారు. ఆమెను ఒక ఖాళీ గదిలోకి తీసుకెళ్లారు. కాలేజీ యాజమాన్యం అంబులెన్స్‌కు సమాచారం అందించినప్పటికీ, అది వచ్చేలోపే మహిళా సిబ్బంది రవితకు ప్రసవం చేశారు. పరీక్ష గదిలోనే శిశువు ఏడుపు వినిపించడంతో తోటి విద్యార్థులు, స్టాఫ్ ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. అనంతరం అక్కడికి చేరుకున్న అంబులెన్స్‌లో తల్లీబిడ్డలను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారిద్దరూ ఆరోగ్యంగా, నిలకడగా ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిండు గర్భిణి అయినప్పటికీ, చదువుపై ఉన్న మక్కువతో పరీక్షలకు హాజరైన రవిత కుమారి ధైర్యాన్ని ప్రతి ఒక్కరూ మెచ్చుకుంటున్నారు. వివాహమైనప్పటికీ ఆమె తన చదువును ఆపకుండా పరీక్షలకు సిద్ధమవ్వడం విశేషం.



## సహకార సంఘాలు, కార్పొరేషన్లకు షాక్

### కొత్త యేడాది నుండి అద్దె నిధులు నిల్

**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** నూతన సంవత్సరంలో రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఇతర సహకార సంస్థలకు అద్దె నిమిత్తం నిధులు విడుదల చేయబోమని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ప్రైవేటు భవనాల్లో ఉన్న ఆయా కార్యాలయాలకు ఫిబ్రవరి 1 నుండి ఎలాంటి అద్దె చెల్లింపులు చేయవద్దని ట్రెజరీ అధికారులకు ఆర్థిక శాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఇదే సమయంలో గ్రాంట్ ఇన్ ఎయిడ్, సీఎస్‌ఎసన నిధుల నుండి కూడా ఈ అద్దెలు చెల్లించడానికి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబడదని పేర్కొంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, కార్పొరేషన్లతో పాటు, సహకార సంఘాలకు సంబంధించి అద్దె కార్యాలయాల్లో ఉంటున్న వాటిని ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని తేల్చిచెప్పింది. రాష్ట్ర విభజన తదుపరి రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యాలయాలు ఖాళీగా ఉన్నాని, అన్ని శాఖల కార్యదర్శులు, హెచ్ఓడి ఈ నెల 31వ తేదీ లోపు వాటిలోకి మార్చాలని సూచించింది. జనవరి 1 నుండి అన్ని సహకార సంఘాలు, కార్పొరేషన్లు ప్రభుత్వ భవనాల్లోనే కొనసాగించాల్సి ఉంటుందని వెల్లడించింది. రాష్ట్రంలోని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, హెచ్ఓడీలు, సెక్రటేరియట్ విభాగాలకు ఆర్థిక శాఖ సర్క్యులర్‌ను పంపించింది.



కుప్పంలో పరిశ్రమల ఏర్పాటు స్థలాలు పరిశీలిస్తున్న ఎపిఐఐసి ఎండి

# కుప్పంలో పరిశ్రమల నిర్మాణాలు వేగవంతం చేయాలి


**- ఎపిఐఐసి ఎండి అభిషిక్త్ కిషోర్**

**- క్షేత్రస్థాయిలో పర్యటన.. ఎంఎస్ఎంఇ పార్కు పరిశీలన**

కుప్పం, డిసెంబరు 22 ప్రభాతవార్త: కుప్పం నియోజకవర్గంలో జరుగుతున్న పరిశ్రమల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎపిఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ అభిషిక్త్ కిషోర్ సూచించారు. సిఎ ం చంద్రబాబునాయుడు ఆదేశాలతో సోమవారం ఆయన కుప్పంలో పర్యటించారు. ఈసందర్భంగా పొగురుపల్లి వద్దసుమారు 35 ఎకరాల్లో ఏర్పాటైన ఎంఎస్ఎంఇ పార్కును ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, ఆర్డీఓ శ్రీనివాసులురాజుతో కలసి పరిశీలించారు. ఎంఎస్ఎంఇ పార్కులో ఏర్పాటవుతున్న పరిశ్రమల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాంతిపురం మండలంలో శ్రీజ డెయిరీ, మదర్‌డెయిరీల ఏర్పాటు ప్రాంతాలను పరిశీలించారు. కుప్పం ఎయిర్‌పోర్ట్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇ-రాయిస్ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ పరిశ్రమను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబునాయుడు రూ.2203 కోట్లతో శంకుస్థాపన చేసిన ఏడు పరిశ్రమలు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కుప్పంలో ఎంఎస్ఎంఇ పార్కును మరింత విస్తరించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎపిఐఐసి అధికారులను ఆదేశించారు. అంతకుముందు కడ కార్యాలయంలో పరిశ్రమలకు సంబంధించి కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, ఎపిఐఐసి చీఫ్ ఇంజనీర్, జోనల్ మేనేజర్, కడ సభ్యులు సుగుణమ్మ, సతీష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# ఫైళ్లూ కదలవు... పనులూ జరగవు

**● నిస్తేజంలో కూటమి పార్టీల కార్యకర్తలు ● హామీలతో సరిపెడుతున్న నాయకులు**



ధర్మవరం, డిసెంబరు 22 ప్రభాతవార్త: ఆంధ్ర ప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తల్లో నూతన ఉత్సాహం, సంతోషం పొంగుకొచ్చింది. నూతన ప్రభుత్వ ఏర్పాటుతో వారి కష్టాలు తొలగిపోతాయి అనుకున్న తరుణంలో ముఖ్యంగా కూటమిలోని మూడు పార్టీల నాయకులు తమ కార్యకర్తలకు ఇచ్చే గుర్తింపు గాని, వారు అడిగిన పనులు ఇటు రెవెన్యూ శాఖలోను, అటు మున్సిపాలిటీల్లోనూ పనులు చేసిపెట్టడంలో చొరవ, చలనం గాని లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కూటమి కార్యకర్తలు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో కూటమి ఏర్పాటులో భాగంగా బిజెపి అభ్యర్థులు పోటీ చేసి గెలిచిన నియోజకవర్గాల్లో కూటమి కార్యకర్తల పరిస్థితి మరీ దయనీయంగా మారిందని చెప్పవచ్చు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆది నుండి టిడిపికి మంచిపట్టున్న నియోజకవర్గాలలో ధర్మవరం ఒకటి. కూటమి పొత్తులో భాగంగా ఈ ధర్మవరం నియోజకవర్గం బిజెపికి కేటాయించగా అత్యధిక మెజార్టీతో బిజెపి పార్టీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ గెలుపొంది మంత్రి పదవి సైతం చేపట్టాడు. దీంతో ఈ మూడు పార్టీల కూటమి కార్యకర్తలు ధర్మవరం నియోజకవర్గ శాసన సభ్యులు, మంత్రి దృష్టికి తమ సమస్యలు చెప్పుకోవాలా... లేక నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తమ సమస్యలు పరిష్కారం చూపుతారా అన్నది అర్థం కాక పరిటాల శ్రీరామ్ వద్దకు ఒకసారి, బిజెపి నాయకుల వద్దకు ఒకసారి వెళ్లి తమ సమస్యలు చెప్పుకుంటున్నారు. అయితే ఎవరికి చెప్పుకున్నా తమ సమస్యలు పరిష్కారం కాకుండా వున్నాయని పరిస్థితి అర్థం కాక నిస్తేజంలో నిలిచిపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అయోమయంతో ఆవేదన చెందుతున్నారు. కూటమి గెలుపు కోసం మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసినా గెలుపు తరువాత తమ సమస్యలు గానీ పనులు గాని పరిష్కరించుకునేందుకు ఎవరి వద్దకు వెలితే సక్రమంగా పనులు జరుగుతాయో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో మూడు పార్టీల నాయకులకు సమన్వయం మెండుగా ఉన్నప్పటికీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల సమస్యల వద్దకు వచ్చేటప్పటికి క్షేత్రస్థాయిలో సమన్వయంగా పనులు జరగడం లేదని అర్థమవుతోంది. పై స్థాయిలో నాయకులు వారి పనులు చక్కబెట్టుకుంటుండగా క్షేత్రస్థాయిలో కూటమి పార్టీల కార్యకర్తలకు ఎటువంటి పనులు జరగడం లేదని అధికారుల వద్దకు ప్రదక్షిణలు చేయాల్సిందే తప్ప పనులు మాత్రం జరగడంలేదని తమ నాయకుల పై నిష్టూరం వెళ్లగక్కుతున్నారు. తమ పనులు చేసుకోవాలంటే ఎట్లాగైనా బిజెపి నాయకుల వద్దకి వెళ్లాల్సిందే కాబట్టి పార్టీని మారితే సరిపోతుందని పార్టీ కండువాని సైతం మార్చి బిజెపిలోకి చేరిపోయారు కొంతమంది టీడీపీ కార్యకర్తలు. ఇక ప్రతిపక్ష పార్టీలో ఉన్న వైసిపి నాయకులు మరి కొంతమంది ఉన్న ఆస్తులు కాపాడుకునేందు కోసమో, లేక పనులు చేసుకోవచ్చన్న ఆశతోనో వైసిపి పార్టీని వీడి బిజెపి తీర్థం పుచ్చుకొని హడావిడిగా నాయకుల వద్దకు, వారు చేసే పార్టీ కార్యక్రమాలకు పరుగులు పెడుతున్నారు. అయితే అధికారం కూటమిలో ఓ పార్టీ నాయకుడిది కావడం, మరో పార్టీ నాయకుడికి తమ పార్టీ అధికారం ఉన్నప్పటికీ తన చేతిలో అధికారం లేక కార్యకర్తలు, నాయకులు అడిగిన పనులు చేసి పెట్టలేక తమ అనుకున్న వారి పనులు మాత్రమే జరుపుకుంటూ ధర్మవరం నియోజకవర్గానికి చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు కూటమి పార్టీ నాయకులు. కూటమి ఏర్పాటుతో తమ సమస్యలు తీరుతాయని ఎదురుచూసిన కూటమి కార్యకర్తలకు ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయి నిచ్చేస్టులై నిస్తేజంలో మునిగిపోయారని చెప్పవచ్చు. రెవెన్యూ పనులు కోసం అధికారులకు కూటమి కార్యకర్తలు ఇచ్చిన దస్త్రాలను టేబుల్ పై ఉంచుకుంటున్నారే గాని పనులు మాత్రం చేయడం లేదని, కాల్లరిగేలా కార్యాలయం చుట్టూ తిరగడమే తప్ప రెవెన్యూ పనులు జరగక ఎవరికి చెప్పుకోవాలో తెలియక, ఏ నాయకుడు ఎప్పుడు అందుబాటులోకి వస్తాడో అర్థం గాక అయోమయంలో మునిగిపోతున్నారు కూటమి కార్యకర్తలు. ఇక ధర్మవరం మున్సిపాలిటీలో అధికారుల పరిస్థితి చూస్తే కూటమి పార్టీ నాయకుల కంటే వీరి రాజకీయ క్రీడలే అధికంగా ఉన్నాయని అనిపిస్తోంది. కూటమిలో ఓ పార్టీ నాయకులు పనుల నిమిత్తం మున్సిపల్ అధికారుల వద్దకు వెళితే మిగిలిన రెండు పార్టీల నాయకులపై చెప్పి ఆ పనులను చేయకుండా కుంటి సాకులు చెప్పి తప్పించుకు తిరుగుతున్నారని కూటమి నాయకులు, కార్యకర్తలు బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి పార్టీలోని మూడు పార్టీల పెద్ద నాయకులకు నిజంగానే సమన్వయం ఉందా లేక తమ పనులు చక్క పెట్టాల్సి వస్తుందని కార్యకర్తలకు సాకులు చెబుతున్నారా అని కూటమి కార్యకర్తలు అర్థం కాక జుట్టు పీక్కునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి పార్టీ నాయకుల మధ్య సమన్వయం ఉంటే మున్సిపల్ సిబ్బందితో వీధుల్లో చెత్తకుప్పలు ఎత్తించడానికి, మురుగు కాలువలు శుభ్రం చేయించడానికి వెళ్లి నియోజకవర్గ స్థాయి నాయకులు ఫోటోలకు ఫోజులు ఇవ్వాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని కూటమి కార్యకర్తలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి పార్టీ నాయకులలో మార్పు వచ్చి కూటమి కార్యకర్తలకు పనులు చేసి పెట్టి న్యాయం జరిగేలా చూడాలని కార్యకర్తలు కోరుకుంటున్నారు.



# మరిది చేతిలో వదిన హత్య

ఆస్పరి, డిసెంబరు 22 ప్రభాతవార్త: కర్నూలు జిల్లా అస్పరి మండలం తొగలగల్లు గ్రామంలో గొల్ల గంగావతి (26) అను మహిళను రోకలి కట్టెతో కొట్టి హత్య చేసిన ఘటన సోమవారం సంచలనం రేపింది. వివరాల మేరకు కల్లపర్రి గ్రామానికి చెందిన గొల్ల చిన్న ఉరుకుందు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతు. ఆయన కూతురు గంగావతిని ఎనిమిదేళ్ళ క్రితం తొగలగల్లు గ్రామానికి చెందిన గొల్ల అహోబిలంకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. కాగా సెప్టెంబరు 4న భర్త హత్య కేసులో గంగావతి జైలుకు వెళ్ళి బెయిల్‌పై అక్టోబరు 28న విడుదలైంది. అన్నను చంపిన వదిన కళ్ళ ఎదుటే ఉంటే మాకు పరువు పోయిందని గొల్ల పెద్దయ్య గొడవ పడుతుండేవాడని, అదే క్రమంలో అన్నను చంపిన వదినపై ప్రతీకారం తీర్చుకోవాలని ఆదివారం రాత్రి రేకుల కొట్టంలో నిద్రిస్తున్న ఆమెను గొల్ల పెద్దయ్య రోకలికట్టెతో కొట్టి ప్రాణాలు తీశాడు. ఘటన అనంతరం నిందితుడు మోటారు సైకిల్‌పై పరారు అయినట్లు సమాచారం. భాధితురాలి తండ్రి గొల్ల చిన్న ఉరుకుందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడు కత్తి దాడిలో గాయపడ్డ సిఐ శ్రీకాంత్



సిఐ కాల్పులలో గాయపడ్డ అజయ్

# అనంతలో కాల్పుల కలకలం

అనంతపురం రూరల్, డిసెంబరు 22 ప్రభాతవార్త: అనంతనగరంలోని విద్యుత్ సర్కిల్‌లో ఆదివారం రాత్రి మద్యం తాగి దేవరకొండ అజయ్ ఒకరిపై కత్తితో దాడిచేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టూ టౌన్ సిఐ శ్రీకాంత్ యాదవ్ కేసు నమోదు చేసి నిందితుడు దేవరకొండ అజయ్ కోసం గాలిస్తుండగా, రూరల్ మండలం ఆకుతోటపల్లి వద్ద ఉన్నారన్న సమాచారంతో అక్కడకు తన సిబ్బందితో వెళ్లిన సిఐ శ్రీకాంత్ యాదవ్‌పై దుండగుడు దేవరకొండ అజయ్ కత్తితో దాడి చేశాడు. సిఐ చేయికి తీవ్ర గాయమైంది. వెంటనే తేరుకుని నిందితుడు దేవరకొండ అజయ్‌పై రెండు రౌండ్లు కాల్పులు జరిపి నిందితుడుని అదుపులోకి తీసుకున్నాడు. అనంతరం నిందితుడితో పాటు సిఐ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేసుకున్నారు.



# అందని ద్రాక్ష పిఎం సూర్యఘర్ యోజన

**గ్రామీణ ప్రజలపై నిబంధనల కొరడా**

**పిఎం, సిఎం ప్రకటనలు ఉపన్యాసాలకే పరిమితమా?**

చంద్రగిరి, డిసెంబరు 22 ప్రభాతవార్త: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం నిరుపేదలకు అందని ద్రాక్షగా మిగిలిపోతున్నది. దేశ ప్రదాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోలార్ విద్యుత్‌పై అత్యంత చిత్తశుద్దితో ముందుకు వెళుతున్నారు. దేశ వ్యాప్తంగా సామాన్యులకు చెందిన కోటి గృహాలపై రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తిని చేసుకోవడంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా ఈ పథకం వీలుకల్పించింది. అదేరీతిన ముఖ్యమంత్రి తన స్వగ్రామం తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, నారావారిపల్లిని యూనిట్‌గా తీసుకుని స్వర్ణ నారావారిపల్లి కార్యక్రమం (ఆరేపల్లి రంగంపేట నుండి భీమ వరం వరకు) ద్వారా ఇంటింటికీ ఉచితంగా సోలార్ ప్యానెల్స్ అమర్చేందుకు చర్యలు చేపట్టారు. ఆ మేరకు జిల్లా అధికారులు సైతం రేయింబవళ్ళు శ్రమించి దాదాపుగా లక్ష్య సాధనకు కృషి చేశారు.

సూర్యఘర్ పథకంపై ప్రభుత్వ ఆలోచనను పరిశీలిస్తే పేదలకు కనీసం నెలకు 300 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందించేందుకు ఈ పథకం దోహదపడుతుంది. ఈ పథకం ద్వారా విద్యు త్ భారాన్ని గణనీయంగా తగ్గించుకుని సౌరశక్తి వినియోగాన్ని పెంచుకోవచ్చును. ఇటువంటి బృహత్తరమైన పథకం కొరకు దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి కలిగిన నిరు పేదలను నిబంధనల కొరఢా వేధిస్తున్నది. సాధారణంగా గ్రామీణ ప్రాంతాలలో గ్రామ కంఠం, డికెటికి చెందిన స్థలాలోనే ఇల్లు కట్టుకుని నివశిస్తుంటారు. ఇటువంటి వారు సోలార్ అమర్చుకోవాలంటే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ తప్పనిసరి అంటున్నారు. అదే విధంగా గృహ యజమాని మరణించి నట్లయితే కుటుంబ సభ్యులు విద్యుత్ సర్వీస్‌ను మార్చుకునేందుకు సైతం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ తప్పనిసరి అడుగుతున్నారు. వాస్తవానికి గ్రామకంఠం స్థలానికి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం వున్నప్పటికీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని లబ్దిదారులు మిన్నకుండిపోతున్నారు. దీంతో ప్రదాన మంత్రి, ముఖ్యమంత్రి సోలార్ అమర్చు కోవడంపై చేస్తున్న ప్రకటనలు క్షేత్ర స్థాయికి చేరక ఉపన్యాసాలకే పరిమితమవుతున్నట్లు నిరుపేదలు వాపోతున్నారు. ఈ విషయమై తిరుపతి జిల్లా, చంద్రగిరి విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ (ఏఏఓ) శివకుమార్‌ను వివరణగా గ్రామాలలో గ్రామకంఠం, డికెటి నివాసాలకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ లేనందున చేయడం లేదని స్పష్టం చేశారు. వాస్తవానికి ఆర్థికంగా స్థితి కలిగిన వారు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూసే పరిస్థితి లేదు. పేదలు మాత్రమే ప్రభుత్వం అందించే సబ్సిడీ కొరకు ఎదురుచూస్తారు. ఆ మేరకు ఎంతో కొంత ఆసక్తితో ముందుకు వస్తున్న నిరుపేదలకు ఎదురవుతున్న ఇటువంటి సాంకేతిక సమస్యలపై ప్రభుత్వమే తగిన నిర్ణయం తీసుకోవాల్సి వున్నది. అప్పుడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షలు నెరవేరగలవు.

# ఏడు సెకండరీ ఆసుపత్రుల్లో టిఫా స్కానింగ్ సౌకర్యం

**- గర్భస్థ శిశువుల్లోని లోపాల గుర్తింపునకు వీలు**

**- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి**




విజయవాడ, డిసెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి: గర్భిణిలు, శిశు సంరక్షణ చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం తొలిసారిగా రాష్ట్రంలోని 7 సెకండరీ అసుపత్రుల్లో టిఫా స్కానింగ్ సౌకర్యాన్ని అందుబాటు లోకి తెచ్చింది. నర్సీ పట్నం, తుని, నందిగామ ఏరియా ఆసుపత్రుల్లో, ఒంగోలులోని ఎంసీహెచ్, పార్వతీపురం, తెనాలి, అనకాపల్లి జిల్లా ఆసుపత్రుల్లో టిఫా స్కానింగులను సిద్ధం చేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. ప్రస్తుతం వాటి పనితీరును పరిశీలిస్తున్నా మని తెలిపారు. జనవరి 1నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులో వస్తాయని చెప్పారు. ఒక్కొక్క టిఫా స్కానింగ్ ఖరీదు రూ.30.48 లక్షల చొప్పున ఏడింటికి కలిపి రూ.2.13 కోట్ల వరకు వ్యయం చేసినట్లు మంత్రి తెలిపారు. గర్భిణిల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎంపికచేసిన ఈ 7 అసుపత్రుల్లో 3 ఉత్తరాంధ్రలోనే ఉన్నాయి. దీనివల్ల గిరిజనలకు ఆధునిక వైద్య సేవలు మరింత అందుబాటులోనికి వచ్చినట్లయింది.

**గర్భిణిలకు తప్పిన అవస్థలు శిశువులకు పెరిగిన భరోసా**

గర్భం దాల్చిన 1822 వారాల మధ్య శిశువు మెదడు, వెన్నెముక, గుండె, కాళ్ళ, కడుపు, మావి, బొడ్డుతాడు వంటి వాటిని నిశితంగా పరిశీలించేందుకు, లోపాలు ఉంటే కనుగొనేందుకు ఈ టిఫా స్కానింగ్ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి సత్యకుమార్ చెప్పారు. ఈ 7 టిఫా స్కాన్లవల్ల ప్రతినెలా 1,000 మంది గర్భిణిలు ప్రయోజనం పొందుతారని అంచనా. ప్రస్తుతం ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో మాత్రమే ఈ టిఫా సౌకర్యం ఉంది. దీనివల్ల దూర ప్రాంతాల గర్భిణిలు టిఫా స్కానింగ్ కోసం వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ సేవలను ప్రైవేట్ ఆసుపత్రుల్లో పొందాలంటే సదరు ప్రాంతాల డిమాండ్ అనుసరించి, రూ.3,000 నుంచి రూ.4,000 వరకు వ్యయమవుతుంది. ఈ పరిస్థితుల్లో గర్భిణిల సమస్యలు దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం సెకండరీ ఆసుపత్రుల్లోనే ఈ సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయించింది. తద్వారా ఆయా ప్రాంతాల గర్భిణిలకు వ్యయప్రయాసలు తగ్గుతాయని, ఆర్థిక భారం కూడా తగ్గుతుందని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు తెలిపారు.

**ప్రతి వంద మంది శిశువుల్లో ఒకరికి ఏదో ఒక లోపం**

శిశువు గర్భంలో ఏ స్థితిలో ఉంది? ఉమ్మనీరు స్థితి వంటి వాటిని టిఫాతో గుర్తిస్తారు. అంతర్జాతీయ నివేదికలు, వైద్య నిపుణుల గణాంకాల ప్రకారం పుట్టిన శిశువుల్లో 7 శాతం లోపాలు ఉంటున్నాయి. ప్రతి వంద మందిలో ఏడుగురికి ఏదో ఒక లోపం ఉంటుందని అంచనా. లోపాలను టిఫా స్కాన్ల ద్వారా ముందుగానే గుర్తించేందుకు, అవసరమైన ఉన్నత వైద్యాన్ని తక్షణమే పొందేందుకు వెసులుబాటు ఏర్పడుతుందని చక్రధరబాబు వివరించారు.



# నరేగా పథకంలో కేంద్రం వాటా తగ్గింపు సమంజసం కాదు

**సిఎం చంద్రబాబుకు సిపిఐ రామకృష్ణ వినతిపత్రం**

విజయవాడ, డిసెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడం సమంజసం కాదని, దీనిపై కేంద్రంతో మాట్లాడి మహాత్మాగాంధీ పేరును కొనసాగించేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబును సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. సోమవారం సచివాలయంలో సిఎం చంద్రబాబును సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావుతో పాటు రామకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటి వరకు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకానికి ఇచ్చే 90 శాతం నిధులను 60శాతానికి కేంద్రం కుదించిందని, 40శాతం నిధులను రాష్ట్రం భరించాలంటే ఎపి సహా పలు రాష్ట్రాలపై ఆర్థిక భారం పడుతుందని అన్నారు. అదేవిధంగా 100 నుంచి 125 రోజులకు పని దినాలు పెంచుతామని కేంద్రం చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు కుటుంబానికి సగటున 50 పని దినాలు కూడా కల్పించలేదని తెలిపారు. ఇప్పటి వరకూ హక్కుగా ఉన్న ఈ చట్టంలో సవరణల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కష్టంగా మారుతుందని, వెంటనే సవరణలను వెనక్కి తీసుకునేలా కేంద్రంతో మాట్లాడాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

# దుబాయ్‌లో క్రిస్మస్ వేడుకలు

విజయవాడ, డిసెంబరు 22 ప్రభాతవార్త: దుబాయ్‌లో తెలుగుదేశం పార్టీ అభిమానులు సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రత్యేక అతిధులుగా మంత్రి నిమ్మల రామానాయుడు; తెలుగుదేశం పార్టీ పొలిట్బ్యూరో సభ్యులు, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టి.డి. జనార్దన్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో తెలుగు కుటుంబాల వారు పాల్గొన్న ఈ వేడుకలో ముందుగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఆ తర్వాత వక్తలు మాట్లాడారు. ప్రపంచ మానవాళికి క్రీస్తు అందించిన గొప్ప వరాలు ప్రేమ, కరుణ, క్షమ, శాంతి, సామరస్యం వంటి మహోన్నతమైన మానవీయ గుణాలని పేర్కొన్నారు.

# సచివాలయంలో పేలిన ఇన్నోవా కారు టైరు

సచివాలయం, డిసెంబరు 22 ప్రభాతవార్త: వెలగపూడి సచివాలయంలో కారు ప్రమాదం ఉద్యోగులు, సందర్శకులను ఉలికిపాటుకు గురిచేసింది. సచివాలయం అవుట్ గేటు నుంచి వేగంగా లోనికి దూసుకు వచ్చిన ఇన్నోవా కారు ప్రమాదానికి గురైంది. సచివాలయం గేటు లోపలికి రాగానే శబ్దంతోపాటు ముందు చక్రం ఒక్కసారిగా పేలింది. దీంతో భద్రతా సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. అదుపు తప్పిన కారు.. వేగంగా ముందుకు కదలి సమీపంలోని కియా ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో చార్జింగ్ స్టేషన్ గోడ ధ్వంసమైంది. ఆ సమయంలో కియా ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. సిఆర్డీఏలో డైరెక్టర్‌గా ఉన్న ఆర్.గోపాలరెడ్డికి చెందని కారుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగినప్పుడు ఆయన కారులోనే ఉన్నారు. అద్దె డ్రైవర్ యార్లగడ్డ కళ్యాణ్ చక్రవర్తి కారును నడుపుతున్నట్లు గుర్తించారు. మార్గంలో సెక్యూరిటీ సిబ్బంది, సందర్శకులు ఎవరూ లేకపోవడం, ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని భద్రతా సిబ్బంది విచారిస్తున్నారు.




**జగన్ బర్త్‌డే వేడుకల్లో వివాదాస్పద వ్యాఖ్యలు**

# వైసిపి నేతల అరెస్ట్

బ్రహ్మసముద్రం, డిసెంబర్ 22 ప్రభాతవార్త: వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఆదివారం బ్రహ్మసముద్రం మండలం బొమ్మగానిపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ ఆదినారాయణ రెడ్డి కార్యకర్తలతో కలిసి జన్మదిన వేడుకలలో భాగంగా జగన్‌మోహాన్ రెడ్డి ఫ్లెక్సీ ముందు పొట్టేలు కొట్టి జగన్ ఫ్లెక్సీకి రక్తాభిషేకం చేసి రప్పా రప్పా నరుకుతాం ఫోటోలు వీడియోలను సామాజిక మాధ్యమాలలో పంపడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వీడియోలో పోస్టులు పంపిన వ్యక్తులను బ్రహ్మసముద్రం ఎస్ఐ నరేంద్ర కుమార్ ఆదివారం అర్థరాత్రి బొమ్మగానిపల్లి సర్పంచ్ ఆదినారాయణ రెడ్డి పలువురు కార్యకర్తలను అరెస్ట్ చేసిన పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మండల వైసీపీ నాయకులు సోమవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకొన్నారు. అటు పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక బలగాలను మోహరించారు. పరిస్థితి చేయిదాటి పోకుండా ఉండేలా అరెస్టు చేసిన నేతలను కళ్యాణదుర్గం డిఎస్పీ ఆఫీస్‌కు తరలించారు. స్టేషన్ బెయిల్ ఇప్పిస్తామని చెప్పిన పోలీసులపై కుటుంబ సభ్యులు కార్యకర్తలు మండిపడ్డారు.



# కేజీ మామిడికి రూ.8 ఇవ్వాల్సిందే

**కలెక్టరేట్ ఎదుట మామిడి రైతుల ధర్నా**

చిత్తూరు, డిసెంబరు 22 ప్రభాతవార్త: ఈ సీజన్‌లో పల్ప్ ఫ్యాక్టరీలకు మామిడి సరఫరా చేసిన రైతులకు పల్ప్ ఫ్యాక్టరీలు కేజీకి రూ.8 చెల్లించాల్సిందేనని మామిడి రైతులు డిమాండ్ చేశారు. మామిడి రైతులకు ఫ్యాక్టరీల ఈ సీజన్‌లో సరఫరా చేసిన మామిడి కాయలకు రైతులకు కేజీకి ఇవ్వాల్సిన రూ.8 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట మామిడి రైతులు సోమవారం మామిడి రైతుల సంఘం అధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా మామిడి రైతలు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మునీశ్వర్‌రెడ్డి, బంగారు మురళీలు మాట్లాడుతూ ఫ్యాక్టరీలు మామిడి రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలకు రైతులు మామిడి సరఫరా చేసి ఏడు నెలలు పూర్తవుతున్నప్పటికీ ఇప్పటికీ రైతులకు ఫ్యాక్టరీలు చెల్లింపులు చేయకపోవడం దారుణమన్నారు. మామిడి రైతులు మళ్ళీ సీజన్‌కు పెట్టుబడులు పెట్టాల్సిన సమయంలో వారి వద్ద డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారని, సత్వరం రైతులకు ఫ్యాక్టరీలు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్న 40 ఫ్యాక్టరీల వైపా లేక జిల్లాలోని 40 వేల మామిడి రైతుల వైపా! తేల్చుకోవాలని అల్టిమేటం జారీ చేశారు. కొన్ని ఫ్యాక్టరీలు ఇప్పటి వరకు కేజీపై రూ.2, రూ.3, రూ.4, రూ.5, రూ.6 రైతులకు చెల్లించాయని, మిగిలిన మొత్తంను సైతం సత్వరం చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న సంవత్సరంలో మే నెలలోనే పల్ప్ ఫ్యాక్టరీలు ప్రారంభించాలని, టేబుల్ రకాల కాయలు రైతులు నేరుగా విక్రయించుకోవడానికి ప్రభుత్వం పట్టణాల్లో ఏర్పాట్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం గుజ్జు పరిశ్రమల వద్ద నిల్వ వున్న మామిడి పల్ప్‌ను టిటిడి దేవస్థానం, పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తే పల్ప్ ఫ్యాక్టరీ యాజమాన్యాల వద్ద వున్న పల్ప్ అమ్ముడు పోతుందని దీనికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో పలుమార్లు మామిడి రైతుల సమస్యలపై కలెక్టర్‌తో చర్చలు జరిపినా సమస్యలు పరిష్కరించు కోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామానాయుడు, జిల్లా ఉపాధ్యక్షురాలు హేమలత, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఓబుల్ రాజు, జానపద వృత్తి కళాకారుల సంఘ అధ్యక్షులు కెఎస్ రామచంద్రన్, సంజీవరెడ్డి, ఉమాపతినాయుడు, మోహన్‌రెడ్డి, త్యాగరాజులు, పెద్ద ఎత్తున మామిడి రైతులు పాల్గొన్నారు. అనంతరం మామిడి రైతు సంఘ నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

**మామిడి రైతులకు రూ.146.84 కోట్ల సబ్సిడీ జమ: కలెక్టర్ సుమిత్‌కుమార్**

మామిడి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 31,929 మంది మామిడి రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.146.84 కోట్ల రూపాయలను ప్రభుత్వం సబ్సిడీని జమ చేసిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం మామిడి రైతులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి తమకు పల్ప్ ఫ్యాక్టరీలు కేజీపై చెల్లించాల్సిన రూ.8 చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మామిడి రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ మామిడి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, జిల్లాలో మామిడి బోర్డు ఏర్పాటుకు సిఎం నారా చంద్రబాబునాయుడు, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు. జిల్లాలో తోతాపురి మామిడి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించిన రైతు నాయకుల్లో మురళీ, విశ్వేశ్వర్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు వున్నారు.



# వైద్య విద్యార్థుల ఆరోగ్యం కోసం..

ఉన్నత కుటుంబంలో పుట్టి పెరిగారు దేవనీ దేవి. అలాంటి ఇంటికే కోడలిగానూ వెళ్లారు. చుట్టూ పనివాళ్ళు, విలాస వంతమైన జీవితం. అయినా ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేశారు. దీనికి కారణం వైద్య విద్యార్థుల పరిస్థితులే అంటారామె. ఈమె గురించి తెలియాలంటే..

పట్నాలో పాతికేళ్ల కిందట మాది. సంపన్న కుటుంబం. అయితే పిల్లల చదువుల కోసం పట్నాకు మకాం మార్చాం. ఆయన జీతం కుటుంబ పోషణకు సరిపడేది కాదు. ఇంటి నుంచి డబ్బు అడగడం ఇష్టం లేక, నేనూ సాయం చేయాలనుకున్నా. ఈ క్రమంలోనే ఓ రోజు వైద్య విద్యార్థి లంచ్ బాక్సును చూశాను. నాసిరకం ఆహారంతో విద్యార్థులు పడుతున్న కష్టాలు అర్థమయ్యాయి. వాళ్లకి మంచి భోజనం పెట్టాలని రూ. 20కే డబ్బా సర్వీస్ ప్రారంభించా.

**అడ్డంకుల్ని దాటి..** క్రమేణా మా దగ్గర భోజనం తీసుకు వెళుతున్న వారి సంఖ్య పెరిగింది. దీంతో ఇంటినుంచి వండటం కష్టమైంది. హోటల్‌లా పెడితే బాగుణ్ను అనిపించింది.కానీ ఇంట్లోవాళ్ల వద్దన్నారు. పరువు పోతుంది మా ఇంటి కోడలు ఇలాంటి పనులు చేస్తే అని తిట్టారు. నేను మాత్రం ఎంతమంది ఎన్ని మాటలు అన్నా.. వంట చేయడం ఆపలేదు. దీనివల్ల నా భర్త నాతో 6 నెలలు మాట్లాడలేదు. నా పెద్ద కొడుకు కూడా నన్ను విసుక్కునేవాడు. అయినా పట్టు వదల్లేదు. ఓ పెద్దింటి కోడలు అన్న గుర్తింపు కన్నా.. తన కాళ్ల మీద తాను నిలబడిన మహిళగా వచ్చిన గుర్తింపే నాకు నచ్చింది అందుకే వెనకడుగు వేయలేదు. క్రమంగా ఆదాయం పెరగడం మొదలైంది. దాన్ని వివిధ వ్యాపారాల్లో పెట్టా. రూ.80వేలతో రిక్షాలు కొని, వాటిని అద్దెకు ఇచ్చేదాన్ని తర్వాత 2009లో 'సమృద్ధి గర్ల్స్ హాస్టల్'ను ప్రారంభించా. ఈ లోపు కరోనా బారిన పడ్డాను. హాస్టళ్ల మూతపడి, వ్యాపారం దెబ్బ తింది. అయినా వైద్య విద్యార్థులకు భోజనం అందించడం ఆపలేదు. కరోనా బారిన పడిన నాకు వాళ్లు ఎన్ని సేవలు చేశారో. ఇంట్లో వాళ్లు దగ్గరికి రావడానికి కూడా వీలులేకపోతే.. ఈ విద్యార్థులే నాకు సపర్యలు చేసేవారు. నేను కోలుకునేదాకా నాతోనే ఉన్నారు. వాళ్ల సేవలు ఎప్పటికీ మరచిపోలేను.

**అమ్మ కిచెన్..** కరోనా తర్వాత నా చిన్న కొడుకు క్లౌడ్ కిచెన్ ప్రారంభించమంటూ సలహా ఇచ్చాడు. దాంతో 2022లో 'అమ్మ కిచెన్' ప్రారంభించమంటూ సలహా ఇచ్చాడు. దాంతో 2022 'అమ్మ కిచెన్‌'న ప్రారంభించా. ఇప్పుడు ఆన్‌లైన్‌లోనూ మా సేవలు అందుబాటులో ఉన్నాయి. రూ.20తో మొదలైన నా వ్యాపార ప్రయాణం ఇప్పుడు రూ.2.5 కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. ఏ పనీ చిన్నదికాదు. సంకల్పబలం ఉంటే మనం సాధించలేనిదంటూ ఏదీ ఉండదు. అందుకు నా ప్రయాణమే నిదర్శనం.

# కనుబొమ్మల్లో చుండ్రు.. వీటితో చెక్ !

చుండ్రు చలికాలంలో చాలా మందిని వేధిస్తుంటుందీ సమస్య. సాధారణంగా చుండ్రు అంటే కుదుళ్ల లోనే వస్తుంటుంది. కానీ కొంత మందిలో ఇది కనుబొమ్మల్లోనూ వస్తుందంటున్నారు నిపుణులు. ఈ సమస్యను దూరం చేసుకోవడానికి కొన్ని సమాజసిద్ధమైన చిట్కాలు మేలు చేస్తాయని చెబుతున్నారు. అవేంటో తెలుసుకుందాం..



బాదంనూనెతో... కనుబొమ్మల్లో చుండ్రు రావడానికి పొడిచర్మతత్వం కూడా ఓ కారణమే అంటున్నారు నిపుణులు. ఇలాంటి వారు కొద్దిగా బాదం నూనె తీసుకొని గోరువెచ్చగా చేసి.. దాంతో కనుబొమ్మలకు రోజూ కాసేపు మృదువుగా మర్దన చేసుకోవాలి. మరుసటి రోజు ఉదయాన్నే చల్లటి నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే ఫలితం ఉంటుందంటున్నారు. అయితే ఈ చిట్కాను రోజూ రాత్రి నిద్రపోయే ముందు పాటించడం వల్ల మెరుగైన ఫలితాలు పొందచ్చని చెబుతున్నారు నిపుణులు.

**వేపనూనెతో....** వేపలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎక్కువగా ఉంటాయి. వివిధ రకాల చర్మ సమస్యలను ఇవి నివారిస్తాయి. కొద్దిగా వేపనూనెను చుండ్రు ఉన్న కనుబొమ్మలపై అప్లై చేసుకోవడం వల్ల సమస్య నుంచి ఉపశమనం పొందచ్చు.

**ఇవి కూడా..** ✦. రాత్రంతా నానబెట్టిన మెంతులను మెత్తటి పేస్ట్‌లా చేసి ఆ మిశ్రమాన్ని కనుబొమ్మలకు అప్లై చేసుకోవాలి. కాసేపు ఆరనిచ్చి తర్వాత గోరువెచ్చటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి.

✦ కొద్దిగా కలబంద గుజ్జు తీసుకొని కనుబొమ్మలపై అప్లై చేసి మృదువుగా మర్దన చేసుకోవాలి. తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకోవాలి.

**.. ఈ జాగ్రత్తలు తప్పనిసరి...** ✹ కనుబొమ్మలకు ఏ పదార్థాలు అప్లై చేసినా అవి కళ్లలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

✹ కనుబొమ్మల్లో చుండ్రు సమస్య ఉన్నప్పుడు మేకప్‌కి వీలైనంత దూరంగా ఉండడమే మంచిదంటున్నారు నిపుణులు.

✹ అలాగే విటమిన్ 'సి' అధికంగా ఉన్న పదార్థాలను డైట్‌లో భాగం చేసుకోవాలి. ✹ రోజూ సరిపడినన్ని నీళ్లు తాగాలి.

ఈ చిట్కాలు జాగ్రత్తలతో పాటు నిపుణుల సలహాలు, సూచనలు పాటిస్తే త్వరగా సమస్య నుంచి విముక్తి పొందచ్చు.

# తిరుప్పావై

## 8వ పాశురము



కీళ్‌వానమ్ వెళ్ళెన్ల్ఱు ఎరుమై
శిరువీడు
మేయ్‌వాన్ పరన్దనకాణ్ మిక్కుళ్ళ
పిళ్ళైకళుమ్
పోవాన్ పోకిన్దారై ప్పో'గామల్
కాత్తు, ఉన్నై
క్కూవువాన్ వందు నిన్ఱోమ్,
కోదుకలముడైయ
పావాయ్ ! ఎళున్దిరాయ్
పాడిప్పఱైకొండు
మావాయ్ పిళన్దానై మల్లరై
మాట్టియ
దేవాదిదేవనై చ్చెన్ఱు నాం
శేవిత్తాల్
ఆవావెన్ఱారాయ్‌న్దు అరుళేలో
రెమ్బావాయ్

ఆకాశము తూర్పుదిక్కున తెల్లబడుచున్నది. గోపాలురు మేతమేయుట కొరకు గేదెలను వదిలినారు. పిల్లలు వనులు చేయడానికి వెళ్తున్నారు. వారిని నీ ఇంటిముందు నిన్ను పిలుచుటకు ఆపినాము. కేశియను రాక్షసుని నోటిని చీల్చిన, చాణూర మల్లుల జంటను చంపిన, సర్వదేవత లకు దేవుడైన వానిని, కృష్ణా అని పాటలు పాడి వ్రతమునకు కావలసిన 'పర' యను సాధనమును పొంది. మనమంతా కలిసి సేవిం చుదాం.అప్పుడు కృష్ణుడు అయ్యో, మీరే వచ్చితిరని మనపై జాలిపడి మన మంచిచెడ్డలు ఆలోచించి మనపై కృపచూపుతాడు. అనుచు వెలుపలి గోపికలు లోపల నిదురించుచున్న మరొక గోపికను మేల్కొలుపుతున్నారు.

ఫలం: 'పర' జ్ఞానం కలుగుతుంది



# బరువులెత్తగలరా ?

**'బరువులు ఎత్తితే లావైపోతాం.. మగాళ్లలా కనిపిస్తాం' అన్న భయం ఇప్పటికీ చాలామంది ఆడవాళ్లను జిమ్‌లో డంబెల్స్, బార్‌బెల్స్ తాకనివ్వడం లేదు. కానీ, నిపుణుల అభిప్రాయం ప్రకారం సెంత్‌వింగ్ వ్యాయామాలు అవసరం.**

◆ మహిళలకు 30 ఏళ్లు దాటాయంటే చాలు.. ఈస్ట్రోజన్ హార్మోన్ క్రమంగా తగ్గుతుంది. దీంతో ఎముకలు బలహీనపడతాయి. ఫలితంగా కాళ్ల నొప్పులు, అలసట వంటి ఎన్నో ఇబ్బందులు తప్పవు. మరోపక్క ఆస్టియోపోరోసిస్ ముప్పు పొంచి ఉంటుంది. వీటనిన్నంటికీ చెక్ పెటాలంటే స్ట్రెంత్ నింగ్ వ్యాయామాలు చేయాల్సిందే. ఇవి కండరాల్నీ, ఎముకల్నీ బలంగా మారుస్తాయి.

◆ 30 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి పదేళ్లకూ 3-8 శాతం కండరాలను కోల్పోతామట. మెనోపాజ్ తర్వాత ఈ ప్రక్రియ వేగం అవుతుంది. దీంతో మెట్లు ఎక్కలేరు. సామాన్లు ఎత్తలేరు. అంతెందుకు ఏ పనిచేయా లన్నా కష్టమే ఈ పరిస్థితిని ఎదుర్కోవాలంటే స్ట్రెంత్‌నింగ్ రసరత్తులు చేయడం తప్పనిసరి. ◆ ఈ వ్యాయామాలు వల్ల మెటబాలిజం రేటు మెరుగు పడుతుంది. జీర్ణవ్యవస్థ పనితీరూ బాగుంటుంది. ముఖ్యంగా బరువులు ఎత్తడం వల్ల ఇనుసలిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. హార్మోన్ల అసమ తుల్యత ఎదురుకాదు. ◆ స్ట్రెంత్ ట్రెయినింగ్ వల్ల మెదడులో ఎండార్ఫిన్, సెరటోనిన్‌లు విడుదల అవుతాయి. ఇవి మెనోపాజ్ మూడ్‌స్వింగ్స్‌ని అదుపులో ఉంచుతాయి.

**ఇంట్లోనే చేయొచ్చు...** స్ట్రెంత్‌నింగ్ వ్యాయామాలు అనగానే బరువులు ఎత్త డమే అనుకుంటారు చాలామంది కానీ స్క్వాట్స్, పుష్-డెడ్‌లిఫ్ట్, లాంజెస్, ప్లాంక్, షోల్డర్ ప్రెస్ వంటివి వారంలో కనీసం 2-3 రోజులు, ప్రతి వ్యాయామం 10-15 సార్లు మూడు సెట్లు చొప్పున చేస్తే చాలు.

# బొమ్మలు సర్దడం లేదా?

**ఇంట్లో పిల్లలు ఉన్నప్పుడు బొమ్మలన్నీ చిందరవందరగానే ఉంటాయి. వాటిని సర్దడం ఒక్కోసారి తలకు మించిన భారంగా మారుతుంది. అలాకాకుండా గది ఎప్పుడూ శుభ్రంగా, అందంగా ఉండాలంటే..**

✹ కేటగిరీలుగా విభజించండి. ఉడ్ బ్లాక్స్, కార్లు, పజిల్స్, సాఫ్ట్ టాయ్స్, ఆర్ట్ మెటీరియల్స్.. ఇలా వేటికవే వేరు చేసి పెట్టండి. వీటిని అలానే ప్లాస్టిక్ షూ బాక్సులు, జిప్ బ్యాగుల్లో సర్దండి. వీలైనంతవరకూ అవి పారదర్శకంగా ఉండేలా చూసుకుంటే సరి. లోపల ఏమున్నాయో తెలుస్తుంది తీయడం, పెట్టడం సులువు.



✹ మీరు ఏయే బాక్సుల్లో ఏమి సర్దారో తెలియడానికి లేబుల్స్ అతికించండి. దాన్ని పిల్లలు చూసినా అర్థం చేసుకోవడానికి ఓ బొమ్మ ఫొటో పెడితే సరి. వీటిని పిల్లలకు చేయి అందే ఎత్తులో పెడితే.. కావలసినప్పుడు తీసుకుని మళ్లీ అక్కడే పెట్టే అలవాటవుతుంది.

✹ చిన్నారులు అన్ని బొమ్మల్నీ ఒకేసారి తీసి కింద వేయకుండా.. ఒక బొమ్మ తీసి ఆడుకున్నాకే మరో బొమ్మ అనే రూల్‌ని అమలు చేయండి. దీనివల్ల ఇల్లు చిందరవందర కాదు. వాళ్లకీ బోర్ కొట్టదు. అవి పాడవ్వవు కూడా. పిల్లలతో కలిసి అర్నెల్లకోసారి వాటిని రివ్యూ చేయాలి. ఆడుకోని బొమ్మలను ఎవరికైనా ఇవ్వడమో, సెకండ్ సేల్‌లో సెకండ్ సేల్‌లో అమ్మడమో చేస్తే ఇంటి నిండా చెత్త పేరుకోదు. అంతేకాదు రోజూ పడుకునే ముందు ఐదు నిమిషాలు వాళ్ల బొమ్మలు వాళ్లు సర్దుకునేలా చూడండి. వాళ్లకి క్రమశిక్షణా అలవడుతుంది.



గరిమెళ్ల పద్మావతి
విశాఖపట్నం





25 చుక్కలు
13 వచ్చే వరకు
సందు చుక్కలు

**కొత్త ముగ్గులకు ఆహ్వానం:** మా చిరునామాఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్, డిబిర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.Gmail: cheli@vaartha.com మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

# 'టాక్సిక్' కియారాఅద్వానీ ఫస్ట్‌లుక్



2026లో ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న భారీ చిత్రాల్లో రాకింగ్ స్టార్ హీరోగా నటిస్తోన్న 'టాక్సిక్' ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్స్ ఒకటి. ఈ సినిమాపై రోజు రోజుకీ అంచనాలు భారీగా పెరిగిపోతున్నాయి. తాజాగా ఈ మూవీ నుంచి నాడియా పాత్రలో నటిస్తోన్న హీరోయిన్ కియారా అద్వానీ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేయటంతో ఫ్యాన్స్‌లో మరింత ఉత్సాహం పెరిగింది. ఎమోషనల్, హై వోల్టేజ్ కమర్షియల్ మూవీస్ ఇలా... వైవిధ్యమైన సినిమాలు, పాత్రల్లో నటిస్తూ తనదైన గుర్తింపు సంపాదించుకుంది కియారా అద్వానీ . ఇప్పుడు గీతూ మోహన్ దాస్ రూపొందిస్తోన్న శక్తివంతమైన ప్రపంచంలోకి నాడియా పాత్ర ద్వారా ఎంట్రీ ఇచ్చింది. ఈ పాత్ర ఆమె ఫిల్మోగ్రఫీ రేంజ్‌లో మరింత పెంచేలా సరికొత్తగా ఉంది. నాడియాగా కియారా అద్వానీ పస్ట్ లుక్ ఆసక్తికరంగా ఉంది. పోస్టర్‌ను గమనిస్తే కలర్‌ఫుల్ బ్యాక్ డ్రాప్ కనిపిస్తోంది. కియారా అందరి కంటే ముందు నిలుచుకుని ఉంది. ఆమె పాత్రలో లోతైన భావోద్వేగాలు కనిపిస్తున్నాయి. ఈ హంగామా వెనుక బాధ, విషాదం ఏదో ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఆమె పాత్ర పెర్ఫామెన్స్‌కు ప్రాధాన్యతనిచ్చేలా కనిపిస్తోంది. లుక్ చూస్తుంటే ఇదేదో సాధారణమైన పాత్ర కాదని, ఆమె కెరీర్‌ను మలుపు తిప్పేలా ఉందనిపిస్తోంది.నాడియా పాత్ర, కియారా అద్వానీ గురించి డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ మాట్లాడుతూ కొన్ని పాత్రల్లో నటించినప్పుడు అవి సినిమాకే పరిమితం కావు. యాక్టర్‌కు సరికొత్త గుర్తింపును తీసుకొస్తాయి.

# తెర

## 'ఈషా' హారర్ థ్రిల్లర్స్‌లో సరికొత్తగా ఉంటుంది

**బన్నీవాస్, వంశీ నందిపాటి**

ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి లాంటి సూపర్‌హిట్ కల్ట్ చిత్రాలను ప్రేక్షకులకు అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వయం తాజాగా 'ఈషా' పేరుతో ఓహారర్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకరాబోతున్నారు. ఇటీవల రాజు వెడ్స్ రాంబాయి చిత్రంతో సూపర్‌హిట్ కొట్టిన అఖిల్‌రాజ్‌తో పాటు త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బాపటేల్ కథానాయిక. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని హెచ్‌వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



**వరుసగా మీ ఇద్దరూ రెండు బ్లాక్‌బస్టర్‌లు అందుకున్నారు.. ఇది మూడో సినిమా కూడా కంటెంట్ నమ్మకంతో చేస్తున్నారా? అబ్లిగేషన్‌తో చేస్తున్నారా?**

బన్నీవాస్ : ఇది అబ్లీగేషన్ కాదు. ఒకవేళ తీసుకున్నా ఇది కంటెంట్ నచ్చితేనే మాత్రమే తీసుకున్నాం. సినిమా నచ్చకపోతే వెంటనే వాళ్లకు వేరే ప్రత్యామ్నాయ మార్గం చెబుతాం. ఈసినిమా కంటెంట్ మీద నమ్మంతోనే అసోసియేట్ అయ్యాం.

**ఈసారి 'ఈషా'లాంటి హారర్ జోనర్‌లోకి వెళ్లారు ఎందుకని?**

**వంశీ నందిపాటి:** సినిమా బాగుంది. మొదటి పది నిమిషాల్లోనే మీకు మేము ఈ సినిమా ఎందుకు తీసుకున్నామో.. అందరికి అర్థమవుతుంది. సినిమా ఆద్యంతం ఎంతో ఆసక్తిగా భయంగా ఉంటుంది. హారర్ అండ్ థ్రిల్లర్ ఈ సినిమా ఇది. చివరి 15 నిమిషాలు, సినిమా చాలా కొత్తగా ఉంటుంది.: లిటిల్ హార్ట్స్, రాజువెడ్స్ రాంబాయితో కంపేర్ చేయకూడాదు. దానితో పోల్చకూడదు. ఈ రెండు సినిమాల విషయంలో ఏది అనుకున్నామో అదే జరిగింది. ఈషా విషయంలో కూడా మేము అనుకున్నది జరుగు తుంది. తొలిపదిహేను నిమిషాలు అదిరిపోతుంది. పతాక సన్నివేశాలు స్టనింగ్‌గా ఉంటాయి.

**నిజంగా దెయ్యాలు ఉంటాయా?**

ఈ సినిమాలో ఏమీ చెబుతున్నారు.సినిమా చూస్తే తెలుస్తుంది.

# 'ఐ యామ్ ఎ ఛాంపియన్' సాంగ్



సమంత లాంచ్ చేసిన ఛాంపియన్ 'ఐ యామ్ ఎ ఛాంపియన్' సాంగ్ డ్యాన్స్ అదరగొట్టిన రోషన్ ఛాంపియన్ నుంచి ఇప్పటివరకు విడుదలైన రెండు పాటలు భారీ చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. గిర గిర సాంగ్ అన్ని ప్లాట్‌ఫామ్‌లలో ట్రెండ్ అవుతూనే ఉండగా, మనసుని కదిలించే సెకండ్ సింగిల్ సల్లంగుడాలే కూడా అద్భుతమైన స్పందన అందుకుంది. రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్‌లో నటించిన ఈ చిత్రం నుంచి మూడవ పాటను ఇప్పుడు మేకర్స్ లాంచ్ చేశారు. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి స్వప్న సినిమా నిర్మించిన ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్ సమర్పించారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందించారు. మూడో సింగిల్ ఐ యామ్ ఎ ఛాంపియన్ సాంగ్ ఒక ప్రత్యేకమైన, పూర్తి స్థాయి డాన్స్ నంబర్‌గా అలరిం చింది. గ్రాండియర్‌తో పాటు రిథ్మిక్ ఎలిగెన్స్‌ను కలిపిన ఈ పాట, భారీ సెట్‌పై, అద్భుతమైన డాన్స్‌లతో కన్నుల పండువైన విజువల్ స్పెక్టాకిల్‌గా నిలిచింది. సీజన్‌కి సరిపోయే జాజ్ సాంగ్‌గా నిలిచిన 'I Am A Champion' ఆల్బమ్‌లోని మొదటి రెండు పాటల్లానే మ్యూజిక్ చార్ట్స్‌ను శాసించడానికి సిద్ధంగా ఉంది. అంతేకాదు, రోషన్ డ్యాన్సింగ్ ప్రావెస్‌ను బలంగా చాటే పాటగా నిలుస్తుంది.

# కిస్మస్ కానుకగా 'మిషన్ శాంటా'



భారతీయ యానిమేషన్ రంగానికి కీలక మైలురాయిగా 'మిషన్ సాంటా' ఇటీవల యానిమేషన్ ఫిలింగా రూపొంది భారతదేశంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో విశేష ఆదరణ పొందిన నరసింహ అవతార్ సినిమా గురించి అందరికి తెలిసిందే. ఇప్పుడు తాజాగా మరో యానిమేషన్ ఫీచర్ ఫిలిం రిలీజ్ కాబోతుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిన ఈ భారీ యానిమేటెడ్ ఫిలిం 'మిషన్ సాంటా'. ఈ అత్యుత్తమ యానిమేషన్ ఫీచర్ ఫిలిం ఈ నెల 25న కిస్మస్ కానుకగా భారత్‌తో పాటు ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాల్లో ఒకేసారి ఈ చిత్రం థియేటర్‌లో సందడి చేయబోతుంది. ఇందులో భాగంగా ఈనెల 25న అంటే అదే రోజు రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా ప్రధాన నగరాల్లోని పలు థియేటర్‌లో 'మిషన్ సాంటా' రిలీజ్ కాబోతుంది. కుటుంబ సమేతంగా చూడదగ్గ కథతో రూపొందిన హై ఎనర్జీ యానిమేటెడ్ అడ్వెంచర్ చిత్రం 20 నెలల పాటు 150కి పైగా భారతీయ యానిమేషన్ నిపుణులు ఈ చిత్ర నిర్మాణంలో పాల్గొన్నారు. ఈ చిత్రాన్ని నిర్మించిన బ్రాడ్‌విజన్ ఇండియా మరియు స్టూడియో 56, భారతీయ యానిమేషన్‌ను కేవలం సేవల స్థాయి నుంచి క్రియేటివ్‌గా, వాణిజ్యపరంగా అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించాయి. ఇంగ్లీష్ భాషలో విడుదలవుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ ప్రీమియం యానిమేటెడ్ థియేట్రికల్ అనుభవాన్ని అందించనుంది.

# ఆర్.వి.ఫిల్మ్ హౌస్ తొలి చిత్రం 'కొక్కోరొకో'

యంగ్ టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూ ప్రముఖ దర్శకుడు రమేష్ వర్మ ఆర్.వి.ఫిల్మ్ హౌస్‌ను స్టార్ట్ చేసి నిర్మాతగా మారారు. అందులో భాగంగా శ్రీనివాస్ వసంతల అనే యంగ్ డైరెక్టర్‌ను పరిచయం చేస్తూ 'కొక్కోరొకో' అనే యాంథాలజీని రూపొందించారు. ఐదు విభిన్నమైన పాత్రల ఆధారంగా ఈ మూవీ తెరకెక్కనుంది. సినీ పరిశ్రమకు యంగ్ టాలెంట్‌ను పరిచయం చేయాలనే లక్ష్యంతో రమేష్ వర్మ...శ్రీనివాస్ వసంతల స్టోరీ టెల్లింగ్ సామర్థ్యాన్ని గుర్తించి అతనికి కొక్కోరొకో సినిమాను తెరకెక్కించే ప్రతిష్టాత్మకమైన బాధ్యతను అప్పగించారు. 'కొక్కోరొకో' సినిమా షూటింగ్ పూర్తయ్యింది. ఈ విషయాన్ని మేకర్స్ డిఫరెంట్ పోస్టర్ ద్వారా అనౌన్స్ చేశారు. వినూత్న ఆలోచనలతో డైరెక్టర్ శ్రీనివాస్ వసంతల.. విజువల్ గ్రాండియర్‌గా, బలమైన ఎమోషన్స్ కలగలిపి కొక్కోరొకో సినిమాతో ప్రేక్షకులకు ఓ యూనిక్ సినిమాటిక్ ఎక్స్ పీరియెన్స్‌ను అందించబోతున్నారు.ప్రముఖ రైటర్ జి.సత్యమూర్తి తనయుడు.. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీప్రసాద్ సోదరుడైన ప్రముఖ ప్లే బ్యాక్ సింగర్ జివి సాగర్



# 'శంబాల'తో ఆదికి చిత్రోత్సాహం, నాకు పుత్రోత్సాహం

టీంకు విజయోత్సాహం రావాలని కోరుకుంటున్నాను.. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సాయి కుమార్.. డిసెంబర్ 25న రాబోతోన్న 'శంబాల' అందరికీ కచ్చితంగా నచ్చుతుంది.. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం.. ..'శంబాల' బ్లాక్ బస్టర్ హిట్ అవ్వాలని కోరుకుంటు న్నాను.. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి.. ..డిసెంబర్ 25న 'శంబాల'తో హిట్టు కొట్టబోతోన్నాం.. మహీధర్ రెడ్డి నిర్మించిన చిత్రం 'శంబాల'. యగంధర్ ముని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీలో అర్చన అయ్యర్, స్వసిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ తదితరులు కీలక పాత్రల్ని పోషించారు. ఈ సినిమాను డిసెంబర్ 25న భారీ ఎత్తున రిలీజ్ చేయ బోతోన్నారు. ఈ ఈవెంట్‌కు మంచు మనోజ్, కిరణ్ అబ్బవరం, ప్రియదర్శి, తమన్, అనిల్ రావిపూడి, నవీన్ యెర్నేని, టీజీ విశ్వ ప్రసాద్, అశ్విన్ బాబు, మైత్రి శశి వంటి ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. .. 'శంబాల' మీద ముందు నుంచీ పాజిటివ్ వైబ్ ఉంది. యుగంధర్ ముని మంచి దర్శకుడు. శ్రీ చరణ్ పాకాల గారి ఆర్ఆర్, మ్యూజిక్ నాకు చాలా ఇష్టం. మంచు మనోజ్ మాట్లాడుతూ.. 'శంబాల' ట్రైలర్ బాగుంది. ఆదికి ఈ చిత్రంతో మంచి విజయం రావాలి. చిన్న సినిమా పెద్ద సినిమా అని ఉండదు.. మంచి చిత్రాల్ని ఆడియెన్స్ ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. .'శంబాల' డిసెంబర్ 25న కచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుంది. 'శంబాల'తో ఆదికి చిత్రోత్సాహం, నాకు పుత్రోత్సాహం, టీంకు విజయోత్సాహం రావాలని కోరుకుంటున్నాను. అని అన్నారు. ..తమన్ మాట్లాడుతూ.. .. సాయి కుమార్ గారు, ఆది మంచి మనసు చూసి ఈ రోజు ఇంత మంది ఇక్కడికి వచ్చారు. ఆది చాలా మంచి వ్యక్తి. ఆది 'శంబాల' గురించి ఎప్పుడూ చెబుతూనే ఉంటాడు.



# టీమిండియా 'వైస్'కు బ్రేక్




## గిల్ కెరీర్‌కు పెద్ద సవాల్

## పేలవ ఫామ్, స్ట్రైక్ రేట్ సమస్య

**న్యూఢిల్లీ:** టి20 వరల్డ్ కప్ 2026 కోసం ప్రకటించిన భారత జట్టులో టీమిండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పేరు లేకపోవడం సంచలనమైంది. భవిష్యత్తు సూపర్ స్టార్‌గా, టీమిండియా కాబోయే కెప్టెన్‌గా భావించిన గిల్‌ను కనీసం రిజర్వ్ ఆటగాడిగా కూడా పరిగణించక పోవడం వెనుక ఉన్న పరిణామాలను విశ్లేషిస్తే పలు ఆసక్తికర విషయాలు కనిపిస్తున్నాయి. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ జోడీ టీమ్ కాంబినేషన్ విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. పక్కా వ్యూహంతోనే గిల్‌ను పక్కన పెట్టారనేది స్పష్టమవుతోంది. గిల్‌ను వైస్ కెప్టెన్సీ నుంచి తొలగించి, ఆ బాధ్యతలను అక్షర్ పటేల్‌కు అప్పగించడం ద్వారా బిసిసిఐ ఒక స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చింది. జట్టులో ఆల్ రౌండ్ సామర్థ్యంఉన్న ఆటగాళ్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈ నిర్ణయం చెబుతోంది. అక్షర్ బ్యాటింగ్, బౌలింగ్‌తోపాటు ఫీల్డింగ్‌లోనూ అదనపు బలాన్ని ఇస్తాడు. ఒక స్పెషలిస్ట్ బ్యాటర్ కంటే మ్యాచ్ విన్నర్‌గానిలిచే ఆల్‌రౌండర్లే టి20 ఫార్మాట్‌కు అవసరమని సెలెక్టర్లు గట్టిగా నమ్మడమే గిల్ పక్కన పెట్టబడటానికి అసలు కారణం. గత 15 అంతర్జాతీయ టీ20ల్లో గిల్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. కేవలం 291 పరుగులు మాత్రమే చేయడం, అందులోనూ ఒక్క ఫిఫ్టీ కూడా లేకపోవడం సెలెక్టర్ల నమ్మకాన్ని దెబ్బతీసింది. ముఖ్యంగా సౌతాఫ్రికా వంటి కీలక సిరీస్‌లో విఫలం కావడం అతని అవకాశాలను దెబ్బతీసింది. ఆధునిక టి20 క్రికెట్‌లో ఓపెనర్లు పవర్‌ప్లేను గరిష్టంగా ఉపయోగించుకోవాల్సి ఉండగా, గిల్ ఇన్నింగ్స్ ఆరంభంలో నెమ్మదిగా ఆడుతున్నాడనే విమర్శలు ఉన్నాయి. ఇక టీమిండియాకు అటాకింగ్ బ్యాటర్ల అవసరం అనేది వెల్లడైంది. 2026 ప్రపంచకప్ వేదికలైన భారత్, శ్రీలంకలోని పిచ్‌లు టోర్నమెంట్ సాగుతున్న కొద్దీ నెమ్మదించే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇన్నింగ్స్ ఆరంభం నుంచే బౌలర్లపై విరుచుకుపడే బ్యాటర్లు కావాలని భావిస్తోంది. గిల్ క్లాసిక్ ఆటతీరుకంటే, అభిషేక్ శర్మ వంటి విధ్వంసక ఓపెనర్లు లేదా స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనే సంజూ శామ్సన్ వంటి ఆటగాళ్లు జట్టుకు ఎక్కువ ప్రయోజనకరమని సెలెక్షన్ కమిటీ భావించింది. టాప్ ఆర్డర్‌లోనే వికెట్ కీపింగ్ చేయగలిగే సంజూ, ఇషాన్ కిషన్‌ఉంటే, లోయర్ ఆర్డర్‌లో రింకూసింగ్ వంటి స్పెషలిస్ట్ ఫినిషర్‌కు చోటు కల్పించడం ఈజీ అవుతుంది. రింకూ సింగ్ రాకతో బ్యాటింగ్ డెప్త్ పెరగడం కోసం ఒక టాప్ ఆర్డర్ బ్యాటర్‌ను తగ్గించాల్సి రావడం గిల్‌కు ప్రతికూలంగా మారింది. ఈ నిర్ణయం శుభ్‌మన్ గిల్ కెరీర్‌కు ఒక పెద్ద సవాల్ వంటిది. మళ్లీ తన ఫామ్‌ను నిరూపించు కుని జట్టులోకి రావాలంటే దేశీవాళీ, ఐపిఎల్ ప్రదర్శనలపై ఆధారపడాల్సి ఉంటుంది.





## ఆసియా టూర్ ఫైనల్‌లో..

## గోల్ఫ్ రన్నరప్‌గా శౌర్య

**న్యూఢిల్లీ:** ఆసియా టూర్ క్వాలిఫైయింగ్ ఫైనల్ స్టేజ్‌లో భారత్‌కు చెందిన 22 ఏళ్ల రైజింగ్ స్టార్ శౌర్య భట్టాచార్య రన్నరప్‌గా నిలిచి 2026 ఆసియా టూర్ సీజన్‌కు ఆడే హక్కులను పొందాడు. చివరి రౌండ్‌ను ఒక షాట్ ఆధిక్యంతో ప్రారంభించిన శౌర్య ఆఖరి 7 హోల్స్‌లో మూడింటిలో బోగీలను పడగొట్టే ముందు అగ్రస్థానం కోసం గట్టి పోటీ పడ్డాడు. గోల్ఫ్ క్లబ్‌లో సోమవారం జరిగిన ఐదు రౌండ్ల మొత్తం 16-అండర్-పార్‌తో విజయాన్ని సాధించిన చైనాకు చెందిన లిన్ యుక్సిన్ కంటే ముగింపు రౌండ్ 72 అతనికి ఒక స్ట్రోక్ దూరంలో ఉంది. రెండుసార్లు ఆసియాపసిఫిక్ అమెచ్యూర్ ఛాంపియన్ అయిన లిన్, 67తో భట్టాచార్యను ఓడించి, 15-అండర్ వద్ద ముగించాడు. అగ్రస్థానంలో టై కావడానికి పార్‌ఫోర్ 18వ స్థానంలో పార్ అవసరం కావడంతో శౌర్య హోల్‌ను బోగ్ చేసి రెండవ స్థానానికి సరిపెట్టుకున్నాడు. మరో ముగ్గురు భారత్ ఆటగాళ్లు టాప్ 35లో నిలిచి ఆసియా టూర్ కార్డులను కైవసం చేసుకున్నారు. రషీద్ ఖాన్ 68 స్కోరుతో 7అండర్‌లో టై 15వ స్థానంలో నిలవగా, అజీతేష్ సంధు చివరి రౌండ్ 67తో దూసుకెళ్లి 6అండర్‌లో టై 19వ స్థానంలో ముగించాడు. 5అండర్‌లో టై అయిన 12 మంది ఆటగాళ్లతో జరిగిన ఐదుహోల్ ప్లేఆఫ్ తర్వాత శుభం జగ్లాన్ తుది కార్డును పొందాడు. ఖలీన్ జోషి తృటిలో ఈ రేసును కోల్పోయారు. ఫైనల్ హోల్‌ను బోగీ చేసిన తర్వాత 4అండర్ వద్ద ముగించారు. కార్తీక్ సింగ్ (74), హనీ బైసోయా (78) టై57వ, ఎస్ చిక్కరంగప్ప (73) టై64వ స్థానంలో నిలిచారు, ముగ్గురూ పరిమిత హోదాను పొందారు.

## గ్లోబల్ చెస్ లీగ్ మూడో ఫైనల్‌కు త్రివేణి కింగ్స్




### భారత్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ఓటమి

**న్యూఢిల్లీ:** గ్లోబల్ చెస్ లీగ్ 2025లో హౌ యిఫాన్ పునరాగమనంతో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ వరుసగా మూడో ఫైనల్‌కు చేరుకుంది. ఈ గ్లోబల్ చెస్ లీగ్‌లో హౌ యిఫాన్ తన పాత ప్రత్యర్థి కోనేరు హంపీని ఓడించింది. ఈ లీగ్ మొదటి అర్ధభాగంలో హౌ యిఫాన్ అద్భుతంగా రాణించింది. ఆమె ఆరు ఆటల్లో ఒకదాన్ని మాత్రమే గెలుచుకోగా, మరో రెండింటిని డ్రా చేసుకుని ఇంకో మూడింటిని కోల్పోయింది. అయితే, తరువాత యిఫాన్ వరుసగా మూడు ఆటలను గెలుచుకుంది. రెండు ఆటల్లోనూ నల్లటి పావులతో ఆమె అద్భుతమైన ప్రదర్శన చేసింది. అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హౌ తన పాత ప్రత్యర్థి కోనేరు హంపీతో తలపడింది. మాజీ ప్రపంచ రాపిడ్ మరియు బ్లిట్జ్ ఛాంపియన్ అయిన హంపి ఒక్క గేమ్ కూడా ఓడిపోలేదు. కానీ హౌ ఎండ్ గేమ్ ఆమెను ఓడించింది. ఈ రెండు మ్యాచ్‌ల విజయాలతో ఎస్‌జి పైపర్స్ పాయింట్ల పట్టికలో రెండవ స్థానానికి చేరుకుంది. ప్రస్తుతం ఆ జట్టు 15 మ్యాచ్ పాయింట్లు, 78 గేమ్ పాయింట్లతో ఉంది. కానీ త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ కంటే చాలా వెనుకబడి ఉంది. వాస్తవానికి, డిఫెండింగ్ ఛాంపియన్, గంగాస్ గ్రాండ్‌మాస్టర్స్‌పై 14-5 తేడాతో విజయం సాధించిన తర్వాత, ఇంకా ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే మళ్లీ ఫైనల్‌కు చేరుకుంది.

## 3వ టెస్ట్‌లో.. న్యూజిలాండ్ ఘన విజయం




### వెస్టిండీస్‌ను ఓడించి సిరీస్ కైవసం

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఘన విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. మూడో టెస్టులో కివీస్ 323 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించి, 2-0 సిరీస్ విజయాన్ని సాధించింది. 462 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ సెకండ్ ఇన్నింగ్స్‌లో 138 పరుగులకే కుప్పకూలింది. 43/0 ఓవర్ నైట్ స్కోర్‌తో ఐదో రోజు మోంట్ మోంగనుయ్‌లో సోమవారం ఆటను ప్రారంభించిన కరేబియన్ జట్టు 95 పరుగుల వ్యవధిలోనే మొత్తం 10 వికెట్లు కోల్పోయింది. కివీస్ బౌలర్ల ధాటికి వెస్టిండీస్ బ్యాటర్లు విలవిల్లాడారు. ఓపెనర్ బ్రాండెన్ కింగ్ (67) మినహా మిగిలిన ప్లేయర్లంతా దారుణంగా విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫీ మరోసారి 5 వికెట్లతో సత్తా చాటగా, అజాజ్ పటేల్ 3 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు నష్టానికి 575 పరుగులు చేసింది. ఓపెనర్ డెవాన్ కాన్వే (227) డబుల్ సెంచరీతో చెలరేగగా టామ్ లాథమ్ (137) కదం తొక్కాడు. అనంతరం విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 420 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (63), జాన్ కాంప్‌బెల్ (45) మంచి ఆరంభం ఇవ్వగా, కవేమ్ హాడ్జ్ (123) అజేయ సెంచరీతో ఆకట్టుకున్నాడు. తర్వాత రెండో ఇన్నింగ్స్‌లోనూ కివీస్ ఓపెనర్లు దంచికొట్టారు. కాన్వే (101), లాథమ్స్ (101) సెంచరీలతో మెరిశారు. దీంతో కివీస్ రెండో ఇన్నింగ్స్‌ను 306/2 వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన ఆధిక్యాన్ని జోడించి విండీస్ ముందు 452 లక్ష్యాన్ని బ్లాక్ క్యాప్స్ ఉంచింది. ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించలేక కరేబియన్ జట్టు చతికిలపడింది.

## విజయ్ హజారే ట్రోఫీ జట్టులో..

## గిల్, అర్ష్‌దీప్, అభిషేక్‌కు చోటు



**న్యూఢిల్లీ:** భారత ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ మరియు అభిషేక్ శర్మ, పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు, పంజాబ్ 18 మందితో కూడిన విజయ్ హజారే ట్రోఫీ జట్టులో చోటు దక్కించుకున్నారు. ఈ ముగ్గురితో పాటు, జట్టులో ప్రభ్‌సిమ్రాన్ సింగ్, నమన్ ధీర్, అన్మోల్‌ప్రీత్ సింగ్, రమణ్‌దీప్ సింగ్, సన్వీర్ సింగ్, హర్‌ప్రీత్ బ్రార్, గుర్నూర్ బ్రార్ మరియు క్రిష్ భగత్ కూడా ఉన్నారు. గత సీజన్‌లో క్వార్టర్ ఫైనలిస్టులుగా నిలిచిన పంజాబ్, ఎలైట్ గ్రూప్ సిలో ఉంది. ఈ నెల 24న మహారాష్ట్రతో తమ ప్రచారాన్ని ప్రారంభిస్తుంది. జైపూర్‌లో ఏడు లీగ్ మ్యాచ్‌లను ఆడుతుంది. లీగ్‌దశ మ్యాచ్‌లు జనవరి 8న ముగుస్తాయి. అయితే, గిల్, అభిషేక్ మరియు అర్ష్‌దీప్‌ల లభ్యత అస్పష్టంగానే ఉంది, ఎందుకంటే జనవరి 11 నుండి న్యూజిలాండ్‌తో భారత్ మూడు వన్డేలు, ఆ తర్వాత జనవరి 21 నుండి ఐదు టీ20లు ఆడనుంది. టీ20 ప్రపంచ కప్, న్యూజిలాండ్ టీ20 ల కోసం జట్టు నుండి తొలగించబడిన శుభమాన్ గిల్ ఒడిఐ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు, అభిషేక్ మరియు అర్ష్‌దీప్ టీ20 జట్టులో భాగంగా ఉంటారు. కాగా అంతకుముందు, విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్ ఇప్పటికే ఢిల్లీ జట్టు ప్రాబబుల్స్ జాబితాలో ఉన్నారు. ఈ జంట జనవరి 11 నుండి 17, 2026 వరకు న్యూజిలాండ్‌తో జరిగే భారత వన్డే సిరీస్ వరకు ఢిల్లీకి అందుబాటులో ఉంటారు. ఇంతలో, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా విజయ్ హజారే ట్రోఫీ మొదటి రెండు ఆటలకు ముంబై జట్టులో చోటు దక్కించుకున్నాడు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.